సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 247
మంగళవారం 21-5-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



ఫైనల్ వేటలో ఎవరిదో జోరు!
నేడు ఐపీఎల్ తొలి క్వాలిఫయర్‌లో కోల్‌కతాతో సన్‌రైజర్స్ ఢీ - 12లో



సానుకూల సంకేతాలు
ఈ వారం మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల అంచనా - 13లో



దక్షిణాన కాషాయ జెండా
దక్షిణ భారతదేశంలో ఈసారి బీజేపీయే అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.
వివరాలు 6లో ▸



మార్పు గాలి బలంగా వీస్తోంది
దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు.
వివరాలు 6లో ▸



ఏడాదిన్నరలో నాలుగోసారి..
నేపాల్ ప్రధాని ప్రచండ విశ్వాస తీర్మానం నెగ్గారు. ప్రధాని పగ్గాలు చేపట్టాక పార్లమెంట్ విశ్వాసం పొందడం ఇది నాలుగోసారి.
వివరాలు 6లో ▸



ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం
ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో పికప్ వ్యాన్ అదుపుతప్పి 20 అడుగుల లోతులో పడిపోగా 19 మంది మృత్యువాత పడ్డారు.
వివరాలు 6లో ▸



పద్ధతి ప్రకారం పరిహారం
- 6 ప్రామాణికాలు ఆధారంగా కరువు మండలాల గుర్తింపు
- ఆ సమయంలోనే పంట నష్టంపై అంచనాల రూపకల్పన
- రెండు నెలల పాటు అడ్డుకున్న చంద్రబాబు బృందం

2 లో



నేడే తిరుపతి గంగ జాతర ముగింపు
- వారం రోజులుగా వివిధ వేషాల్లో భక్తులు
- నేడు అమ్మవారి విశ్వరూప ప్రతిమ
- గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

3 లో

బదిలీలతో బరితెగింపు
ఎన్నికల సందర్భంగా జరిగిన హింసపై డీజీపీకి సిట్ నివేదిక

దాడులు అరికట్టడం, కేసుల దర్యాప్తులో పోలీసులు విఫలం

పోలింగ్‌కు ముందు ఆకస్మిక బదిలీలతో యథేచ్ఛగా విధ్వంసకాండ

దర్యాప్తు సక్రమంగా లేదు.. అదనపు సెక్షన్లు చేర్చాలి



డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు నివేదిక సమర్పిస్తున్న సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్ లాల్. చిత్రంలో ఎస్పీ రమాదేవి

సాక్షి, అమరావతి: ఎన్నికల వేళ పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో విధ్వంస కాండను అరికట్టడం, అనంతరం కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులు విఫలమయ్యారని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ధారించింది. నిందితులపై కీలక సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకపోవడాన్ని ప్రస్తావించింది. మూడు జిల్లాల్లో హింసాత్మక సంఘటనలపై విచారించిన సిట్ బృందం ఇన్‌చార్జ్ వినీత్ బ్రిజ్‌లాల్ ప్రాథమిక నివేదికను సోమవారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు అందచేశారు. రెండు రోజుల పాటు విస్తృతంగా విచారణ నిర్వహించిన సిట్ అధికారుల బృందం పోలీసుల వైఫల్యాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. పూర్తి నివేదిక అందించేందుకు మరికొంత

మిగతా 2వ పేజీలో ▸

33 కేసులు

1,370 మంది నిందితులు

పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో పోలింగ్ సందర్భంగా దాడులు, దౌర్జన్యకాండపై ఇప్పటివరకు 33 కేసులు నమోదు చేశారు. పల్నాడు జిల్లాలో 22,అనంతపురం జిల్లాలో 7, తిరుపతి జిల్లాలో 4 కేసులు నమోదయ్యాయి. మొత్తం 1,370 మందిని నిందితులుగా పేర్కొనగా ఇప్పటివరకు 124 మందిని అరెస్ట్ చేశారు. మరో 94 మందికి సెక్షన్ 41 ఏ కింద నోటీసులు జారీ చేశారు.

తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్సులోని ఓ పర్వతం వద్ద కనిపించిన హెలికాప్టర్ శిథిలాలు





ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

హెలికాప్టర్ కూలిన ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ తదితరుల మృతి

మహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించిన సుప్రీం లీడర్ అయోతొల్లా

ఇరాన్ తూర్పు అజర్‌బైజాన్ పర్వతసానువుల్లో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఆ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ (63) ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దట్టమైన అటవీ ప్రాంతంలో కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దుల్లాహియాన్(60), ఈస్ట్ అజర్‌బైజాన్ ప్రావిన్స్ గవర్నర్ మాలిక్ కూడా చనిపోయారని ఇరాన్ అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది. రైసీ మరణం నేపథ్యంలో ప్రస్తుత ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక దేశాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఖమేనీ ప్రకటించారు.

6 లో

విస్తరిస్తున్న 'నైరుతి'
3 రోజులు తేలికపాటి వర్షాలు



నైరుతి రుతుపవనాల విస్తరణ కొనసాగుతోంది. ఇవి రానున్న 2 రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, దక్షిణ బంగాళాఖాతం, కొమరిన్, అండమాన్, నికోబార్ దీవుల్లోని మిగిలిన భాగాలకు విస్తరించనున్నాయి. మరోవైపు దక్షిణ కోస్తా తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. అలాగే దక్షిణ కోస్తా తమిళనాడు మీదుగా ద్రోణి ఉంది. మరోపక్క రాష్ట్రంపైకి ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. వీటా ఫలితంగా రానున్న 3 రోజులు వర్షాలకు ఆస్కారముంది.

2 లో

ఇట్లు.. ఇటలీకి!
దుబాయ్‌లో చంద్రబాబు దాగుడు మూతలు
గప్‌చుప్‌గా విదేశాలకు ఉడాయించిన వైనం

వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్తున్నట్లు లీకులు

- అబ్బే.. ఇటు రాలేదన్న టీడీపీ ఎన్నారై విభాగం నేత
- టీడీపీ అధినేత ఇటలీలో ప్రత్యక్షమైనట్లు సమాచారం
- గతంలో విదేశాల నుంచే షెల్ కంపెనీలకు అక్రమ నిధుల మళ్లింపు
- స్కిల్ స్కామ్‌లోనూ బాబు దుబాయ్ బంధం
- ఈసారి అదే షెల్ దందాయేనా..!
- గోప్యంగా విదేశీ పర్యటన వెనుక లోగుట్టు అదే

3 లో





ఇదండీ సంగతి!



అలా చేస్తే ఎలా సార్! మళ్లీ మనం ప్రతిపక్షాల మీద రివెంజ్ తీసుకోవాలిగా!

ఐదో విడతలో 59.06%
6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 స్థానాల్లో పోలింగ్



- స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ఓటింగ్.. బారాముల్లాలో రికార్డు స్థాయిలో 59 శాతం
- 428 లోక్‌సభ స్థానాల్లో ముగిసిన ఎన్నికలు.. మిగతా 115 స్థానాలకు మే 25, జూన్ 1న పోలింగ్

- వివరాలు 6లో

సెల్‌ఫోన్‌తో హై బీపీ!

మొబైల్ ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడితే అధిక రక్తపోటు (హై బీపీ) ప్రమాదం పొంచి ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దైనందిన జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న సెల్‌ఫోన్లతో అంతే స్థాయి అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారానికి అరగంట కంటే ఎక్కువసేపు ఫోన్‌లో మాట్లాడేవారిలో దుష్ప్రభావాలు తీవ్ర స్థాయిలో ఉంటున్నాయని, 'యూరోపియన్ హార్ట్ జర్నల్ - డిజిటల్ హెల్త్'లో పేర్కొన్నారు.

3 లో





క్లుప్తంగా...

సస్పెండ్ అయిన డీఎస్పీల స్థానంలో కొత్తవారి నియామకం

సాక్షి, అమరావతి: ఎన్నికల అనంతరం హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన పోలీసు ఉన్నతాధికారులు, క్షేత్ర స్థాయి పోలీసుల స్థానాల్లో కొత్త వారిని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్పీగా ఎం.సుధాకరరావు, గురజాల డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాసరావు, తిరుపతి డీఎస్పీగా కె.రవిమనోహర్ చారి, తాడిపత్రి డీఎస్పీగా కె.జనార్దన్‌నాయుడు, తిరుపతి ఎస్బీ డీఎస్పీగా ఎం.వెంకటాద్రిలను నియమించింది. అదేవిధంగా సస్పెండ్ అయినవారి స్థానాల్లో మరో ఏడుగురు క్షేత్రస్థాయి పోలీసు అధికారులను కూడా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

తడ రైల్వేస్టేషన్ నుంచి కొబెల్కో ఉత్పత్తుల రవాణా

మొదటిసారిగా జైపూర్‌కు 35 ఎక్స్‌కవేటర్లు తరలింపు

తడ (తిరుపతి జిల్లా): ఎట్టకేలకు శ్రీసిటీ ఉత్పత్తులు తడ రైల్వేస్టేషన్ నుంచి రవాణా ప్రారంభం కావడంతో శ్రీసిటీలోని పరిశ్రమల ప్రతినిధులతో పాటు స్థానికుల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. శ్రీసిటీ పారిశ్రామికవాడలోని కొబెల్కో పరిశ్రమలో తయారైన 35 ఎక్స్‌కవేటర్లను (మట్టిని తవ్వే యంత్రం) తడ రైల్వే స్టేషన్ నుంచి సరుకు రవాణా రైలు ద్వారా సోమవారం తరలించారు. తడ నుంచి రాజస్థాన్‌లోని జైపూర్‌కు తరలిన ఈ రవాణా 'మేడ్ ఎట్ శ్రీసిటీ' పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించి మొట్టమొదటి ప్రత్యక్ష రైలు రవాణా ఇదే కావడం విశేషం. ఉత్తర భారత దేశానికి రైలు రవాణా దిశగా పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా తమ భారీ వాహనాల రవాణాకు ఈ సదుపాయాన్ని ఎంచుకున్నట్లు కొబెల్కో పేర్కొంది. తడ రైల్వే స్టేషన్ నుంచి సరుకు రవాణా ప్రారంభం కావడం పట్ల శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

224 కేసుల నమోదు

వివిధ ప్రాంతాల్లో తూనికలు కొలతలు అధికారుల దాడులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్పీజీ డీలర్లు, నిత్యావసర, ఎలక్ట్రికల్–హార్డ్‌వేర్ దుకాణాలపై తూనికలు కొలతలు శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్టు పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫిషియో సెక్రటరీ హెచ్.అరుణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వినియోగదారు హెల్ప్‌లైన్ పోర్టల్, వినియోగదారు హెల్ప్‌లైన్ నంబర్ 1967కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విశాఖ, టెక్కలి, ఇచ్ఛాపురం, అమలాపురం, కొవ్వూరు, నందిగామ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాలలో ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాయని తెలిపారు. నిత్యావసరాల బరువు తక్కువగా ఉండటం, తూకాల్లో తేడాలు, ఎమ్మార్పీ కంటే అధికంగా వసూలు, ప్యాకింగ్ చేసిన వస్తువులపై డిక్లరేషన్లు లేకపోవడాన్ని గుర్తించారని తెలిపారు. 386 తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించినందుకు 224 కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఎల్పీజీ డీలర్లపై 39, నిత్యావసరాల దుకాణాల(గ్రాసరీస్ చైన్ స్టోర్స్)పై 82, ఎలక్ట్రికల్–హార్డ్‌వేర్ షాపులపై 103 కేసులున్నాయన్నారు.

డిసెంబర్ 15న విశాఖలో నేవీ మారథాన్

సాక్షి, విశాఖపట్నం: నేవీ డే సందర్భంగా విశాఖ వేదికగా నిర్వహించే మారథాన్‌ను ఈ ఏడాది డిసెంబర్ 15న నిర్వహించనున్నట్లు తూర్పు నౌకాదళం అధికారికంగా ప్రకటించింది. వైజాగ్ నేవీ మారథాన్–2024 పేరుతో 9వ ఎడిషన్‌కు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. నాలుగు విభాగాల్లో ఈ పరుగు పోటీలను నిర్వహించనుంది. రన్ ఫర్ ఫన్ పేరుతో 5కే, హెల్త్ రన్ పేరిట 10 కే, 21.1 కి.మీ. హాఫ్ మారథాన్‌తో పాటు 42.2 కి.మీ. ఫుల్ మారథాన్‌కు ఏర్పాట్లు చేపట్టామని అధికారులు తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ ఫుల్ మారథాన్ జరగనుంది. త్వరలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నారు.

జనన, మరణ ధ్రువపత్రాల జారీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి : జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి 2023 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. పునరుద్ధరించిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్ఎస్) పోర్టల్‌పై అన్ని జిల్లాల డీఎంహెచ్‌వో, ఇతర అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడలో సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ల ద్వారా నూతన విధానంపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రసవం అనంతరం ప్రభుత్వాస్పత్రి నుంచి డిశ్చార్జి సమయంలోనే సూపరింటెండెంట్‌లు జనన ధ్రువీకరణ పత్రాల్ని జారీ చేయాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఎక్కడైనా ఎప్పుడైనా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించాలన్నారు.

బెంగళూరు రేవ్ పార్టీలో తెలుగు రాష్ట్రాల ప్రముఖులు!

- నగర శివార్లలోని ఫార్మ్‌హౌస్‌లో 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరిట పార్టీ
- రేవ్ పార్టీని ధ్రువీకరించిన బెంగళూరు పోలీసులు
- హైదరాబాద్‌కు చెందిన వాసు నిర్వహించినట్లు అనుమానాలు
- తాము ఉన్నామనే వార్తలు ఖండించిన సినీనటులు శ్రీకాంత్, హేమ



నిందితులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

సాక్షి బెంగళూరు: బెంగళూరు నగర శివార్లలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆదివారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు జరిగిన రేవ్ పార్టీలో బెంగళూరుతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నట్టు అందుతున్న సమాచారం కలకలం రేపుతోంది. పుట్టినరోజు వేడుకల పేరిట ఎలక్ట్రానిక్ సిటీ సింగేనా అగ్రహారలో ఉన్న ఫార్మ్‌హౌస్‌లో ఈ రేవ్ పార్టీ జరిగింది. ఈ మేరకు అందిన పక్కా సమాచారంతో సీసీబీ యాంటీ నార్కోటిక్స్ విభాగం అధికారులు డీసీపీ శ్రీనివాసగౌడ నేతృత్వంలో రేవ్ పార్టీపై దాడి చేశారు. మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 25 మందికి పైగా యువతులున్నట్టు అధికారులు చెప్పారు. ఇదిలా ఉండగా, ఐదుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

వారికి వైద్య పరీక్షలు

రేవ్‌పార్టీ జరిగినట్లు బెంగళూరు పోలీసులు ధ్రువీకరించారు. అయితే పార్టీలో ప్రముఖులు ఎవరెవరు ఉన్నదీ వెల్లడించలేదు. అదనపు పోలీస్ కమిషనర్ డాక్టర్ చంద్రగుప్తా సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. బెంగళూరు పోలీసులు ఒక ప్రకటన సైతం జారీ చేశారు. రేవ్ పార్టీకి సంబంధించి ఐదుగురిని అరెస్టు చేశామని, ఎలక్ట్రానిక్ సిటీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పాల్గొన్నవారిని అదుపులోకి తీసుకున్నామని, రక్తం నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామన్నారు. రేవ్‌పార్టీలో 100 మంది ఉన్నారని, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి తనిఖీలు చేపట్టామని, కొన్ని మాదకద్రవ్యాలు లభించాయని వివరించారు. 'సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ' పేరిట రేవ్ పార్టీ జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. సుమారు 15.56 గ్రా. ఎండీఎంఏ, 6.2 గ్రా. హైడ్రో గంజాయి, కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జీఆర్ ఫార్మ్‌హౌస్‌లో పార్టీ

హెబ్బగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలో కాన్‌కార్డు యజమాని గోపాలరెడ్డి పేరిట ఉన్న జీఆర్ ఫార్మ్‌హౌస్‌లో ఈ పార్టీ జరిగింది. హైదరాబాద్‌కు చెందిన వాసు అనే వ్యక్తి ఈ పార్టీని నిర్వహించినట్లు తెలిసింది. ఈ పార్టీ కోసం విమానాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నటీనటులు, మోడళ్లు, టెక్కీలు పాల్గొన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.50 లక్షల వరకు వ్యయం

నగరం నడిబొడ్డున ఇంత పెద్దయెత్తున రేవ్ పార్టీ నిర్వహిస్తే పోలీసుల నుంచి ఇబ్బందులు రావొచ్చని భావించి నగర శివార్లలో నిర్వహించినట్లు సమాచారం. ఈ ఒక్కరోజు పార్టీ కోసం సుమారు రూ.30 లక్షల నుంచి రూ. 50 లక్షల మేర ఖర్చు చేసినట్లు తెలిసింది. దాడి చేసేందుకు వచ్చిన పోలీసులను గమనించగానే నిర్వాహకులు తలుపులు మూసేశారు. అయితే వారు బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లారు. అప్పటికే కొందరు డ్రగ్స్‌ను దాచి పెట్టారు. కొంతమంది తమ వద్ద ఉన్న మాదకద్రవ్యాలను టాయిలెట్ కమోడ్‌లలో వేసి ఫ్లష్ చేశారు. కాగా పోలీసులు ఫార్మ్‌హౌస్‌ను క్షుణ్ణంగా గాలించారు. ముగ్గురు డ్రగ్ పెడ్లర్లతో పాటు నిర్వాహకుడు వాసు, మరొకరు ఇలా.. మొత్తం ఐదు మందిని అరెస్టు చేశారు. వాసు పుట్టినరోజు పార్టీ నిర్వాహకులు అరుణ్, సిద్ధిఖి, రణబీర్, నాగబాబులను అదుపులోకి తీసుకున్నారు. పరప్పన అగ్రహార పోలీసుస్టేషన్‌లో ఈ పార్టీకి అనుమతులు తీసుకున్నట్లు వాసు చెబుతున్నప్పటికీ అది అవాస్తవమని తెలుస్తోంది. పార్టీకి వచ్చిన వారు ఫార్మ్‌హౌస్ లోపలికి వెళ్లాలంటే సెక్యూరిటీ పాస్‌వర్డ్ చెప్పేలా ఏర్పాటు చేసినట్లు సమాచారం. రేవ్ పార్టీలో తెలుగు నటులు హేమ, శ్రీకాంత్, డ్యాన్స్ మాస్టర్ జానీ కూడా పాల్గొన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే తాము ఆ పార్టీలో పాల్గొనలేదని వీడియో బైట్ల ద్వారా వారు వివరణ ఇచ్చారు. అయితే హేమ మాత్రం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఆమె విడుదల చేసిన వీడియో హైదరాబాద్‌లో తీసింది కాదని, ఆ ఫార్మ్‌హౌస్ లోపలే హేమ వీడియో బైట్ ఇచ్చినట్లు ఆమె ధరించిన దుస్తుల ఆధారంగా అనుమానిస్తున్నారు.

నేను నా ఇంట్లోనే ఉన్నా: శ్రీకాంత్

బెంగళూరు రేవ్ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ చెప్పారు. ఈ మేరకు తన ఇంట్లో నుంచే ప్రత్యేకంగా వీడియోను విడుదల చేశారు. 'నేను హైదరాబాద్‌లోని మా ఇంట్లోనే ఉన్నాను. నేను బెంగళూరు రేవ్ పార్టీకి వెళ్లినట్లు, పోలీసులు అరెస్టు చేశారనే వార్తలతో కొందరు నాకు ఫోన్ చేశారు. నేను కూడా వీడియో క్లిప్స్ చూశా. కొంతమంది మీడియా మిత్రులు నాకు ఫోన్ చేసి క్లారిటీ తీసుకున్నారు. కొన్నింటిలో మాత్రం నేను వెళ్లాననే వార్తలు వచ్చాయి. అవి చూసి నేను, మా కుటుంబ సభ్యులందరం నవ్వుకున్నాం. అలా వార్తలు రాసిన వాళ్లు తొందరపడటంలో తప్పులేదనిపించింది. ఎందుకంటే రేవ్ పార్టీలో దొరికిన అతనెవరో కానీ, కొంచెం నాలాగే ఉన్నాడు. నేనే షాకయ్యా. నేను రేవ్ పార్టీలకు, పబ్స్‌కు వెళ్లే వ్యక్తిని కాను. రేవ్ పార్టీ ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు. దయచేసి తప్పుడు కథనాలను నమ్మొద్దు..' అని శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.

నేను హైదరాబాద్‌లోనే చిల్ అవుతున్నా..: సినీ నటి హేమ

బెంగళూరులో నన్ను అరెస్ట్ చేశారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కానీ నేను హైదరాబాద్‌లోనే ఉన్నా. ఓ ఫామ్‌హౌస్‌లో చిల్ అవుతున్నా. బెంగళూరులో ఎలాంటి పార్టీకి వెళ్లలేదు నన్ను అనవసరంగా ఇందులోకి లాగుతున్నారు. నాపై వస్తున్న వార్తల్లో నిజం లేదు.

బదిలీలతో బరితెగింపు

▶ మొదటి పేజీ తరువాయి

సమయం పడుతుందని పేర్కొంది.

బదిలీ చేసిన జిల్లాల్లోనే హింస

పోలింగ్‌కు ముందు చంద్రబాబు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ఒత్తిడి తెచ్చి పల్నాడు నుంచి అనంతపురం వరకు ఏకంగా 39 మంది పోలీసు అధికారులను బదిలీ చేయించిన విషయం తెలిసిందే. వారి స్థానాల్లో పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని అధికారులనే ఈసీ నియమించడం గమనార్హం. ఈ క్రమంలో పోలింగ్ రోజు మే 13న, అనంతరం టీడీపీ గూండాలు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడ్డారు. ఈసీ నియమించిన పోలీసు అధికారులు శాంతి భద్రతల పరిరక్షణలో దారుణంగా విఫలమయ్యారు. అనంతరం కేసుల నమోదు, దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

అదనపు సెక్షన్లు చేర్చండి..

విధ్వంస కాండపై పోలీసుల దర్యాప్తు తూతూ మంత్రంగా ఉందని సిట్ స్పష్టం చేసింది. నిందితులను పట్టుకునేందుకు అదనపు బృందాలను ఏర్పాటు చేయడంతోపాటు అదనంగా మరికొన్ని సెక్షన్లు జోడించాలని సూచించింది. అందుకోసం న్యాయస్థానాల్లో మెమో దాఖలు చేయాలని పేర్కొంది. నిందితులను త్వరగా అరెస్టు చేయడంతోపాటు ముందస్తు తేదీతో చార్జ్‌షీట్లను దాఖలు చేయాలని పేర్కొంది. పోలింగ్ సందర్భంగా దాడుల కేసుల దర్యాప్తును తాము పర్యవేక్షిస్తామని సిట్ స్పష్టం చేసింది.

నాలుగు బృందాలు..

వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ నాలుగు బృందాలుగా ఏర్పడి శని, ఆదివారాల్లో విచారణ నిర్వహించింది. పల్నాడు జిల్లాలో రెండు బృందాలు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఒక్కో బృందం పర్యటించి హింసాత్మక సంఘటనలు జరిగిన ప్రదేశాలను పరిశీలించాయి. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాయి. పోలీసు అధికారులను విచారించడంతోపాటు మొత్తం పరిస్థితిని సమీక్షించాయి.

ఐదేళ్లలో మూలధన వ్యయం రూ.87,972 కోట్లు

- 2023–24 ఆర్థిక ఏడాది ప్రాథమిక అకౌంట్స్ వెల్లడించిన కాగ్
- బడ్జెట్ అంచనాలను మించిన ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వ్యయం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లలో మూల ధన వ్యయం రూ.87,972 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ అకౌంట్స్ తెలిపాయి. 2023–24 ఆర్థిక ఏడాదికి సంబంధించి ప్రాథమిక అకౌంట్స్‌ను కాగ్ వెల్లడించింది. 2023–24 ఆర్థిక ఏడాదిలో రూ.23,589 కోట్లు మూల ధన వ్యయం చేసినట్లు పేర్కొంది. మూల ధన వ్యయం అంటే ఆస్తుల కల్పన వ్యయంగా కాగ్ పరిగణిస్తుంది. అలాగే, ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వ్యయం బడ్జెట్ కేటాయింపులకు మించి అయినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఉద్యోగుల వేతనాల కోసం రూ.50,882 కోట్లు కేటాయించగా రూ.52,010 కోట్లు వ్యయం అయ్యాయని, పెన్షన్ కోసం బడ్జెట్‌లో రూ.21,183 కోట్లు కేటాయించగా రూ.21,694 కోట్లు వ్యయం అయ్యాయని పేర్కొంది. సామాజిక రంగం వ్యయంలో (విద్య, వైద్యం, మంచినీటి సరఫరా, ఎస్సీ, ఎస్టీ తదితర సంక్షేమాలకు) రూ.1,10,375 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. సాధారణ సేవలకు రూ.67,281 కోట్లు, ఆర్థిక సేవలకు రూ.57,344 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించింది. 2023–24 ఆర్థిక ఏడాది మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో 91.97% వ్యయం చేసినట్లు తెలిపింది. 2023–24 ఆర్థిక ఏడాదిలో రెవెన్యూ లోటు రూ.–37,468 కోట్లు ఉండగా ద్రవ్య లోటు రూ.–61,765 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది.

గత ఐదేళ్ల బడ్జెట్‌లో మూల ధన వ్యయం ఇలా..

ఆర్థిక ఏడాది	మూల ధన వ్యయం (రూ.కోట్లలో)
2019-20	17,601
2020-21	20,690
2021-22	18,511
2022-23	7,581
2023-24	23,589
మొత్తం	రూ. 87,972

కుమ్మక్కుతో విధ్వంసకాండ

- కాల్ డేటా విశ్లేషించి కఠిన చర్యలు తీసుకోవాలి
- సిట్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ నేతలు

కొందరు పోలీసు అధికారులు టీడీపీతో కుమ్మక్కై విధ్వంస కాండకు కొమ్ము కాశారని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. పోలింగ్ రోజు, అనంతరం టీడీపీ రౌడీమూకల విధ్వంసకాండపై పారదర్శకంగా విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. దాడులు జరిగిన ప్రాంతాల్లో ఎస్పైలు, సీఐల కాల్ డేటా సేకరించి విచారణ నిర్వహించాలని కోరింది. ఈ కేసులపై విచారణ నిర్వహిస్తున్న సిట్ ఇన్‌చార్జ్ వినీత్ బ్రిజ్‌లాల్‌ను మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం సోమవారం కలిసింది. టీడీపీ నేతలు, ఆ పార్టీ గూండాలు పక్కా పన్నాగంతో ఎలా దాడులకు పాల్పడ్డారో వివరిస్తూ ఆధారాలను అందచేసింది. మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, రావెల కిషోర్ బాబు, మల్లాది విష్ణు, కై లే అనిల్‌కుమార్, లేళ్ల అప్పిరెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు ఈ బృందంలో ఉన్నారు. అనంతరం డీజీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు మీడియాతో మాట్లాడారు.

బదిలీలు చిన్న విషయం కాదు: అంబటి రాంబాబు, జలవనరుల శాఖ మంత్రి

చంద్రబాబు, పురందేశ్వరి ఈసీపై ఒత్తిడి తెచ్చి ఎన్నికల ముందు పోలీసు అధికారులను మార్చి అల్లరి మూకలను దాడులకు పురిగొల్పారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న పోలీసు అధికారులను బదిలీ చేయించడంతో టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. అధికారులను బదిలీ చేసిన ప్రాంతాల్లోనే దాడులు, విధ్వంసం చోటుచేసుకున్నాయి. అప్పటికప్పుడు ఐపీఎస్ అధికారులను మార్చడం చిన్న విషయం కాదు. టీడీపీ పన్నాగంలో పోలీసు అధికారులు పావులుగా మారడం దురదృష్టకరం.

అనంతపురం జిల్లాలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేసి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. చాలా గ్రామాల్లో ఇప్పటికీ పరిస్థితులు కుదుట పడలేదు. మా పార్టీ నేతలపై జరిగిన దాడులపై ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసులు పెట్టడం లేదు. టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే తడవు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రజాబలంతో ఎదుర్కోలేక గూండాగిరి: మంత్రి జోగి రమేష్

వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ బాబు కుట్రలకు దిగారు. ప్రజా మద్దతులేని టీడీపీ కూటమి ఎన్నికలను ఎదుర్కోలేక దౌర్జన్యాలకు తెర తీసింది. అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

హక్కులు కాలరాశారు: రావెల కిషోర్ బాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు టీడీపీ విధ్వంసకాండకు పాల్పడింది. వారిని గ్రామాల నుంచి తరిమేశారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను కాలరాసిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

5.27 లక్షల పొదుపు సంఘాలకు రూ.32,190 కోట్లు

- 2024–25 పొదుపు సంఘాల రుణ ప్రణాళికకు ఆమోదం
- పొదుపు సంఘాలకు ఏటా అత్యధిక రుణాలు ఇచ్చే రాష్ట్రాల్లో ఏపీనే ఫస్ట్

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఏప్రిల్ 1తో మొదలైన 2024–25 ఆర్థిక ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా 5,27,900 పొదుపు సంఘాలకు రూ.32,190 కోట్ల రుణాలు పంపిణీ చేయాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇటీవల కాలంలో లక్ష మంది మహిళలు కొత్తగా ఏర్పాటు చేసుకున్న 8,400 పొదుపు సంఘాలకు తొలిసారి రుణాలు అందించడంతో పాటు గతంలో ఏర్పడి ఇప్పటికే బ్యాంక్‌ల నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించిన 5.19 లక్షల సంఘాలకు మరో విడత రుణాల పంపిణీ చేసేందుకు అధికారులు కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ముగిసిన ఆర్థిక ఏడాదిలో ముందుగా నిర్ధారించుకున్న పొదుపు సంఘాల రుణ లక్ష్యానికి రెట్టింపుగా రుణాలు పంపిణీ చేపట్టినట్లు అధికారులు చెప్పారు. 2023–24 ఆర్థిక ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం 5.39 లక్షల సంఘాలకు రూ.20,437 కోట్ల మేర రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆర్థిక ఏడాది ముగిసే నాటికి రూ.42,533 కోట్ల రుణాలను అందించినట్లు వివరించారు. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలోనూ నిర్ధారించిన లక్ష్యానికి మించే పొదుపు సంఘాల మహిళలకు రుణ పంపిణీ చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

ఏపీనే టాప్..

పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలందించే అంశంలో దేశంలోనే ఏపీ తొలి స్థానంలో ఉన్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ..2024–25లో 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి రూ.1.43 లక్షల కోట్లు ఆయా రాష్ట్రాల్లోని పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించాలని లక్ష్యం పెట్టుకోగా, అందులో రూ.32,190 కోట్ల మేరకు ఏపీలో పొదుపు సంఘాలకు రుణాలు అందించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు అధికారులు చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సమాచారం మేరకు దేశంలో మరో 3 రాష్ట్రాలే రూ.10,000కు పైబడి ఆయా రాష్ట్రాల్లోని పొదుపు సంఘాల రుణ లక్ష్యాలు నిర్ధారించుకున్నట్లు వివరించారు.

విస్తరిస్తున్న 'నైరుతి'

- మూడు రోజులు తేలికపాటి వర్షాలు
- నేడు 28 మండలాల్లో వడగాడ్పులు
- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల విస్తరణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ రుతుపవనాలు ఆదివారం దక్షిణ అండమాన్ సముద్రం, మాల్దీవులు, కొమరిన్, నికోబార్ దీవుల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. ఇవి రానున్న రెండు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, దక్షిణ బంగాళాఖాతం, కొమరిన్, అండమాన్, నికోబార్ దీవుల్లోని మిగిలిన భాగాలకు విస్తరించనున్నాయి. మరోవైపు దక్షిణ కోస్తా తమిళనాడు, దాని పరిసర ప్రాంతాలపై సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి, నైరుతి దిశగా వంగి ఉంది. అలాగే దక్షిణ కోస్తా తమిళనాడు మీదుగా ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర అంతర్గత కర్నాటక వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి ఉంది. మరోపక్క రాష్ట్రంపైకి ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా రానున్న మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) తెలిపింది. ప్రధానంగా మంగళవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలతో పాటు రాయలసీమలోని అన్ని జిల్లాల్లో, బుధవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, ఏలూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోను వర్షాలు కురవవచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. అదే సమయంలో అక్కడక్కడ పిడుగులు కూడా పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు మంగళవారం 28 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో 8 మండలాల్లో, విజయనగరం 6, పార్వతీపురం మన్యం 12, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని వివరించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఓబులదేవర చెరువు (శ్రీసత్యసాయి) వద్ద 5.5 సెంటీమీటర్లు, వెదురుకుప్పం (చిత్తూరు) 3.8, మండపేట (కోనసీమ) 3.3, కొత్తవలస (విజయనగరం) 3, పులివెందుల (వైఎస్సార్) 2.9, నిడదవోలు (తూర్పు గోదావరి), అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు)ల్లో 2.8, చింతలపూడి (ఏలూరు), నర్సీపట్నం (అనకాపల్లి)ల్లో 2.6 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి.

22న అల్పపీడనం

ఈ నెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, ఈశాన్య దిశగా కదిలే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 24వ తేదీకి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఆ తర్వాత తుఫానుగా మారే అవకాశం ఉంది.

పద్ధతి ప్రకారం పరిహారం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రక్రియలో దేనికైనా ఓ పద్ధతి అనుసరించడం తప్పనిసరి. నిబంధనల ప్రకారం నడుచుకుంటే వ్యవస్థలూ సజావుగా పని చేస్తాయి. రైతన్నలకు ఓ రైతు భరోసా అయినా ఇన్‌పుట్ సబ్సిడీ అయినా టంఛన్‌గా క్యాలండర్ ప్రకారం అందుతున్నాయంటే ఇదే కారణం! గతేడాది దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల కారణంగా అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. 2023 రబీలో కరువు బారిన పడ్డ ప్రాంతాల జాబితాను నిబంధనల ప్రకారం ఈ ఏడాది మార్చి 31 నాటికి ప్రకటించాలి. ఇందుకు ఆరు ప్రామాణికాలను పాటించడం తప్పనిసరి. ఈ క్రమంలో రబీ సీజన్‌లో రాష్ట్రంలో ఆరు జిల్లాల పరిధిలో 87 మండలాలు కరువు ప్రభావానికి గురైనట్లు నిర్ధారించారు. 63 మండలాల్లో తీవ్రంగా, 24 మండలాల్లో స్వల్పంగా కరువు ఉన్నట్లు లెక్క తేల్చారు. 2.37 లక్షల మంది రైతులు నష్టపోయినట్లు అంచనా వేశారు. 2.52 లక్షల హెక్టార్లలో 33 శాతానికిపైగా వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు తేలింది. ఈ మేరకు మార్చి 16వతేదీన గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైంది. కరువు మండలాలను గుర్తించిన సమయంలోనే ప్రాథమిక నష్టాన్ని అంచనా వేశారు. నిబంధనల ప్రకారం ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. చంద్రబాబు బృందం ఫిర్యాదుతో రెండు నెలల పాటు ర్యాండమ్ శాంపిల్ సర్వేను ఎన్నికల సంఘం నిలిపివేసింది. పోలింగ్ ముగిశాక ఈసీ ఆంక్షలు సడలించడంతో ర్యాండమ్ శాంపిల్ సర్వే జరిపి తుది అంచనాల నివేదిక తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు. మరి ఇందులో అలసత్వానికి ఎక్కడ తావుంది? రైతుల నోటి కాడ ముద్దను నేల పాలు చేస్తూ చంద్రబాబు బృందం ఫిర్యాదు చేయడం వల్లే కదా ఈసీ అడ్డుకుంది? జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఏంఏ) విధివిధానాల ప్రకారమే కరువు మండలాలను ప్రకటిస్తారు. అంతేగానీ డ్రైస్పెల్స్ ఆధారంగా కాదు. దీని ప్రకారమే 2023 ఖరీఫ్ సీజన్‌లో 80 మండలాల్లో తీవ్రంగా, 23 మండలాల్లో స్వల్పంగా కరువు ఉన్నట్లు గుర్తించారు.

రూ.2,558.07 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టిన బాబు

కరువు మండలాల్లో ఆ సీజన్‌లో తీసుకున్న పంట రుణాలను ఆర్నెళ్ల పాటు రీ షెడ్యూల్ చేస్తారు. పంటలు కోల్పోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టపరిహారం) చెల్లిస్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్ చివరిలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటోంది. గత ఖరీఫ్‌లో కరువు ప్రభావిత మండలాల్లో పంట నష్టపోయిన 6.60 లక్షల మంది రైతులకు రూ.847.22 కోట్లు జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే ఎన్నికల కోడ్ సాకుతో చంద్రబాబు బృందం రెండు నెలల పాటు అడ్డుకుంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కరువు సాయాన్ని జమ చేసి సీఎం జగన్ ప్రభుత్వం రైతుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. చంద్రబాబు అధికారంలో ఉండగా ఏనాడూ సీజన్‌లో కరువు మండలాలను ప్రకటించిన పాపాన పోలేదు. సకాలంలో పరిహారం జమ చేసి రైతులకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. 24.80 లక్షల మంది రైతన్నలకు రూ.2,558.07 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుదే.

ఈసీని పలుమార్లు అభ్యర్థించాం..

➡ ప్రాథమిక అంచనా ప్రకారం ఆరు జిల్లాల్లో 87 మండలాలు కరువు ప్రభావానికి గురైనట్లు గుర్తించాం. ప్రాథమిక నివేదిక తయారీ సమయంలోనే నష్టపోయిన పంటల వివరాలు సేకరించాలని ఆదేశించాం. ఏప్రిల్‌లో పలుమార్లు ఎన్నికల కమిషన్‌ను కలిసి అనుమతి కోసం అభ్యర్థించాం. పంట కోతలు పూర్తయినప్పటికీ పొలంలో పంట ఉన్నప్పుడు సేకరించిన వివరాల ఆధారంగా ఎన్యుమరేషన్ పూర్తి చేసి సామాజిక తనిఖీతో జాబితాలు సిద్ధం అవుతాయి. తద్వారా రైతులెవరూ నష్టపోయే ఆస్కారం ఉండదు.

– చేవూరు హరికిరణ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

ఎలాంటి జాప్యం జరగలేదు..

➡ కేంద్ర వ్యవసాయ శాఖ కరువు మాన్యువల్ 2020 ప్రకారం ఖరీఫ్ కరువు మండలాలను అక్టోబర్ 31వ తేదీలోగా, రబీ కరువు మండలాలను మార్చి 31లోపు ప్రకటించాలి. దీని ప్రకారమే రబీ కరువు మండలాలను మార్చి 16న ప్రకటించారు. ఇందులో ఎలాంటి జాప్యం జరగలేదు. కరువు మాన్యువల్ ప్రకారం డ్రైస్పెల్ ఒక్కటే పరిగణలోకి తీసుకోడానికి వీల్లేదు. దేశవ్యాప్తంగా దశల వారీ ఎన్నికల దృష్ట్యా కేంద్ర బృందం పర్యటన కొంత ఆలస్యమైంది.

– కూర్మనాథ్, ఏపీ విపత్తుల సంస్థ ఎండీ

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా టంగుటూరి వర్ధంతి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి,అమరావతి: 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, ఏపీ తొలి సీఎంగా ప్రకాశం పంతులు అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బ్రిటిష్ సైన్యం తుపాకీకి ఎదురు నిలిచిన ధీరోదాత్తుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని పేర్కొన్నారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు అంకం రెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ నేతల దుష్ప్రచారం

- బెంగళూరులో రేవ్ పార్టీ వద్ద దొరికిన కారుతో నాకు సంబంధం లేదు
- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ నేతలు తనపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. 'బెంగళూరు ఎల్రక్టానిక్ సిటీలో ఆదివారం రాత్రి జరిగిన రేవ్ పార్టీ వద్ద దొరికిన ఒక కారుకు నా పేరిట ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్ జిరాక్స్ కాపీ అతికించి ఉందనే నెపంతో నాపై బురదచల్లడం సరికాదు. ఆ కారుతోగానీ, దాని యజమానితోగానీ, ఆ కారులో ప్రయాణించినవారితోగానీ నాకు ఎలాంటి సంబంధం లేదు. రిజిస్ట్రేషన్ వివరాల ప్రకారం ఆ కారు విజయవాడకు చెందిన తుమ్మల వెంకటేశ్వరరావు పేరిట ఉంది. ఆయన ఎవరో నాకు తెలియదు. నా ప్రమేయం లేకుండా ఎమ్మెల్యే స్టిక్కర్ జిరాక్స్ కాపీని ఆ కారుకు అతికించడంపై ఇప్పటికే నేను కర్ణాటక పోలీసులకు ఫిర్యాదుచేశాను. అదేవిధంగా రేవ్ పార్టీ వ్యవహారంపై బెంగళూరు నార్కోటిక్ పోలీసులు కేసు నమోదుచేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఏమిటో బయటపెట్టాలి. రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించనున్నట్లు టీడీపీ వారికి స్పష్టంగా అర్థమైంది. ఆ ఓటమి భయంతోనే పోలింగ్ ముగిసిన తర్వాత నాపై పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారు' అని కాకాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా నాగుల్‌మీరా



సాక్షి, అమరావతి: ఏపీ ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షునిగా హైకోర్టు న్యాయవాది షేక్ నాగుల్ మీరా సోమవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ ఉపాధ్యక్షులుగా అలి అహ్మద్, ఎండీ నిషాంత్ సుల్తానా, షేక్ మస్తాన్ వలి, రోషన్ అలిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా షాహిద్ అఫ్రిది, షేక్ షఫీవుల్లా, నూర్జహాన్ బేగం ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఖాజా హుస్సేన్ ముల్లా, ఎం.రియాజ్, షేక్ గౌసియా, షేక్ ఆర్.సి.పురం సుభాని, సహాయ కార్యదర్శులుగా కరీముల్లా, సయ్యద్ ఖాజా, కోశాధికారిగా కరీం బేగ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఈ నెల 25 నుంచి ఏపీలో పర్యటించి నూతన జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకుంటుందని నాగుల్ మీరా తెలిపారు.

మంగళగిరి పట్టణ ఎస్‌ఐ సస్పెన్షన్

ఓటుకు నోటు తీసుకున్నట్టు ఆరోపణలు

నగరంపాలెం/మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ ఎస్‌ఐ ఖాజీబాబును సస్పెండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఎస్‌ఐ ఖాజీబాబు మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ (పీఎస్)కు వచ్చారు. ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన ఆయనకు సొంతూరులో ఓటు ఉంది. సదరు ఎస్‌ఐతో ఓటు వేయిస్తామని ఆయన బంధువులు ఓ పార్టీ నేత నుంచి రూ.5 వేలు తీసుకున్నారు. ఆ మొత్తాన్ని ఆన్‌లైన్‌లో ఎస్‌ఐకి పంపించారు. సదరు నేత డబ్బులు పంపిణీ చేస్తుండగా.. ప్రకాశం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఎవరెవరికి డబ్బులు పంపిణీ చేశారనే విచారణలో అసలు విషయం వెలుగు చూసింది. ఈ క్రమంలో ఎస్‌ఐపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలంటూ గుంటూరు రేంజ్ ఐజీకి నివేదిక ఇవ్వగా, ఎస్‌ఐను సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై సస్పెండ్ అయిన ఎస్‌ఐ వివరణ ఇచ్చినట్లు వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ ప్రత్యక్షమైంది. ఆ నగదు తన మిత్రుడు వారం రోజుల కిందట తీసుకున్న రూ.10వేలు అని, దీనిపై పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్‌తోనే హైబీపీ

అధికంగా సెల్‌ఫోన్ మాట్లాడే వారిలో రక్తపోటు

చైనాలోని గ్వాంగ్‌జౌ సదరన్ మెడికల్ వర్సిటీ పరిశోధనలో వెల్లడి

ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మందిలో బీపీ సమస్య



సాక్షి, అమరావతి: మొబైల్ ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడితే అధిక రక్తపోటు (హై బీపీ) ప్రమాదం పొంచి ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. దైనందిన జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న సెల్‌ఫోన్లతో అంతే స్థాయి అనారోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారానికి 30 నిమిషాలు, అంతకంటే ఎక్కువసేపు మొబైల్ ఫోన్‌లో మాట్లాడేవారిలో దుష్ప్రభావాలు తీవ్ర స్థాయిలో ఉంటున్నాయని, ముఖ్యంగా రక్తపోటు ప్రమాదాన్ని పెంచుతుందని తాజా అధ్యయనంలో తేల్చారు. 'యూరోపియన్ హార్ట్ జర్నల్–డిజిటల్ హెల్త్'లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. చైనాలోని గ్వాంగ్‌జౌలోని సదరన్ మెడికల్ వర్సిటీ పరిశోధకులు మొబైల్ ఫోన్ల నుంచి వెలువడే తక్కువ స్థాయి రేడియో ఫ్రీక్వెన్సీ శక్తి రక్తపోటు పెరుగుదలతో ముడిపడి ఉందని గుర్తించారు.

130 కోట్ల మందిలో..



ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 30–79 సంవత్సరాల వయసు గల దాదాపు 130 కోట్ల మంది అధిక రక్తపోటు సమస్య ఎదుర్కొంటున్నారు. ఇందులో 82% మంది తక్కువ, మధ్య–ఆదాయ దేశాలలో నివసిస్తున్న వారే. భారత్‌లో 120 కోట్ల మందికిపైగా మొబైల్ ఫోన్ వినియోగదారులు ఉంటే 22 కోట్ల మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. రక్తపోటు సమస్య గుండెపోటు, అకాల మరణానికి దారితీస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. హైబీపీ వల్ల వచ్చే హైపర్ టెన్షన్, ఇతర సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాజా పరిశోధనలో వారంలో 30 నిమిషాల కంటే తక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడే వారితో పోలిస్తే మిగిలిన వారిలో రక్తపోటు వచ్చే ప్రమాదం 12% ఎక్కువగా ఉంటుందని తేల్చారు. వారానికి ఆరుగంటలకు పైగా ఫోన్‌లో మాట్లాడేవారిలో రక్తపోటు ప్రమాదం 25 శాతానికి పెరిగింది.

కండరాలపై ఒత్తిడి..

మెడ, భుజాలు, చేతుల్లో కండరాల నొప్పులు అత్యంత సాధారణ దుష్ప్రభావాలలో ఒకటిగా వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సేపు ఫోన్‌ను పట్టుకోవడంతో కండరాలు ఒత్తిడికి గురవడంతో పాటు తీవ్ర తలనొప్పికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌ను చెవికి చాలా దగ్గరగా పెట్టుకుని మాట్లాడటం, ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లను నిరంతరం ఉపయోగించడంతో టిన్నిటస్ (చెవుల్లో నిరంతరం రింగింగ్ సౌండ్ వినిపించే పరిస్థితి) వంటి చెవి సమస్యలు వస్తాయంటున్నారు. ఫోన్ స్క్రీన్‌పై ఎక్కువ సేపు చూడటంతో కంటిపై ఒత్తిడి పెరిగిన కళ్లుపొడిబారడం, చూపు మసకబారడం, తలనొప్పి, ఊబకాయం వంటి సమస్యలకు దారితీస్తుందని పేర్కొంటున్నారు.

మధ్యవర్తిత్వం.. వివాద పరిష్కారానికి ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు ఎంసీపీసీ నిషా సక్సేనా

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఏసీ చైర్మన్ శరత్‌బాబు
- మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులు ప్రారంభం

నగరంపాలెం: గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా జడ్జి హాల్లో సోమవారం సుప్రీంకోర్టు మీడియేషన్/కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ–న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై 40 గంటల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గుంటూరు జోన్‌లోని గుంటూరు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఏపీ రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయాధికారులు హాజరు కాగా, ఈ నెల 20 నుంచి 24 వరకు కొనసాగనున్నాయి. శిక్షణ అధికారులుగా ఎంపికైన సుప్రీం కోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఢిల్లీ నుంచి నిషా సక్సేనా(జిల్లా జడ్జి), నీర్జాభాటియా(జిల్లా జడ్జి) హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. వారు మధ్యవర్తిత్వానికి సంబంధించి పలు అంశాలను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఏసీ చైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, సంస్థ టి.లీలావతి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వివాద పరిష్కారానికి ప్రత్యామ్నాయం అని అన్నారు. తక్కువ ఖర్చుతో న్యాయం పొందేందుకు మధ్యవర్తిత్వం అనే సాధనం చక్కగా ఉపకరిస్తుందని వివరించారు.

దుష్ప్రచారం చేయడం డాక్టర్ లోకేశ్‌కు అలవాటే..

- కోర్టుల్లో తప్పుడు కేసులు వేయడంలో నేర్పరి
- చీవాట్లు పెట్టి జరిమానా విధించిన అమెరికా కోర్టు
- పలువురు రోగుల మరణానికి కారకుడయ్యాడని ప్రాక్టీస్ పైనా నిషేధం
- ప్రముఖ ఎన్ఆర్ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి వెల్లడి





డాక్టర్ లోకేశ్ మెడికల్ లైసెన్స్‌ను రద్దుచేస్తూ కొలంబియా బోర్డు ఆఫ్ మెడిసిన్ ఇచ్చిన నివేదిక



డాక్టర్ వాసుదేవరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రముఖులపై దుష్ప్రచారం చేయడం డాక్టర్ ఉయ్యూరు లోకేశ్‌కు అలవాటని ప్రముఖ ఎన్ఆర్ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. ఏపీలో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని మేధావిగా చలామణి అవుతున్నారని ఎద్దేవా చేశారు. అయితే అమెరికాలో 18 ఏళ్లుగా ఆయన ప్రాక్టీస్‌పై నిషేధం కొనసాగుతోందని తెలిపారు. టీడీపీ సానుభూతి పరుడైన లోకేశ్ ఇటీవల గన్నవరం విమానాశ్రయంలో లండన్‌కు వెళుతున్న సీఎం జగన్‌ను అడ్డుకునేందుకు కుట్ర పన్నారు. ఈ సందర్భంగా అతని గురించి పలు విస్తుపోయే వాస్తవాలను డాక్టర్ వాసుదేవరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. గుంటూరు మెడికల్ కాలేజీలో 1983లో లోకేశ్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. గ్యాస్ట్రో విభాగంలో ఎండీ పూర్తిచేసిన ఆయన అమెరికాలోని వర్జీనియాలో తొలుత ప్రాక్టీస్ మొదలెట్టాడు. అప్పటి నుంచే ఎదుటి వ్యక్తులపై అవాస్తవ ఆరోపణలు చేయడం, కోర్టుల్లో తప్పుడు కేసులు ఫైల్ చేయడం లోకేశ్‌కు అలవాటు. ప్రాక్టీస్ ప్రారంభించిన తొలినాళ్లలో ఆస్పత్రి యాజమాన్యంపై, సహచర వైద్యులపై కోర్టులో కేసులు వేసి, ఆ ఆరోపణలను రుజువు చేయడంలో విఫలమయ్యాడు. ఇదే తరహాలో 2022లో భారత ప్రధాని మోదీ, ఏపీ సీఎం వైఎస్ జగన్, అదానీ మీద వాషింగ్టన్ డీసీ కోర్టులో కేసులు ఫైల్ చేశాడు. ఇండియా నుంచి కంటైనర్‌లలో డబ్బుతో పాటు, ఇజ్రాయిల్ నుంచి స్పైవేర్ కొనుగోలు చేసి అమెరికాకు అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు చేశాడు. తప్పుడు ఆరోపణలతో కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నావని లోకేశ్‌కు కోర్టు చీవాట్లు పెట్టడంతో పాటు జరిమానా విధించింది.

ప్రాక్టీస్‌పైనా నిషేధం

వైద్య నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్సలు అందించి పలువురి మరణానికి లోకేశ్ కారకుడయ్యాడు. 2006లో వర్జీనియా బోర్డ్ ఆఫ్ మెడిసిన్ లోకేశ్ మెడికల్ లైసెన్స్‌ను రద్దు చేసింది. అనంతరం న్యూయార్క్, న్యూజెర్సీ వంటి ఇతర ప్రాంతాలకు వెళ్లాడు. ఆయా రాష్ట్రాల్లోనూ లైసెన్స్‌ను రీవోక్ చేశారు. అయితే ఈ వాస్తవాలను కప్పిపుచ్చి అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా చలామణి అవుతూ ఏపీ సీఎం జగన్‌పై అవాస్తవ ఆరోపణలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు వాస్తవాలను ఓ సారి తెలుసుకోవాలి. మేధావులుగా చలామణి అవుతున్న లోకేశ్ వంటి కుహనోన్మాదులు సీఎం జగన్‌పై దాడులకు పాల్పడుతున్నారు.

ఇట్లు.. ఇటలీకి!

వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్తున్నట్లు చంద్రబాబు లీకులు

- అబ్బే.. ఇటు రాలేదన్న టీడీపీ ఎన్నారై విభాగం నేత
- టీడీపీ అధినేత ఇటలీలో ప్రత్యక్షమైనట్లు సమాచారం

సాక్షి, అమరావతి: అడుగు తీసి అడుగేస్తే మీడియాలో ప్రచారం కోరుకునే టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గప్‌చుప్‌గా విదేశాలకు ఉడాయించారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లిన చంద్రబాబు అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లారనే విషయంపై గోప్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం ఆయన అమెరికా వెళ్లినట్లు టీడీపీ తొలుత మీడియాకు లీకులిచ్చింది. అయితే చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన టీడీపీ ఎన్నారై విభాగం నేత కోమటి జయరాం మాత్రం ఆయన అసలు అమెరికా రాలేదని ప్రకటించడం గమనార్హం. విదేశాల నుంచి అక్రమ నిధులను భారత్‌లోని షెల్ కంపెనీలకు మళ్లించిన చరిత్ర ఉన్న చంద్రబాబు ప్రస్తుతం ఏ దేశంలో ఉన్నారు? ఏం చేస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. గుట్టుచప్పుడు కాకుండా విదేశీ పర్యటన వెనుక లోగుట్టు ఏమిటన్నది సస్పెన్స్‌గా మారింది. అయితే తాజా విశ్వసనీయ సమాచారం ప్రకారం చంద్రబాబు ఇటలీలో ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది.

పోలింగ్ తర్వాత సైలెంట్

చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితం అంతా మీడియా ప్రచారంతోనే ముడిపడి ఉందన్నది బహిరంగ రహస్యమే. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆయన మీడియా ద్వారా విపరీతమైన ప్రచారాన్ని కోరుకుంటారు. మూడు ప్రెస్‌మీట్లు, ఆరు మీడియా లీకులుగా ఆయన రాజకీయం కొనసాగింది. వారానికి కనీసం రెండు సార్లు మీడియా సమావేశాలు నిర్వహిస్తుంటారు. అలాంటిది ఈ నెల 13న పోలింగ్ ముగిసిన తర్వాత చంద్రబాబు ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. కనీసం ప్రెస్‌మీట్ పెట్టలేదు. పార్టీ నేతలతో సమావేశం నిర్వహించలేదు. తన శైలికి భిన్నంగా ఒక్కసారిగా మౌనముద్ర దాల్చారు. మరోవైపు లోకేశ్‌కు మాట కూడా పెగల్లేదు. చంద్రబాబు కంటే ముందే ఆయన గప్‌చుప్‌గా విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. ఇక పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారో జనసేన వర్గాలే చెప్పలేకపోతున్నాయి. రాష్ట్ర బీజేపీ శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అలికిడే లేదు. పోలింగ్ ముగిసిన తర్వాత కూటమి నోట మాటే రావడం లేదు. పోలింగ్ సరళి తమకు వ్యతిరేకంగా ఉందని చంద్రబాబు కచ్చితమైన అంచనాకు రావడంతో ఒక్కసారిగా మౌనం దాల్చినట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిశ్శబ్దంగా విదేశాలకు వెళ్లడం గమనార్హం.

ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకోవడంతో..

చంద్రబాబు శనివారం అర్ధరాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లారు. ఆయన విదేశీ పర్యటనలపై అధికారికంగా వెల్లడించే టీడీపీ ఈసారి అందుకు భిన్నంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు చంద్రబాబును కాసేపు అడ్డుకోవడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కింది. టీడీపీ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాల కేసులకు సంబంధించి చంద్రబాబుపై సీఐడీ గతంతో లుక్ అవుట్ నోటీసు జారీ చేసింది. సీఐడీ ముందస్తు అనుమతి లేకుండా ఆయన దేశం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబును విమానాశ్రయంలో అడ్డుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు సీఐడీని సంప్రదించారు. సీఐడీ ఆయనపై నాలుగు కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసింది. సీఐడీకి సమాచారం ఇవ్వకుండా దేశం విడిచి వెళ్లకూడదని ఆయనకు తాజాగా నోటీసులు జారీ చేయనుంది. ఇదే విషయాన్ని సీఐడీ శంషాబాద్ ఇమ్మిగ్రేషన్ అధికారులకు తెలియచేసింది. దీంతో చంద్రబాబు విదేశీ పర్యటనపై అప్పటికప్పుడు సమాచారం ఇచ్చినట్లుగా భావించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆయన్ను వెళ్లనిచ్చారు. సాధారణంగా దుబాయ్ చేరుకుని అక్కడి నుంచి మరో విమానంలో అమెరికా లేదా ఐరోపా దేశాలకు వెళుతుంటారు. చంద్రబాబు మాత్రం దుబాయ్ నుంచి ఎక్కడికి వెళ్లారో వెల్లడించలేదు. తన పర్యటనను అంత గోప్యంగా ఎందుకు ఉంచారన్నది సందేహాస్పదంగా మారింది.

స్కిల్ స్కామ్‌లోనూ దుబాయ్ బంధం

చంద్రబాబు రహస్య పర్యటన నేపథ్యంలో గతంలో షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల మళ్లింపు వ్యవహారం తెరపైకి వచ్చింది. టీడీపీ హయాంలో యథేచ్ఛగా పాల్పడిన కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన నిధులను ఆయన అక్రమంగా విదేశాలకు తరలించి అక్కడి నుంచి భారత్‌లోని షెల్ కంపెనీలకు మళ్లించినట్లు సీఐడీ ఆధారాలతో సహా నిగ్గు తేల్చింది. చంద్రబాబు 52 రోజులు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న స్కిల్ స్కామ్‌లో కూడా నిధులను అక్రమంగా దుబాయ్‌కు చేర్చారు. ఆ కుంభకోణంలో పాత్రధారులైన ఆయన మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని, కిలారి రాజేశ్ దుబాయ్ నుంచే అక్రమ నిధులను సింగపూర్ మీదుగా హైదరాబాద్‌లోని షెల్ కంపెనీకి తరలించారు. అనంతరం ఆ నిధులు చంద్రబాబు బంగ్లాకు చేర్చారు. అంటే ఆయన ఆర్థిక కుంభకోణాల్లో దుబాయ్ కీలక కేంద్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఇటలీలో ప్రత్యక్షం..!

గుట్టుగా విదేశాలకు వెళ్లిన చంద్రబాబు ఇటలీ చేరుకున్నట్లు సమాచారం. దుబాయ్ నుంచి చంద్రబాబు దంపతులు ఇటలీ వెళ్లినట్లు ఇమ్మిగ్రేషన్ వర్గాలు అనధికారికంగా వెల్లడించాయి. లోకేశ్ దంపతులు కూడా అక్కడికే వెళ్లినట్లు భావిస్తున్నారు. గతంలో చంద్రబాబు కుటుంబ సభ్యులతో విహార యాత్రలకు వెళ్లినప్పుడు అధికారికంగా వెల్లడించారు. ఈసారి మాత్రం అందుకు భిన్నంగా గోప్యత పాటించడం గమనార్హం. ఇటలీతోపాటు మరికొన్ని చిన్న చిన్న దేశాలకు వారు వెళ్లే అవకాశం ఉంది. అక్కడ నుంచి సింగపూర్‌కు నిధులు మళ్లించి అనంతరం భారత్‌లోని షెల్ కంపెనీలకు చేరవేసే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. చంద్రబాబు విదేశీ పర్యటనను పూర్తిగా గోప్యంగా ఉంచడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

నేడు తిరుపతి గంగ జాతర ముగింపు

- వారం రోజులుగా వివిధ వేషాల్లో భక్తులు
- నేడు అమ్మవారి విశ్వరూప ప్రతిమ
- గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



సారెను తీసుకు వస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: వారం రోజులుగా వైభవంగా జరుగుతున్న తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర మంగళవారంతో పరిసమాప్తం కానుంది. ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన జాతరలో భక్తులు రోజుకో వేషం వేసుకుని వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ పౌరాణిక, జానపద వేషాలు వేసుకొని డప్పుల దరువుల నడుమ చిందులు వేస్తూ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అందుకే తిరుపతి గంగజాతరను 'వేషాల వేడుక' అని కూడా పిలుస్తారు. జాతర మహోత్సవంలో చివరి రోజయిన మంగళవారం రాత్రి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో విశ్వరూప ప్రతిమ కొలువు తీరనుంది. ఆలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడిస్తంబంపై ఈ అమ్మవారి విశ్వరూప ప్రతిమ రూపుదిద్దుకుంటుంది. సోమవారం చంద్రగిరి నియోజకవర్గ ప్రజల తరపున చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు తుమ్మలగుంట నుంచి ఊరేగింపుగా సారెను తీసుకువచ్చి గంగమ్మకు సమర్పించారు.

పల్నాడులో మహిళలపై ఇంతటి దాడులా?

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఆగ్రహం
- నిందితులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు లేఖ



సాక్షి, అమరావతి/మాచవరం: రాజకీయాల్లో ఎన్నడూ లేనివిధంగా తమకు ఓట్లు వేయలేదనే కక్షతో ఎస్సీ, బీసీ మహిళలపై దాడులకు దిగడం దారుణమని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేశునిపాడుకు చెందిన ఎస్సీ, బీసీ మహిళలు తమపై టీడీపీ నేతలు చేసిన దాడులపై సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై స్పందించిన చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి తక్షణం బాధితులకు రక్షణ కల్పించి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీకి లేఖ రాశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్సీ, బీసీ మహిళలనే టార్గెట్‌గా చేసుకుని ఇంతలా దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వాతావరణం ప్రజాస్వామ్య విలువలకు పూర్తి విరుద్ధమన్నారు. కొత్త గణేశునిపాడుకు చెందిన ఎస్సీ, బీసీ మహిళలను దాదాపు 24 గంటలపాటు బంధించి కొందరు దుర్మార్గులు చిత్రహింసలకు గురిచేయడం అత్యంత పాశవికమని ఆందోళన వ్యక్తంచేశారు. చివరకు వాళ్లంతా గుడిలోకి వెళ్లి దాక్కున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వారు స్వేచ్ఛగా నచ్చిన వారికి ఓటు వేసే హక్కు లేదా అని ఆవేదన వ్యక్తంచేశారు. ఓట్లేసినంత మాత్రాన అదే పాపమని చంపేస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా మహిళల పట్ల చిన్నచూపుతో వ్యవహరించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలనే టార్గెట్‌గా చేసుకుని వారిపై దాడులకు ఉసిగొల్పుతున్న చంద్రబాబు తీరుపై మహిళలు ఆగ్రహంతో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు ఏపీ మహిళా కమిషన్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

నేరెడ్కో ఏపీ కమిటీ అధ్యక్షుడిగా గద్దె చక్రధర్



నేరెడ్కో ఏపీ నూతన కమిటీ సభ్యులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నేరెడ్కో) ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన కమిటీ అధ్యక్షుడిగా గద్దె చక్రధర్ ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ హోటల్‌లో నేరెడ్కో నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. నేరెడ్కో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం చైర్మన్‌గా జీ హరిబాబు, అధ్యక్షుడిగా గద్దె చక్రధర్, ఒకటవ కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్‌గా పరుచూరి కిరణ్‌కుమార్, రెండో కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్‌గా వై.దుర్గా ప్రసాద్, మూడో కార్యనిర్వాహక వైస్ ప్రెసిడెంట్‌గా తాళ్లూరి శివాజీ, ప్రధాన కార్యదర్శిగా ఎం.సీతారామయ్య, కోశాధికారిగా చావా రమేష్‌బాబుతో పాటు ఐదుగురు వైస్ ప్రెసిడెంట్లు, ఆరుగురు కార్యదర్శులతో నూతన కమిటీ ఎన్నికైంది. 21 మంది గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జీ తిరుపతిరావు వ్యవహరించారు. ఈ నూతన కమిటీ 2026 సంవత్సరం వరకు పదవీలో ఉంటుందని గద్దె చక్రధర్ తెలిపారు.

తెలంగాణ

20 కోట్ల ఏళ్ల కథ చెబుతా..!

- హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ప్రదర్శనకు పురాతన వృక్ష శిలాజం

సాక్షి, హైదరాబాద్: వందలు, వేలు, లక్షలు కాదు.. దాదాపు 20 కోట్ల ఏళ్ల కింద బతికిన వృక్షం. నాటి పరిస్థితుల్లో శిలాజంగా మారింది. ఇన్నేళ్ల తర్వాత ఇటీవల బయటపడింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో కొలువుదీరింది. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వీటిని ప్రదర్శనకు పెట్టారు. రాష్ట్రానికి చెందిన పురాతత్వ పరిశోధకుడు సముద్రాల సునీల్.. ఇటీవల మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం సుంపుతం గ్రామ పరిధిలో ఈ పురాతన వృక్ష శిలాజాన్ని గుర్తించారు. దీనిపై భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ''మనుషులు అభివృద్ధి చెంది లక్ష సంవత్సరాలైనా కాలేదని పరిశోధకులు గుర్తించారు. అలాంటిది దాదాపు 20 కోట్ల ఏళ్ల నాటి అరుదైన వృక్ష శిలాజాలు లభ్యమవడం, వాటిని 420 ఏళ్ల వయసున్న హైదరాబాద్ నగరంలో ప్రదర్శనకు ఏర్పాటు చేయడం గర్వకారణంగా భావిస్తున్నాం. జీవ పరిణామ క్రమంలోని కీలక అంశాలకు ఇలాంటి శిలాజాలు సాక్ష్యాలుగా నిలుస్తాయి''అని పేర్కొన్నారు.

ఎన్నో అరుదైన శిలాజాలు ఉన్నాయి

'నేను 15 ఏళ్లుగా శిలాజాలపై పరిశోధన చేస్తున్నాను. ఇప్పటికే డైనోసార్లు, పురాతన చేపలు, వృక్షాలు, ఇతర జీవజాతుల శిలాజాలను సేకరించాను. రాష్ట్రంలో ఇలాంటి వృక్ష, జంతు శిలాజాలు ఆదిలాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో విస్తృతంగా లభ్యమవుతున్నాయి.'

– సముద్రాల సునీల్, పురాతత్వ పరిశోధకుడు



లోతుగా కనబడేట్టు చేయడానికి వాళ్లు నీటిని బురదమయం చేస్తారు.
– నీషే

సాక్షి

మంగళవారం, 21 మే 2024

నిజాయతీ నిరూపించుకోండి!

సాక్షాత్తూ ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఓ మహిళపై దాడి జరుగుతుందని ఊహించగలమా? అదీ స్వయంగా సీఎంకు కుడిభుజం లాంటి సహాయకుడే ఆ దురాగతానికి పాల్పడ్డాడంటే నమ్మగలమా? అందులోనూ తనపై అలా దాడి జరిగిందని ఆరోపిస్తున్న వ్యక్తి అధికార పార్టీకే చెందిన పార్లమెంట్ సభ్యురాలు కూడా అయితే, అవాక్కవకుండా ఉండగలమా? 'ఆమ్ ఆద్మీ పార్టీ' (ఆప్)కి చెందిన రాజ్యసభ ఎంపీ స్వాతీ మాలీవాల్ సొంత పార్టీ వారిపైనే గత వారంగా చేస్తున్న ఆరోపణలు సంచలనం రేపుతున్నది అందుకే. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇంటికి వెళితే ఆయన పీఏ విభవ్ కుమార్ అమానవీయంగా దాడి చేసి, కొట్టరాని చోటల్లా కొట్టి బయటకు గెంటించారన్న ఆరోపణలు ఏ రకంగా చూసినా అసాధారణమైనవే. అందులోనూ ఢిల్లీ లిక్కర్ పాలసీ వ్యవహారంలో అరెస్టయిన కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం సుప్రీమ్ కోర్ట్ ఇచ్చిన వెసులుబాటు ఆసరాగా తీహార్ జైలు నుంచి బయటకు వచ్చీ రాగానే ఈ పరిణామం సంభవించడం ఆయననూ, ఆయన పార్టీనీ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విభవ్ అరెస్ట్, స్వాతి కథను బీజేపీ రాజకీయం చేస్తోందంటూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ముట్టడికి ఆప్ యత్నాలతో వ్యవహారం మరింత ముదిరింది.

కేజ్రీవాల్‌కు విభవ్ నమ్మినబంటు. పార్టీ విస్తరణ సహా అనేక బాధ్యతలను అతనికి అప్పగించారు. కేజ్రీవాల్ ఇంటిలోని క్యాంప్ ఆఫీస్ మొదలు ఢిల్లీ సెక్రటేరియట్‌లోని సీఎం ఆఫీస్ వ్యవహారాల దాకా రోజువారీ కార్యకలాపాలన్నీ అతని చేతుల మీదే నడుస్తుంటాయి. ఈ క్రమంలో స్వాతికీ, అతనికీ మధ్య గతంలో ఏం జరిగింది, దాడి ఘటన రోజున అసలేమైంది లాంటి అనేక ప్రశ్నలకింకా స్పష్టమైన సమాధానాలు దొరకాల్సి ఉంది. ఆరోపణలు వచ్చిన మొదట్లో పెదవి విప్పకుండా 'ఆప్' ఆలసించింది. ఆనక స్వాతిపై దాడి జరిగిందని గతవారం అంగీకరించింది. తీరా ఇప్పుడేమో ఇదంతా రాజకీయ కుట్రంటోంది. అదీ విడ్డూరం. అలాగని స్వాతి గత చరిత్ర సైతం గొప్పదేమీ కాదు. గతంలో ఢిల్లీ మహిళా కమిషన్‌కు సారథ్యం వహించిన ఆమె ఆ పదవిలో ఉండగా నియామకాల్లో అక్రమాలకు పాల్పడినట్టు నిందలొచ్చాయి. ఆ వ్యవహారంలో అరెస్టు తప్పదంటూ కాషాయపార్టీ బ్లాక్‌మెయిల్ చేసిందంటున్నారు. ఆ భయంతోనే ఆమె ఈ దాడి కథ వినిపిస్తోందనేది 'ఆప్' వాదన.

నిజానికి, స్వాతి కూడా కేజ్రీవాల్‌కు సన్నిహితురాలే. ఆమె రాజకీయంగా ఎదిగి, రాజ్యసభ సభ్యురాలు కావడమే అందుకు ఉదాహరణ. మరి ఎక్కడ కథ అడ్డం తిరిగిందన్నది ఇప్పుడు బయటకు రావాల్సి ఉంది. దాడి జరిగిందని చెప్పిన స్వాతి పోలీసు ఫిర్యాదుకు ఆలస్యం చేయడం, తీరా దర్యాప్తు మొదలయ్యాక రోజుకో రకం వీడియోలు, కథనాలు బయటకు రావడం చూస్తుంటే, విషయం పైకి కనిపిస్తున్నంత పారదర్శకంగా లేదన్న అనుమానమూ వస్తోంది. పోలీసులు నిష్పాక్షికంగా, లోతైన దర్యాప్తు చేసి, నిజాలు నిగ్గుతేల్చాలి. అనుమానాలు ఏమైనా, కారణాలు ఎలాంటివైనా ఒక మహిళపై భౌతిక దాడికి దిగి గాయపరచడం, దుర్భాషలాడడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. అలాగే, ఈ కేసులో సాక్షాత్తూ సీఎం ఇంటిలోని సీసీటీవీ దృశ్యాలు సహా సాక్ష్యాధారాలను మాయం చేసే ప్రయత్నం జరిగిందంటూ వస్తున్న వార్తలు సైతం పాలక వ్యవస్థపై సామాన్య ప్రజల నమ్మకానికి గొడ్డలిపెట్టు.

మరోపక్క విదేశాల నుంచి విరాళాలపై నిషేధం ఉన్నప్పటికీ 'ఆప్'కు విదేశీ నిధులు వచ్చాయనీ, దాతల పేర్లను ఆ పార్టీ మరుగున పెట్టిందనీ, విదేశీమారకద్రవ్య నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) నిబంధనల్ని ఉల్లంఘించిందనీ తాజా ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ మేరకు కేంద్ర హోమ్ శాఖకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమాచారం అందించినట్లు సోమవారం బయటకొచ్చిన వార్తలు కేజ్రీవాల్‌నూ, ఆయన పార్టీనీ మరింత ఇరుకునపెట్టేవే. పైగా, దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ ఇలా ఒకదాని వెంట మరొకటిగా వివాదాలు రేగి, వివరణ ఇవ్వాల్సిన పరిస్థితిలోకి నెట్టడం ఏ రాజకీయ పార్టీ విశ్వసనీయతకైనా ఇబ్బంది తెస్తాయి. తాజా పరిణామాలు 'ఆప్'నే కాక, ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని సైతం ఇరుకున పెట్టాయి. మద్యం పాలసీ మొదలు స్వాతి ఆరోపణలు, తాజా ఈడీ వెల్లడింపు వార్తల దాకా వేటి మీదా కాంగ్రెస్ సహా కూటమి పార్టీలేవీ గొంతు విప్పట్లేదు. తమ వైఖరి చెప్పట్లేదు. దేశంలో బీజేపీ దూకుడుకు కళ్లెం వేసి, మోదీని గద్దె దించడానికి తగిన సమయమని భావిస్తున్న వేళ ఇది ఆ పార్టీలేవీ ఊహించని దుఃస్థితి.

'ఆప్', బీజేపీల మాటల యుద్ధం మాత్రం రాజకీయ వాతావరణాన్ని రోజురోజుకూ వేడెక్కిస్తోంది. అయితే, ఈ నెల 25న ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ... ఈ వరుస వివాదాలు ఆకస్మికమనీ, పూర్తి యాదృచ్ఛికమనీ అనుకోవడం అమాయకత్వమే. నిజాయతీకి తాము నిలువుటద్దమని 'ఆప్', అలాగే అవినీతి చీడను తాము ఏరేస్తున్నామని బీజేపీ... దేనికది డప్పు కొట్టుకుంటున్నా, వాస్తవాలు అందుకు దూరంగా ఉన్నాయని ప్రజలకు అర్థమవుతూనే ఉంది. బీజేపీ రాజకీయ ప్రతీకారాన్ని బయటపెడతామంటూ కేజ్రీవాల్ గర్జిస్తున్నా, అది ప్రతిధ్వనిస్తున్న దాఖలాలు పెద్దగా కనబడట్లేదు. పదమూడేళ్ళ క్రితం 2011లో అవినీతిపై అన్నాహజారే ఉద్యమం నుంచి ఊపిరిపోసుకున్న 'ఆప్' ఇవాళ లక్ష్యం మరిచి, దారి తప్పిన బాటసారిగా మారిపోవడం సమకాలీన చారిత్రక విషాదం. హజారే ఉద్యమంలో బాసటగా నిలిచిన స్ఫూర్తిదాయకమైన స్వతంత్ర వ్యక్తులు ఇవాళ 'ఆప్'లో లేకపోవడం, కేజ్రీవాల్ భజనపరులదే పార్టీలో రాజ్యం కావడం లాంటివే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. స్వాతి ఆరోపణల పర్వంలో లోతుపాతులు ఏమైనా, 'ఆప్' ప్రస్థానంలో లోటుపాట్లు అనేకం. తప్పులు దిద్దుకొని, నిజాయతీ నిరూపించుకోవడమే ప్రజాక్షేత్రంలో శ్రీరామరక్ష.

అప్పుడు జరిగినట్టే... ఇప్పుడవుతుందా?

అభిప్రాయం



అలీ చాగులే

2014లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం బీజేపీకి బాగా కలిసొచ్చింది. 2019లో పుల్వామా ఉగ్రదాడులకు ప్రతిగా జరిగిన సర్జికల్ స్ట్రయిక్స్‌తో ఓటర్లలో బీజేపీ జాతీయభావన రేకెత్తించింది. ఫలితంగా రెండు పర్యాయాల్లోనూ బీజేపీ అనుకూల వేవ్ కనబడింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, రామ మందిర ప్రతిష్ఠాపన వల్ల ఈసారి కూడా ఆ ఫలితమే పునరావృతం అవుతుందని బీజేపీ ఆశిస్తోంది. కానీ చాలా రాష్ట్రాల క్షేత్రస్థాయి నివేదికలు బీజేపీకి అనుకూలంగా లేవు. భారీ మెజారిటీ కాకపోయినా, తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందన్న భావన కాషాయ శిబిరంలో ఉంది. కాంగ్రెస్ గెలిచిన 2004 లేదా బీజేపీ అఖండ విజయం సాధించిన 2019... ఏ ఫలితాలు వస్తాయన్నది ప్రశ్న!

2014లో, దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ గాలి కనిపించినప్పటికీ, బీజేపీ సొంతంగా పూర్తి మెజారిటీతో అధికారం చేపడుతుందని ఎన్నికల నిపుణులు, రాజకీయ పండితులు కచ్చితంగా భావించలేదు. చివరకు కాషాయ పార్టీ కూడా సాధారణ మెజారిటీ మార్కును దాటగలననే నమ్మకంతో లేదు. మరోవైపున కాంగ్రెస్ పార్టీ అంత తక్కువ స్థానాలు సాధిస్తానని అసలు ఊహించలేదు. ప్రధానంగా అన్నా హజారే నేతృత్వంలోని 'ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్' ఉద్యమం కారణంగా వచ్చిన కాంగ్రెస్ వ్యతిరేక ఓటుతో బీజేపీ భారీగా లాభపడింది. దాన్ని తిప్పి కొట్టే ప్రచారం లేకపోవడంతో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది.

పనికి ఆహార పథకం, ఆహార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, లక్షలాది మందిని పేదరికం నుండి బయటపడేసిన అధిక ఆర్థిక వృద్ధి వంటి పదేళ్ల యూపీఏ పాలనలో సాధించిన విజయాలను కూడా కాంగ్రెస్ పార్టీ చెప్పుకోలేదు. కాంగ్రెస్ పార్టీ మీది అవినీతి ఆరోపణలు, అధిక ద్రవ్యోల్బణం అంశాలను మోదీ చక్కగా ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏను గద్దె దించాలంటూ మార్పు, సమగ్ర అభివృద్ధి గురించి ప్రచారం చేశారు. 2014 ఎన్నికలు... మార్పు కోసం జరిగిన ఎన్నికలు, అదే సమయంలో ఆశావహ ఎన్నికలు. 56 అంగుళాల ఛాతీ గల హీరో దేశాన్ని రక్షిస్తారన్న కథనం బాగా ఆకట్టుకుంది.

2019లో, బీజేపీకి వ్యతిరేకంగా చాలా విషయాలు ఉన్నాయి... పెద్దనోట్ల రద్దు, హడావుడిగా విధించిన జీఎస్టీ, నెరవేర్చని అనేక వాగ్దానాల వంటివి. కాంగ్రెస్ నుండి గట్టి సవాలును ఎదుర్కొంటున్న బీజేపీ హిందీ రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లను కోల్పోతుందన్న అంచనా ఉండేది. 2019 ఫిబ్రవరి మధ్యలో పుల్వామా ఉగ్రదాడి, ప్రతీకారంగా బాలాకోట్ వైమానిక దాడులు జరిగాయి. ప్రతి ఎన్నికల ర్యాలీలోనూ ప్రధాని మోదీ రేకెత్తించిన జాతీయవాద భావన క్షీణిస్తున్న బీజేపీ అదృష్టాన్ని మార్చేసింది.

2014, 2019 రెండూ వేవ్ ఉన్న ఎన్నికలు. అయితే 2024 ఎన్నికలు వేవ్ రహితం మాత్రమే కాదు, పేలవమైనవి కూడా. 2019లో రికార్డు స్థాయిలో ఓటింగ్ బీజేపీకి విపరీతంగా ఉపయోగపడింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, ఈ సంవత్సరం ప్రారంభంలో రామ మందిర ప్రతిష్ఠాపన వల్ల ఈసారి కూడా ఆ ఫలితమే పునరావృతం అవుతుందని బీజేపీ ఆశిస్తోంది. కానీ అలా జరిగేలా కనిపించడం లేదు. ఎన్నికల విశ్లేషకులకు ఎన్నికల్లో గెలిచే పార్టీగా ఇప్పటికీ బీజేపీనే ఫేవరేట్‌గా ఉన్నప్పటికీ, ఆ పార్టీ నాయకులు ఒక విచిత్రమైన భయాందోళనలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ఎందుకంటే, పార్టీ ఊహించిన విధంగా ఎన్నికలు జరగడం లేదు. ఇండియా కూటమి బీజేపీకి ఆందోళన కలిగిస్తోంది. నివేదికల ప్రకారం, ఈ సవాలును తటస్థీకరించడం బీజేపీకి చాలా కష్టంగా ఉంది.



వాస్తవానికి, తీవ్ర పోరాటం జరుగుతున్న రాష్ట్రాలైన బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుండి వివిధ క్షేత్రస్థాయి నివేదికలు బీజేపీకి అనుకూలంగా లేవు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని హిందీ బెల్ట్ రాష్ట్రాల ఎన్నికల డైనమిక్స్ బీజేపీకి వ్యతిరేకంగా మారాయనీ, హిందుత్వ పార్టీకి తగిన మెజారిటీ పొందడం కష్టంగా ఉందనీ సూచిస్తున్నాయి. ఆత్మవిశ్వాసం నుండి గాభరాగా మారిన మోదీ ప్రవర్తన, ప్రచారాల్లో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గత పదేళ్లలో ఆయన సాధించిన విజయాలను, వరుసగా మూడోసారి బీజేపీ మేనిఫెస్టోలో అందించిన హామీలను ప్రచారం చేయడం మానేశారు. కాంగ్రెస్ పార్టీ, ముస్లింల పట్ల మెజారిటీ వర్గాలను భయపెట్టి, అసహ్యించుకునేలా చేసే దిశగా ప్రచారం మారడానికి ఇదే కారణం. దీనిని భయాందోళనలకు, నిరాశకు చిహ్నంగా రాజకీయ విశ్లేషకులు అర్థం చేసుకుంటున్నారు.

గత ఒకటిన్నర నెలల్లో, దేశ రాజకీయ రంగస్థలంలో చాలా జరిగాయి. పోలింగులో తక్కువ ఓటింగ్ శాతం ప్రధానమంత్రిని, ఆయన ప్రచార నిర్వాహకులను కలవరపరిచింది. బీజేపీ, దాని మిత్రపక్షాలు గెలవగలవా అనే ప్రశ్నను లేవనెత్తింది. మోదీకి ఉన్న ప్రజాదరణ, సంక్షేమ పథకాలు, రామ మందిర ప్రారంభోత్సవం లాంటిని దృష్టిలో ఉంచుకుని ఒపీనియన్ పోల్స్ అంచనా వేసినట్లుగా, పార్లమెంటులోని 543 సీట్లలో నాలుగింట మూడొంతులు బీజేపీ కైవసం అవుతాయనే భావన ప్రమాదంలో పడింది. తొలి మూడు దశల పోలింగులో ఓటింగ్ ఊపందుకోకపోవడం, ఆ పార్టీకి భారీ మెజారిటీపై ఆశలు సన్నగిల్లేలా చేసినప్పటికీ, తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉందన్న భావన కాషాయ శిబిరంలో ఉంది.

ఓటింగ్ శాతం అంచనాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపదని రాజకీయ విశ్లేషకులు, కాషాయ పార్టీ పట్ల సానుభూతిపరులైన ఎన్నికల పండితులు అభిప్రాయ పడుతున్నారు. అయితే, రాజకీయంగా తటస్థులైన విశ్లేషకులు చాలామంది దీనిని వ్యతిరేకిస్తున్నారు. మీడియా పండితులు, రాజకీయ నిపుణుల అభిప్రాయాలు చాలా వరకు ఊహించిన స్థాయిలోనే ఉన్నాయి: వీరి అభిప్రాయం ప్రకారం 'ఏ విధంగానైనా మోదీ గెలుస్తారు'. అయితే చాలామంది 'మోదీ గెలుస్తారు, కానీ తక్కువ మెజారిటీతో' అంటూ తమ అభిప్రాయాన్ని ప్రకటిస్తూ హెచ్చరిస్తున్నారు. ఈ అభిప్రాయంతో సమస్య ఏమిటంటే, జీవనోపాధి సమస్యలపై ఓటర్లలో నిశ్శబ్దంగా చెలరేగుతున్న కోపాన్ని ఇది విస్మరిస్తోంది. జాతీయ సమస్యలపై కథనానికి తావు లేనప్పుడు, మోదీ దఙ్జల కొద్దీ స్థానిక సమస్యలను, సామాజిక అసంతృప్తిని ఎదుర్కొంటారు. దేశమంతటా ప్రతిధ్వనించే ఒక చుట్టుముట్టే కథనాన్ని బీజేపీ ఈ ఎన్నికల్లో ఎందుకు కనుగొనలేకపోయిందో అది వివరిస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో, ఉద్యోగాలు లేనప్పుడు నిరుద్యోగ సమస్యపై ఎలా స్పందించాలి, స్తబ్ధుగా ఉన్న వేతనాలు, వ్యవసాయ సంక్షోభం గురించి విమర్శలను ఎలా ఎదుర్కోవాలి, ధరలతో సతమతమవుతున్న మహిళా ఓటర్లను ఎలా ఆకర్షించాలి అనేవి మోదీ అతిపెద్ద సమస్యలు. ఒక అంశం నుండి మరో అంశానికి స్థిరత్వం లేకుండా సాగుతున్న ప్రధాని అసంబద్ధ ఎన్నికల ప్రచారం చీకటిలో కాల్పులు జరిపే కసరత్తుగా మారిపోయింది. ఏడు దశల ఎన్నికలలో ఐదు దశలలో, చాలా సంప్రదాయ అంచనాలు తలకిందులు అయినాయి. పైగా ఓటరు సెంటిమెంటును అర్థం చేసుకుంటే, విషయాలు బీజేపీకి అనుకూలంగా లేవని తెలుస్తుంది.

ఏమైనప్పటికీ, ఈ ఎన్నికలు పోటాపోటీగానే ఉన్నాయి. మోదీ ప్రభుత్వంపై ఉన్న అధికార వ్యతిరేక సెంటిమెంట్, ఓటర్ల నిరాసక్తత వంటివి ఇండియా కూటమి మెజారిటీ మార్కును చేరుకోవడానికి కారణం అవుతాయో లేదో అంచనా వేయడం కష్టం.

ఎన్నికల ఫలితాలపై రెండు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఒకటి, బీజేపీకి దాదాపు 300 సీట్లు వచ్చే అవకాశం ఉంది. రెండు, బీజేపీకి సాధారణ మెజారిటీ వచ్చే అవకాశం లేదు. పైగా మొత్తంగా ఎన్డీయే 272 మార్కుకు చేరుకుంటుందా అనే సందేహాలు ఉన్నాయి. దీనర్థం రెండు అవకాశాలు ఉన్నాయి. బీజేపీ తన 2019 పనితీరును పునరావృతం చేస్తుంది. లేదా 2024లో 2004 ఫలితాలు పునరావృతం అయ్యే అవకాశం ఉంది. ఎన్నికల వ్యూహకర్తగా మారిన రాజకీయ కార్యకర్త ప్రశాంత్ కిశోర్ మాత్రం బీజేపీ గెలుచుకునే సీట్ల సంఖ్యలో అర్థవంతమైన క్షీణతను చూడటం లేదు. మరోవైపు, రాజకీయ కార్యకర్తగా మారిన సెఫాలజిస్ట్ యోగేంద్ర యాదవ్ బీజేపీకి కనీసం 50 నుండి 60 సీట్లు తగ్గుముఖం పట్టనున్నట్లు చెబుతున్నారు. యాదవ్ అభిప్రాయం సరైనదే కావచ్చు. ఎందుకంటే ఈ నిర్ణయానికి రావడానికి ఆయన హిందీ బెల్టులో విస్తృతంగా ప్రయాణించారు మరి!

వ్యాసకర్త సీనియర్ స్వతంత్ర పాత్రికేయుడు
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరిచిపోలేని నేత



ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం రైసీని కోల్పోయామని వినడం బాధాకరం. న్యాయవ్యవస్థలో సంస్కరణలు తేవడానికి ఆయన చేసిన కృషి, ప్రజాసేవలో ఆయన చూపిన అంకితభావం ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆయన కుటుంబానికీ, దేశానికీ సంఘీభావం.

– సలీమ్ సారంగ్, ఎన్సీపీ నేత

చివరికి...



నేను మొదటిసారి 1985లో తెహ్రాన్(ఇరాన్)లో అడుగుపెట్టినప్పుడు నాకు కనిపించిన మొదటి దృశ్యం ఒక సర్కిల్‌లో ముగ్గురిని క్రేనుకు ఉరితీయడం. అది మనిషి మెడను విరిచే ఉరి కాదు. నెమ్మదిగా మనిషిని ఊపిరాడకుండా పైకి లేపే ఉరి. దానికి బాధ్యుడు? ఇబ్రహీం రైసీ. ఇప్పుడు ఆయన శరీరం గుర్తుపట్టలేనంతగా పాడై దొరికింది.

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

ఎదిగామా?



హిందీ జనాలు తెలుగు సినిమాలు చూస్తున్నారు; తెలుగు జనాలేమో మలయాళం సినిమాలు చూస్తున్నారు.

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

పరిస్థితులు...



నా జీవితంలో మొదటిసారి శివసేనకు ఓటు వేశాను(మహారాష్ట్రలో ఐదో దశ). ఇంతకంటే లౌకికవాదిగా ఉండే ముస్లిం ఎవరుంటారు?

– దారబ్ ఫారూఖీ, స్క్రీన్ రైటర్

చేసేదేమీ లేదు!




నా స్నేహితురాలు ఒకామె ఇండియాలోని ఒక పెద్ద ఐటీ కంపెనీలో పని చేస్తోంది. ఇప్పుడే ఆమె జెన్ ఏఐ కోర్సు ఒక గంటలో పూర్తి చేసింది... కేవలం 'నెక్స్ట్' బటన్‌ను వందల సార్లు నొక్కడం ద్వారా. ఇప్పుడామె జెన్ ఏఐ వర్క్‌ఫోర్సులో భాగం.

– పలాశ్ కలా, సాంకేతికాంశాల వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

దళిత చైతన్య దీప్తి

శతాబ్దాల పర్యంతం అణచివేతకు గురికాబడ్డ దళితుల గమనాన్నీ, గమ్యాన్నీ మార్చిన ఘనత ఆయనది. ఆయనే భాగ్యరెడ్డి వర్మ. ఒక దళితుడి పేరులో మూడు సామాజిక వర్గాల పేర్లుండటం ఆశ్చర్యమే. ఆయన అసలు పేరు బాగయ్య. కుటుంబ గురువు అతడి పేరును భాగ్యరెడ్డిగా మార్చారు. హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలకు తన ప్రాణాలు అడ్డుపెట్టి సేవ చేసినందుకు అప్పటి జైన సేవా సంఘం ఆయనకు వర్మ అనే బిరుదు ఇచ్చింది. అంతకు మించి దళిత జాతి చైతన్యానికి, దళిత వికాసానికి అలుపెరుగని పోరాటం చేసిన వ్యక్తి ఆయన. హైదరాబాద్‌లో 1888 మే 22న జన్మించారు.



భాగ్యరెడ్డి వర్మ

అంటరాని కులాలు అని ముద్రపడిన వారే ఈ దేశ మూలవాసులని వారిని 'ఆది హిందువు'లుగా నిలిపిన వ్యక్తి భాగ్యరెడ్డివర్మ. దళితులకు విద్య ప్రాధాన్యతను వివరించి వారికి ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారు. దేవదాసి, బసివి, జోగిని వ్యవస్థ లాంటి దురాచారాలను ఎండగట్టారు. ఆయన కృషి ఫలితంగా ఇలాంటి దురాచారాలను ఆనాడే నిజాం ప్రభుత్వం నిషేధించింది.

దళిత వర్గాల వికాసానికి 1906లో 'జగన్మిత్ర మండలి'ని స్థాపించి, 1913 నాటికి దానిని 'మన్యం సంఘం'గా, 1922 నాటికి దానిని 'సోషల్ సర్వీస్ లీగ్'గా భాగ్యరెడ్డి వర్మ మార్పు చేశారు. బాలికలకు పత్యేక పాఠశాలల ప్రాధాన్యతను గుర్తించి నెలకొల్పారు. 1910లోనే మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. 1933 నాటికి ఆ పాఠశాలల సంఖ్య 26కు పెరిగింది. వాటిలో నిజాంను ఒప్పించి తెలుగు బోధనను ప్రవేశపెట్టించారు. చాదర్ ఘాట్ రోడ్డులోని 'ఆది హిందూ భవన్'లో ఆయన నెలకొల్పిన బాలికల పాఠశాలను ఇప్పటికీ చూడవచ్చు. 1917లో బెజవాడలో ఆంధ్రదేశ మొదటి పంచమ సదస్సు భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షతన జరిగింది. అదే సభలో పంచమ అనే శబ్దాన్ని భాగ్యరెడ్డి వర్మ ఖండించారు. మరునాడు ఆ సదస్సు పేరును 'ఆది ఆంధ్రసదస్సు'గా మార్చారు. పాఠశాలల్లో అందరితో సమానమైన ప్రవేశ అవకాశాలు దళితులకు ఉండడం, బావుల్లో నీళ్ల తోడుకునే హక్కు ఆది ఆంధ్రులకు ఇవ్వడం, వారికి బంజరు భూములు పంచడం; ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమాన వాటా కల్పించడం వంటి 18 డిమాండ్లను సదస్సు ఆమోదించింది. తెలంగాణ గడ్డపై పుట్టిన తొలి దళిత చైతన్య కరదీపిక భాగ్యరెడ్డి వర్మ. ఆ మహానేత కాంక్షించిన సమ సమాజ నిర్మాణానికి కంకణబద్ధులమవుదాం.

– సాకి । 99511 72002 (రేపు భాగ్యరెడ్డి వర్మ జయంతి)

సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రక్షణ కవచం

విశ్లేషణ



చిన్ని శ్రావణ్ కుమార్

'సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలే యువతకు ఉద్యోగాలు కల్పిస్తాయి'
–వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అవసరాల్ని దృష్టిలో ఉంచుకొని తీసుకొచ్చిన చట్టం 'ఎంఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ చట్టం–2006'. తయారీదారు దగ్గర కొనని వ్యాపారస్తుని ఈ చట్టం ఎలాంటి ఇబ్బందీ పెట్టదు. తయారీదారు వద్ద కొనుగోలు చేసినవాళ్లే ఈ చట్టం పరిధిలోకి వస్తారు. భారతదేశంలో వ్యవసాయ రంగం తర్వాత 15 కోట్ల మందికి ఉపాధిని కల్పిస్తూ దేశ ఆర్థిక ప్రగతిలో 40 శాతం మేర పాలు పంచుకోవడం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల విశిష్టత.

పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా విస్తరించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక అసమానతలను తొలగించేందుకు తోడ్పడుతున్నాయి. పెట్టుబడుల కొరతను ఈ తరహా పరిశ్రమలు అధిగమించడానికి కేవలం వ్యక్తిగత హామీలతో బ్యాంకులు ఋణం అందిస్తున్నాయి. అందుకే ఇవి మనుగడ సాగిస్తున్నాయి. పీఎమ్ఈజీపీ, సీజీటీఎమ్ఎస్ఈ కింద ఇచ్చే ఋణాలతో పాటు ముద్రా ఋణాలూ ఇటువంటి పరిశ్రమల స్థాపనకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఒక వ్యక్తి కాని, వ్యాపార సంస్థ కాని (కొనుగోలుదారు) వస్తువులు లేక సేవలు సూక్ష్మ, చిన్న పరిశ్రమలను నడిపేవారి (అమ్మకందారు) నుంచి పొందినట్లయితే... వారు అమ్మకందారుకు నగదు తంచనుగా చెల్లించాలనేది ఈ చట్టం చెప్తుంది. అమ్మకందారుకు, కొనుగోలుదారుకు మధ్య ఒప్పందం ఉండాలి. ఆ ఒప్పందం గడువు 45 రోజులు మాత్రమే ఉండాలి. దాని కోసం అమ్మకందారు 'ఉద్యమ్ ఆధార్'లో నమోదు పొందిన తయారీదారుడు కావాల్సిన అవసరం లాంటి కొన్ని పరిమితులు నిర్దేశించడం ఈ చట్టంలోని ఒక సుగుణం. అలా ఒప్పంద పత్రం లేకపోతే 'నియమించిన గడువు' అనే అంశం పరిగణనలోకి వస్తుంది. వస్తువులను లేదా సేవలను అంగీకరించిన రోజు నుంచి 15 రోజుల లోపల నగదు చెల్లించాల్సి రావడమే 'నియమించిన రోజు'గా చట్టం చెబుతోంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమల తయారీదారుకు కొనుగోలుదారుకు మధ్య ఒప్పంద పత్రం రాతపూర్వకంగా ఉండాల్సి ఉంటుంది. అలా కానప్పుడు కొనుగోలుదారుడు 15 రోజుల్లోపల నగదు చెల్లించాల్సి ఉంటుంది.

కొనుగోలుదారుడు భారతదేశంలోని ఏ ప్రాంతంలోని వారైనా ఈ చట్టం వర్తిస్తుంది. ఒప్పందల పత్రంలో గడువు ఎక్కువ రోజులు రాసుకొన్నప్పటికీ ప్రభుత్వం ఎమ్ఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ చట్టం –2006 సెక్షన్ 15 ప్రకారం విధించిన గడువు కేవలం 45 రోజులే. ఇది సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల నుంచి కొనుగోలుచేసిన వ్యక్తులకు, సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది.



పెట్టుబడి ఒక కోటి రూపాయలు లోపల ఉండి రూ. 5 కోట్ల అమ్మకాలు సాగిస్తే దానిని సూక్ష్మ తరహా పరిశ్రమగా పరిగణిస్తారు. అదే పెట్టుబడి 10 కోట్ల రూపాయల లోపల ఉండి అమ్మకం రూ. 50 కోట్ల లోపల ఉంటే చిన్న తరహా పరిశ్రమగా పరిగణిస్తారు. తయారీ లేకుండా కేవలం అమ్మకం (ట్రేడింగ్) జరిపే వ్యాపారులకు ఈ చట్టం వర్తించదు. కొన్న వస్తువులకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల చట్టప్రకారం వస్తువులు లేక సేవలు పొందిన ఏ వ్యక్తి అయినా సెక్షన్ 15లో చెప్పిన విధంగా చెల్లింపు జరపని కారణంగా అమ్మకందారునికి 'వడ్డీ' చెల్లించాలి. అదీ చక్రవడ్డీ! వడ్డీ రేటు రిజర్వు బ్యాంకు, తన కింది బ్యాంకులకు సూచించిన రేటుకు మూడురెట్లుగా నిర్దేశించారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు మూలధన లభ్యత పెరిగి అవి సజీవంగా మనుగడ సాగించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

కొనుగోలుకు చెల్లింపులు జరపడంలో ఆలస్యానికి కట్టే వడ్డీని ఆదాయపు పన్ను లెక్కలో ఖర్చుల క్రింద పరిగణించకపోవడం మరో విశేషం. అయితే బకాయిలు చెల్లించిన సంవత్సరంలో ఖర్చు కింద చూపే వెసులుబాటు చట్టంలో కల్పించారు. ఈ చట్టం భారతదేశ కొనుగోలుదారులకే కాకుండా విదేశీ కొనుగోలు దారులకు సైతం వర్తిస్తుంది. ఇక్కడ వివాదాల్ని పరిష్కరించడానికీ, చట్టాలు అమలు చేయడానికి దేశ దౌత్యవేత్తల కార్యాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి.

ఆదాయపు పన్ను సెక్షన్ 43బీ(హెచ్)కు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల చట్టం సెక్షన్ 15ను కలిపి చదివితేనే మనకు ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన కలుగుతుంది. ప్రతి సంస్థ చట్టాలకు లోబడి ఆస్తి, అప్పుల పట్టీని తయారు చేసి లెక్కలు తనిఖీ చేయించాల్సి ఉంటుంది. అయితే, ఏ సంస్థ అయితే సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సకాలంలో చెల్లించలేదో, వాటి బకాయిలను చెల్లించాల్సిన వడ్డీని బహిర్గతం చేయాలి. కంపెనీ అయితే కంపెనీ చట్టాలకు లోబడీ, ఇతరత్రా అయితే ఆ చట్టాలను అనుసరించీ!

2006 చట్టంగా వచ్చినప్పటికీ, అమలు చేయడంలో చర్యలు ఇప్పుడిప్పుడే ప్రారంభ మయ్యాయి. ఆదాయపు పన్ను చట్టంతో ముడిపెట్టడం వల్ల చట్టం విలువ పెరిగి దాని ప్రాముఖ్యాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ప్రస్తుత తరుణంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల మనుగడకు ఈ చట్టం ఒక రక్షణ కవచంగా నిలుస్తున్నదనేది కాదనలేని నిజం.

వ్యాసకర్త చార్టర్డ్ అకౌంటెంట్

నారద సందేహం

ఒకరోజు నారదుడు తనదైన రాగంలో ఓ పాట పాడుకుంటూ వస్తున్నాడు. 'ఈ రాగాన్ని సరిగ్గా పాడుతున్నానా' అని ఆయనకు సందేహం కలిగింది. వెంటనే సరస్వతి వద్దకు వెళ్ళి 'నేను పాడుతున్న రాగం సరిగ్గా ఉందా' అని పాడి వినిపించాడు. అందుకు ఆమె 'నువ్వు పాడుతున్నది సరిగ్గా ఉందో లేదో అనే విషయాన్ని ఆంజనేయుడి వద్దకు వెళ్ళి అడిగి తెలుసుకో' అంది. అందుకు నారదుడు ఆంజనేయుడి వద్దకు వెళ్ళాలా అని లోలోపల బాధపడుతూ తిన్నగా ఆంజనేయుడి వద్దకు వెళ్ళి పాడి వినిపించాడు. అది సరిగ్గా ఉందా అని అడిగాడు. ఆంజనేయుడు ఏమీ మాట్లాడకుండా నారదుని తీసుకుపోయి ఓ కొండ మీద నిలబెట్టాడు. ఇప్పుడు పాడు అన్నాడు. 'నువ్వు పాడిన పాట సవ్యంగా ఉంటే ఈ కొండ కరుగుతుంద'న్నాడు ఆంజనేయుడు. నారదుడు పాడాడు. కానీ కొండ కరగలేదు. 'సరే ఇప్పుడు నేను పాడుతాను' అని ఆంజనేయుడు పాడాడు. కొండ కరగనారంభించింది. నేను నిల్చున్న కొండ కరుగుతోందని నారదుడు పెద్దగా అరిచాడు. ఆంజనేయుడు పాడుతున్న పాటను ఆపాడు. వెంటనే కొండ కరగడం ఆగిపోయింది. కరిగిన కొండ బీటలు వారడం మొదలయింది. నారదుడి కాలు అందులో చిక్కుకుంది. కాలు బయటకు తీయడం కుదరలేదు. ఆంజనేయుడు మళ్ళీ పాడి నారదుడిని కాపాడాడు. అయితే నారదుడు అసహనంతో రగిలిపోయి కోపంతో 'ఈ ఆహిరి రాగాన్ని ఎవరు పాడినా వారికి అన్నం దొరకదు' అని శపించాడని అంటారు. ఆ శాపం నిజమేనేమో అని ఇప్పటికీ కొందరు ఆ రాగంలో పాటలు పాడటానికి భయపడతారు. కానీ నాకు తెలిసిన ఓ సంగీత విద్వాంసుడు రోజూ ఆ రాగంలో పాట పాడుతూ ఉంటాడు. అదీనూ ఇంట్లోనే, తెల్లవారు జామున. ఆయనతో ఓ రోజన్నాను 'మీకు చాలా ధైర్యమండి' అని. 'ఎందుకలా అంటున్నారు' అని ఆయన ప్రశ్నించాడు. విషయం చెప్పాను. ఆయన నా వంక చూసి 'అలాగేమీ లేదు. నేను ఏ రాగం పాడినా మా ఇంట్లో అన్నం దొరకదు సార్. అందువల్ల నేనా రాగాన్ని ధైర్యంగా పాడుతుంటాను' అని చెప్పాడు.



– యామిజాల జగదీశ్



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.4.43 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** స్వాతి పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ఉ.11.21 నుండి 1.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.03 నుండి 8.51 వరకు, తదుపరి రా.10.51 నుండి 11.39 వరకు, **అమృతఘడియలు:** రా.9.40 నుండి 11.23 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.22.

చెరువులోని మృతదేహాల ఆచూకీ లభ్యం

- తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన వారిగా ఇద్దరి గుర్తింపు
- మరో మృతదేహం వివరాల కోసం ఆరా

కర్నూలు: కర్నూలు శివారులోని గార్గేయపురం నగరవనం చెరువులో బయటపడిన రెండు మృతదేహాల ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఆ ప్రాంతంలో మొత్తం ముగ్గురు మహిళల మృతదేహాలు బయట పడగా.. ఇద్దరి వివరాలు పోలీసులు కనుగొన్నారు. వారు తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన అరుణ(45), జానకి(40)గా నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని కర్నూలు రేంజి డీఐజీ విజయారావు, ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం పరిశీలించి దర్యాప్తు కోసం మూడు ప్రత్యేక బృందాలను నియమించారు. మృతులు కొంతకాలంగా వ్యభిచార వృత్తి చేస్తూ కర్నూలు కొత్త బస్టాండు పరిసర ప్రాంతాల్లో సంచరించేవారని.. వారితో పాటు వ్యభిచార వృత్తిలో ఉన్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఎంత కాలం నుంచి ఈ ప్రాంతంలో ఉంటున్నారు... చెరువుగట్టు వద్దకు ఎందుకు వెళ్లారు... సమీపంలో వెంకాయపల్లి ఎల్లమ్మ ఉత్సవం జరుగుతుండటంతో అక్కడికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడ్డారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారా.. అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. మరో మృతదేహానికి సంబంధించిన ఆచూకీ తెలియాల్సి ఉంది. రెండు మృతదేహాలకు ఆదివారం పోలీసులే అంత్యక్రియలు నిర్వహించినట్లు సమాచారం.

ఆటో డ్రైవర్‌పై అనుమానం!

కర్నూలుకు చెందిన ఆటోడ్రైవర్ బాషా అనే వ్యక్తితో మృతి చెందిన మహిళలకు పరిచయం ఉంది. గతంలో ఈ మహిళలు అతడిని పోలీసులతో కొట్టించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని సమయం కోసం ఎదురుచూస్తున్న బాషా.. మూడు రోజుల కిందట వాళ్లతో కలిసి ఆటోలో మద్యం తాగేందుకు గార్గేయపురం చెరువు దగ్గరకు వెళ్లినట్లు సమాచారం. అక్కడ మద్యం తాగిన తర్వాత దుస్తులు శుభ్రం చేసుకునేందుకు మహిళలు చెరువు దగ్గరకు వెళ్లగా, ఇదే అదనుగా భావించిన బాషా వాళ్లను నీటిలోకి తోసేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి

దేశ రాజధానిలో కొబ్బరి మామిడి రాజసం

కొత్తపల్లి నుంచి ఢిల్లీ వరకూ..
పసందైన పండూరు మామిడి
అతి మధుర ఫలాలకు మంచి గిరాకీ



పిఠాపురం: మామిడిలో రారాజుగా పేరొందిన కొత్తపల్లి కొబ్బరి మామిడికి ఎక్కడాలేని గిరాకీ పలుకుతోంది. మామిడి ప్రియుల మనసు దోచుకున్న ఒకే ఒక్క మధుర ఫలం ఇది. రుచిలో అతి మధురంగా ఉండడంతో ఈ మామిడి పండ్ల రేటు పైపైకి ఎగబాకి పండ్ల ప్రియులను ఊరిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

మామిడిలో ఎన్నో రకాలున్నప్పటికీ వాటిలో గోదావరి జిల్లాల్లో మాత్రమే లభించే కొత్తపల్లి కొబ్బరి, పండూరు మామిడికి ఉన్న డిమాండ్ వేరు. మామిడి రకాల్లో ఈ రెండింటినీ హిడెన్ జెమ్స్‌గా భావిస్తారు. వీటి ప్రాముఖ్యతను గుర్తించి, సంరక్షించిన గ్రామాల పేరిటే ఇవి ప్రసిద్ధి చెందాయని ఆ ప్రాంతవాసులు అంటున్నారు. ఉత్తమ లక్షణాలున్న పండ్లుగా ఇవి గుర్తింపు పొందడంతో రాజుల కాలం నుంచే వీటికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. పూర్వం ఆంధ్ర ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు తమ తోటల్లో వీటిని పెంచుకుని, ఆ రుచిని తాము ఆస్వాదించడంతోపాటు మిత్ర రాజులకు కానుకలుగా పంపేవారట. అందుకే ఒకప్పుడు రాజ సంస్థానాల్లో మాత్రమే ఈ పండ్లు ఉండేవని, సాధారణ ప్రజానీకానికి అందుబాటులో ఉండేవి కావనే ప్రచారం కూడా ఉంది. ఇప్పటికీ ఈ రకం మామిడి పండ్లను తమ స్నేహితులకు, బంధువులకు, పెద్ద పెద్ద రాజకీయ నాయకులకు బహుమతిగా పంపించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఏటా గోదావరి జిల్లాల నుంచి సుమారు 20 టన్నుల వరకూ కొత్తపల్లి కొబ్బరి, కాకినాడ రూరల్ మండలంలోని పండూరు మామిడి రకాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉండకపోవడంతో ప్రస్తుతం దూర ప్రాంతాలకు ఎగుమతులు జరగడం లేదని అంటున్నారు.

కొత్తపల్లి కొబ్బరి

గోదావరి జిల్లాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన మామిడి రకాల్లో కొత్తపల్లి కొబ్బరిదే ప్రథమ స్థానం. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి ప్రాంతంలో లభించే అమోఘమైన రుచి కలిగిన మామిడి పండు ఇది. కొబ్బరి కాయలో మాదిరిగా పీచు అధికంగా ఉండటంతో ఈ రకాన్ని కొత్తపల్లి కొబ్బరిగా పిలుస్తారు. మేలిమి బంగారు రంగులో మెరిసిపోతూ సువాసనలు వెదజల్లుతుంటుంది. పూదోటలో మాదిరిగా ఈ రకం మామిడి పండ్లు ఉన్నచోట సువాసనలు వెదజల్లుతుంటాయి. ఈ మామిడి పండులో కెరోటిన్, కాల్షియం, విటమిన్ ఎ, సి. ఎక్కువగా ఉంటాయి. తొక్క పలుచగా ఉండి సైజు చిన్నగా ఉంటుంది. పులుపు ఎక్కువగా ఉండటంతో పచ్చి మామిడి తినలేరు. కానీ పండు మాత్రం అతి మధురం. ఇవి మామిడి సీజన్‌లో మాత్రమే పండుతాయి. పీచు ఎక్కువగా ఉండటంతో ఆవకాయ, ఊరగాయలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ మామిడితో పెట్టిన ఊరగాయలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. ఈ చెట్ల కాపు తక్కువగా ఉంటుంది. పండు చిన్నదే కానీ ధర మాత్రం అదరగొడుతుంది.

పండూరు మామిడి

ఇది అత్యంత పురాతనమైన మామిడి రకం. ఈ చెట్టు వంద అడుగుల ఎత్తు వరకూ పెరిగి, నిండా కాయలుంటాయి. చూడటానికి పప్పులో వేసుకునే చిన్న మామిడి కాయల్లా మాత్రమే ఉంటాయి. పండ్లు కూడా ఆకుపచ్చగానే ఉండటం వీటి ప్రత్యేకత. తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని వెలగదూరు గ్రామ పరిసరాల్లోని సంస్థానంలో పూర్వం కొందరు దొంగలు మామిడి పండ్లను దొంగిలించి, తిని, వాటి టెంకలను కోట అవతల పారేశారని, వాటిని తీసి నాటగా వచ్చిన చెట్టు ద్వారా ఈ పండ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయనే కథనం ఒకటి ప్రచారంలో ఉంది.

దిగుబడి తగ్గి.. డిమాండ్ పెరిగి..



గత ఏడాదికంటే దిగుబడి తగ్గడంతో కొబ్బరి మామిడికి డిమాండ్ అమాంతం పెరిగింది. గత ఏడాది 100 కొబ్బరి మామిడి కాయలు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకూ విక్రయించగా ఈ ఏడాది రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకూ అమ్ముడవుతోంది. ముఖ్యంగా రాజకీయ నాయకులకు పంపడానికి స్థానిక నేతలు వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో సామాన్యులు కొని తినే అవకాశం లేకుండా పోయింది. గతంలో దిగుబడి ఎక్కువగా ఉండటంతో అందరికీ అందుబాటులో ఉండేవి. కానీ ఈ ఏడాది కొబ్బరి మామిడి చెట్లు పూత రాలిపోయి తక్కువగా కాశాయి. దీంతో దిగుబడి చాలా తక్కువ వస్తోంది. కాయ సైజు కూడా చిన్నదిగా ఉంటోంది. ఎంత ఖరీదైనా కొనుగోలు చేయడానికి మామిడి ప్రియులు ఎగబడటంతో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకూ 2 టన్నుల కాయలు విక్రయించాం. మరికొద్ది రోజులు మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయి.

– కందేపల్లి మహేష్, మామిడి వ్యాపారి, కొత్తపల్లి

వీటి గిరాకీ వేటికీ ఉండదు



కొత్తపల్లి కొబ్బరి రకానికి ఉన్న గిరాకీ మరే మామిడి పండుకూ ఉండదు. పీచు అధికంగా ఉండటంతో ఊరగాయలకు ఎక్కువగా వాడుతుంటారు. ఈ ఏడాది కాపు తక్కువగా ఉండడంతో వీటికి ఎనలేని గిరాకీ పెరిగింది. దీంతో కాయ పెద్దది కాకముందే కోసేస్తున్నాం. మామిడి సీజన్‌లో మొదటిగా ఇవి అందుబాటులోకి వస్తాయి. కాయ టెంక కట్టగానే పండించడానికి వీలుంటుంది. వందల సంఖ్యలో ఆర్డర్లు ఇస్తున్నారు. ఇది తొందరగా ముగ్గిపోతుంది. కాయ బాగా ముదిరితే మంచి నాణ్యత ఉంటుంది. ప్రస్తుతం కొనుగోలుదారులు ఎక్కువగా ఉండటంతో ఇవి ఎక్కడా దొరకని పరిస్థితి ఏర్పడింది.

– ఓరుగంటి నాగబాబు, మామిడి రైతు, చేబ్రోలు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈఈ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జ్యోతిర్మయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. ఈఈ ఎల్.రమాదేవి, ఏఈవో ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను బహూకరించారు.

తిరుపతి-గుల్బర్గా విమాన సర్వీసు రద్దు

- సాంకేతిక సమస్యే కారణం
- ఆందోళనకు దిగిన ప్రయాణికులు



నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

రేణిగుంట (తిరుపతి జిల్లా): తిరుపతి విమానాశ్రయం నుంచి గుల్బర్గా వెళ్లాల్సిన స్టార్ ఎయిర్ విమాన సర్వీసు సాంకేతిక కారణంతో రద్దు కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. స్టార్ ఎయిర్ సంస్థకు చెందిన విమాన సర్వీసు గుల్బర్గా నుంచి సోమవారం మధ్యాహ్నం 3.10గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరిగి 4.20గంటలకు గుల్బర్గాకు బయల్దేరి వెళ్లాలి. అయితే మధ్యాహ్నం 3గంటల సమయంలో స్టార్ ఎయిర్ సిబ్బంది ప్రయాణికుల వద్దకు చేరుకుని సాంకేతిక సమస్య తలెత్తడంతో విమాన సర్వీసు రద్దు అయిందని చెప్పడంతో అక్కడున్న ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో తామంతా విమానాశ్రయానికి చేరుకుని వేచి ఉన్నామని, అయితే విమాన సర్వీసు రద్దు అయిందని చెప్పి ఎటువంటి సౌకర్యాలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధితులు వాపోయారు. టెర్మినల్ లోపల స్టార్ ఎయిర్ కౌంటర్ ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

విశాఖ జూలో మళ్లీ డీర్ సఫారీ

సీఎస్ఆర్ నిధులతో పునరాభివృద్ధికి చర్యలు



విశాఖ జూలో చుక్కల జింకలు (ఫైల్)

ఆరిలోవ (విశాఖ జిల్లా): ఇందిరాగాంధీ జూ పార్కులో జింకల (డీర్) సఫారీ అభివృద్ధికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో ఇక్కడ గతంలో ఉండే డీర్ సఫారీకి మళ్లీ మోక్షం కలగనుంది. జూలో చింపాంజీ, చిరుతల ఎన్‌క్లోజర్ల నుంచి లోపలకు కొండల మధ్య గతంలో డీర్ సఫారీ నిర్వహించేవారు. జూ సందర్శకులు ఎక్కువ మంది సఫారీకి వెళ్లేవారు. జూ లోపల కొండల అంచున సన్నని దారిలో సందర్శకులు నడుచుకొంటూ వెళ్లేవారు. దారి పొడవునా చుక్కల జింకలు గెంతులు వేస్తూ సందర్శకులను అలరించేవి. దారికి ఇరుపక్కల పచ్చని చెట్లు, మధ్యమధ్యలో ఔషధ మొక్కలు సువాసనలు వెదజల్లేవి. దీంతో పాటు పక్షులు తమ కూతలతో సఫారీకి వెళ్లే సందర్శకులకు వీనుల విందు చేసేవి. 2 దశాబ్దాలకు క్రితం ఇది మూతబడింది. అప్పటి నుంచి ఇంతవరకు జూకి సమకూరే ఆదాయం సఫారీ పునరాభివృద్ధికి చాలదనే ఆలోచనతో అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల దీనిపై ఇక్కడి అధికారులు దృష్టిపెట్టారు. సఫారీని అభివృద్ధి చేయదలిచారు. దీనికోసం కొద్ది రోజుల క్రితం సన్నాహాలు ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సీఎస్ఆర్ నిధులు కోసం సంప్రదించారు. రిలయన్స్ సంస్థ తమ రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులను జూ అభివృద్ధి కోసం ఇవ్వడానికి ముందుకురావడంతో వాటితో జూ అధికారులు డీర్ సఫారీ పునరాభివృద్ధితో పాటు హుదూద్ సమయంలో కూలిపోయిన రాబందుల ఎన్‌క్లోజర్‌ను నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. టయోటో సంస్థ కూడా సీఎస్ఆర్ నిధులు జూ అభివృద్ధి కోసం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని వాటితో జూ ప్రధాన ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,721 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ. 3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 16 గంటల సమయం పడుతోంది.


విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా డివిజన్‌లో పలు రైళ్లను పూర్తిగానూ, మరికొన్ని రైళ్లను పాక్షికంగానూ రద్దు చేస్తున్నట్లు విజయవాడ పీఆర్‌వో నుస్రత్ మండ్రుప్కర్ సోమవారం తెలిపారు. ఈ నెల 27 నుంచి జూన్ 23 వరకు బిట్రగుంట-విజయవాడ (07977/07978), 27 నుంచి 31 వరకు, జూన్ 3 నుంచి 7 వరకు, జూన్ 10 నుంచి 14 వరకు, జూన్ 17 నుంచి 21 వరకు బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237/17238), 27 నుంచి జూన్ 23 వరకు గుంటూరు-రాయగడ(17243), కాకినాడ పోర్టు-విశాఖపట్నం (17267/17268), 28 నుంచి రాయగడ-గుంటూరు (17244) రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు: ఈ నెల 27 నుంచి జూన్ 23 వరకు మచిలీపట్నం-విజయవాడ (07896 /07769/ 07866/ 07770/ 07870), నర్సాపూర్-విజయవాడ (07863), విజయవాడ-భీమవరం జంక్షన్ (07283) రైళ్లను విజయవాడ-రామవరప్పాడు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

ఉల్లంఘిస్తే ఊరుకోవాలా!?

- ఎన్నికల నిబంధనలకు లోబడే ఏయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ లావణ్యదేవి సస్పెన్షన్
- ఆమె భర్త టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తరఫున ప్రచారంతో ఈసీ చర్యలు
- ఈనెల 5న లావణ్యదేవికి షోకాజ్ ఇచ్చిన గాజువాక ఆర్‌ఓ
- అనంతరం జిల్లా ఎన్నికల అధికారి చర్యలకు ఆదేశం
- ఆ ఆదేశాలకు అనుగుణంగా ఏయూ చర్యలు
- ఈసీ శిక్షిస్తే.. ఏయూపై జనసేన నేత నిందలు



మెడలో పచ్చకండువాతో ప్రచారం చేస్తున్న ప్రొ.లావణ్య

సాక్షి, విశాఖపట్నం: ప్రొఫెసర్ అంటే.. బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వందల మంది విద్యార్థులకు రోల్‌మోడల్‌గా ఉండాలి. అంతే తప్ప.. రాజకీయ రంగులు పులిమేసుకుంటూ.. 'పచ్చ'పాతంతో ఎన్నికల ప్రచారం చేస్తే ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపిస్తుంది. వెంటనే వేటు వెయ్యాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేస్తుంది. విశాఖలో ఇప్పుడు అదే జరిగింది కూడా. కానీ, తప్పు ఎవరు చేసినా తప్పే అని తెలిసినా.. తిమ్మిని బమ్మినిగా మార్చేందుకు టీడీపీ నేతలు, వారికి తోక పార్టీ అయిన జనసేన నేత ఈ విషయంలో నోటికొచ్చినట్లు అవాకులు చెవాకులు పేలుతున్నారు. అసలు విషయం ఏమిటంటే..

ఎన్నికల నియమావళిని అనుసరించి విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి. లావణ్యదేవి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆమె తన భర్త, టీడీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తరఫున గాజువాక ఏరియాలో పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఒక పార్టీకి, పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేయకూడదు. దీనిని ఉల్లంఘిస్తూ ఆమె సంబంధిత నియోజకవర్గంలో ఇంటింటికీ ప్రచారం చేస్తూ తన భర్తకు ఓటువేయాలని అభ్యర్థించారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో, దినపత్రికల్లో వచ్చాయి. వీటిని పరిశీలించిన గాజువాక రిటర్నింగ్ అధికారి మే 5న షోకాజ్ నోటీసు జారీచేస్తూ, ఏయూ రిజిస్ట్రార్‌కు ఒక కాపీని పంపారు. అనంతరం జోన్ 6 జోనల్ కమిషనర్ స్వయంగా విచారణ జరిపి, ఆమె 76వ వార్డులో ఇంటింటికీ ప్రచారం చేయడం వాస్తవమని నిర్ధారించారు. జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) ఏయూ అధికారులకు మే 6న మరొక ఉత్తర్వు ఏయూకు పంపారు. ఇందులో లావణ్యదేవి టీడీపీ తరఫున ప్రచారంలో పాల్గొని, ఓట్లు అభ్యర్థించినట్లు నిర్ధారణ అయిందని, ఎన్నికల కోడ్‌ను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో. యూనివర్సిటీ మాన్యువల్‌ను అనుసరించి అధికారులు చర్యలు తీసుకున్నారు. మే 6న చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులు సూచించినప్పటికీ ఏయూ అధికారులు మే 8 వరకు ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎన్నికల సంఘం ఒత్తిడి మేరకే తదుపరి చర్యలు చేపట్టారు.

ఏయూ అధికారులపై జనసేన కార్పొరేటర్ దుర్భాష..

వాస్తవాలిలా ఉంటే.. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఇష్టారాజ్యంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి నోటికొచ్చింది మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయి. అలాగే, ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించిన ఏయూ అధికారులపై మూర్తియాదవ్ దుర్భాషలాడారు. మరోవైపు.. ఏయూ ప్రగతిని చూసి ఓర్వలేక ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కొమ్ముకాస్తూ ఏయూ ప్రతిష్టను దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారు. ఆయన తన పద్ధతి మార్చుకోవాలని ప్రజలు, ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు హితవు పలుకుతున్నారు. కార్పొరేటర్‌గా ఒక బాధ్యతాయుత పదవిలో ఉన్న మూర్తి యాదవ్ తన స్థాయిని మరిచి నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదంటున్నారు. విశాఖ ప్రజలు ఆయన్ను ఛీకొడుతున్నా సిగ్గూఎగ్గూ లేకుండా వ్యవహరిస్తున్న ఆయన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓ మదీ 'మే'లుకో..!

- ఏటా పెరుగుతున్న మానసిక సమస్యలు
- స్మార్ట్‌ఫోన్ల వాడకంతో అధిక ప్రభావం
- మానసిక ఆరోగ్య అవగాహన నెల మే

గుంటూరు మెడికల్: ఇంట్లో పిల్లలు అదే పనిగా వీడియోగేమ్స్ ఆడుతూ మిగతా పనులను పక్కన పెట్టేస్తున్నారా.. తదేకంగా గంటల తరబడి టీవీలకు అతుక్కుపోయి ఉంటున్నారా.. అయితే వారిని ఓ కంట కనిపెట్టి ఉండాల్సిందే. లేకుంటే చిన్నవయస్సులోనే వారు మానసిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని మానసిక వ్యాధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంటలకొద్దీ కంప్యూటర్ ముందు కూర్చుని చాటింగ్‌లు చేయటం, ఫేస్‌బుక్‌లో తలమునకలవుతూ ఉండటం మానసిక వ్యాధులకు కారణమవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ వినియోగం బాగా పెరగడం వల్ల మానసిక జబ్బులు ఎక్కువయ్యాయని ఈ-ఎడిక్షన్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. మానసిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా మే నెలను ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ' సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. జిల్లా వ్యాప్తంగా 35 మంది మానసిక వైద్యనిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 20 మంది వరకు వివిధ రకాల మానసిక సమస్యలతో బాధపడే వారు వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో రోజూ 100 నుంచి 130 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

మానసికవ్యాధి లక్షణాలు...

చికాకు, కోపం, విసుగు తదితర లక్షణాలు వారానికి పై బడి ఉంటే వారు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాలి. తనలో తాను మాట్లాడుకోవటం, ఒంటరిగా తనొక్కడే ఉండి నవ్వుకోవటం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవటం, చేసిన పనిని పదేపదే చేయాలనుకోవటం, అనవసరమైన ఆలోచన్ని ఆపుకోలేకపోవటం, నిద్రలేమి, బరువుపెరగటం, నిర్ణయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం చేసి తనమీద ఆధారపడే వారందరిని ఇబ్బందికి గురిచేస్తూ తానూ ఇబ్బందులకు గురికావడం, ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం, తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాల వరకు వెళ్ళటం, తిరగబడి దాడి చేయటం, వ్యక్తిలో ఉన్న అనుమానాలు ఎన్ని రూపాల్లో నివృత్తి చేసే యత్నం చేసినా ఒప్పుకోకపోవటం తదితర లక్షణాలు మానసిక వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి.

హార్మోన్ల లోపమే కారణం

ఒత్తిడి, వ్యసనాలు, మితిమీరిన సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం వల్ల ప్రస్తుతం మానసిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ జబ్బులు వంశపారంపర్యంగానూ అధికంగా వస్తుంటాయి. మెదడులో రసాయనాలు ఊరటంలో మార్పు, మెదడులో గడ్డలు ఏర్పటం, మెదడులో 'డోపమిన్' హార్మోన్ లోపం, హార్మోన్ అసమతుల్యం, అసమానత్వం, పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవటం, ఫిట్స్, నిద్రలేమి వల్ల కూడా మనో వ్యాధులు వస్తాయి. మానసిక వ్యాధులతో ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు ఎక్కువగా బాధపడుతున్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సత్తాచాటిన ఇషిత



పోటీల్లో సాధించిన పతకాలతో ఇషిత

విశాఖ స్పోర్ట్స్: నావల్ ఎయిర్ గన్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో ఇషిత పొద్దార్ సత్తా చాటింది. ఇండియన్ నావల్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో యూత్, జూనియర్, సీనియర్ ఉమెన్ మూడింట రజత పతకాలను సొంతం చేసుకుంది. ఐఎన్ఎస్ డేగాలో కెప్టెన్ రాజ్‌కుమార్ కుమార్తె అయిన ఇషిత కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఈ పతకాలను సొంతం చేసుకుంది. పాల్గొన్న మూడు కమాండ్స్ జట్లలో ఇషితే పిన్నవయస్కురాలు కావడం విశేషం.

విజయవాడ- ముంబై విమాన సర్వీసుపై ఏపీ చాంబర్స్ హర్షం

సాక్షి, అమరావతి: విజయవాడ నుంచి నేరుగా ఆర్థిక రాజధాని ముంబైకు విమాన సర్వీసులను ప్రారంభించడంపై ఏపీ చాంబర్స్ హర్షం వ్యక్తం చేసింది. విజయవాడ నుంచి పలు కీలక నగరాలకు విమాన కనెక్టివిటీని పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని, ఇప్పుడు ఎయిర్ ఇండియా ముంబైకు విమాన సర్వీసు ప్రారంభించడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందని పేర్కొంది. ఇదే సమయంలో విజయవాడలో ఇంటర్నేషనల్ ఎయిర్ కార్గో సర్వీసుకు విపరీతమైన డిమాండ్ ఉందని, దీన్ని కూడా వేగంగా అమల్లోకి తీసుకురావాల్సిందిగా ఏపీ చాంబర్స్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

టీడీపీ నేత బంధువు కారులో రూ.68.40 లక్షలు స్వాధీనం


హైదరాబాద్ నుంచి కారులో తరలిస్తుండగా గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

జగ్గయ్యపేట: తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బంధువు ఒకరు ఎటువంటి పత్రాలు లేకుండా హైదరాబాద్ నుంచి కారులో తీసుకువస్తున్న రూ.68.40 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలో ఏపీ – తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ఈ నగదు లభించింది. దీనికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని, చిల్లకల్లు పోలీసులకు అప్పగించారు. ఈ నగదు తెస్తున్న వ్యక్తి తెలుగుదేశం పార్టీ నేత, ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో కీలకంగా వ్యవహరించే మాజీ ఎమ్మెల్సీకి దగ్గరి బంధువుగా చెబుతున్నారు. ఆయన బెట్టింగ్‌లకు బుకీ (మధ్యవర్తి)గా వ్యవహరిస్తారని, ఆ డబ్బంతా ఎన్నికల ఫలితాలపై పందేలు కట్టిన వారి నుంచి వసూలు చేసి తెస్తున్నదని సమాచారం.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



ప్రసంగిస్తున్న రెడ్ క్రాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ కుమార్

ఉయ్యూరు: ఎన్‌సీసీ క్యాడెట్స్ సమాజసేవలో భాగస్వాములు కావడంతో పాటు సమాజంలోని ప్రతీ ఒక్కరికీ సహాయకారిగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.వి.ఎస్.కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఎన్‌సీసీ కాకినాడ బెటాలియన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ఉయ్యూరులో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్స్ సహాయ కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. రక్తదానం చేసి రాష్ట్రంలోని ఇతర యువతీ యువకులకు ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థీ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. యువత రెడ్‌క్రాస్ యాప్‌లో వలంటీర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీసీ బెటాలియన్ అధికారి అజిత్‌సింగ్ మాట్లాడుతూ క్యాడెట్స్ ప్రతీ స్వచ్ఛంద సేవా కార్యక్రమంలోనూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉయ్యూరులో జరిగిన ఈ శిక్షణకార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధజిల్లాల నుండి 700 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ హాజరుకాగా.. 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాడెట్స్‌కు రెడ్‌క్రాస్ ప్రతినిధులు శంకర్నాద్, అన్నమ్మ ప్రత్యేక శిక్షణ అందించారు.



అధ్యక్షుడు రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కుప్పకూలిన దృశ్యం

ఇరాన్ అధ్యక్షుడు రైసీ దుర్మరణం

- హెలికాప్టర్ కూలిన ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ తదితరుల మృతి
- మహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించిన అయోతొల్లా
- ఐదు రోజులు సంతాప దినాలుగా పాటించనున్న దేశ ప్రజలు



దుబాయ్: ఇరాన్ తూర్పు అజర్‌బైజాన్ పర్వతసానువుల్లో హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఆ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ(63) ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ దట్టమైన అటవీప్రాంతంలో కనిపించకుండా పోయిన విషయం తెల్సిందే. ఈ ఘటనలో విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దుల్లాహియాన్ (60), ఈస్ట్ అజర్‌బైజాన్ ప్రావిన్స్ గవర్నర్ మాలిక్ రహమతీ, అధికారులు, పైలట్లు, అంగరక్షకులు చనిపోయారని ఇరాన్ అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది. ఇరాన్ సుప్రీంలీడర్ అయాతొల్లాహ్ అలీ ఖమేనీ మార్గదర్శకంలో ఇజ్రాయెల్‌పై గత నెలలో ఇరాన్ జరిపిన భీకర డ్రోన్లు, క్షిపణి దాడుల ఘటన మరువకముందే రైసీ హఠాన్మరణంపై ప్రపంచవ్యాప్తంగా భిన్న కథనాలు వినవస్తున్నాయి. అయితే రైసీ మరణోదంతంలో తమ ప్రమేయం ఎంతమాత్రం లేదని ఇజ్రాయెల్ సోమవారం స్పష్టంచేసింది. హెలికాప్టర్ ప్రమాదంపై అత్యున్నతస్థాయి దర్యాప్తునకు సాయపడేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షొయిగు మాట ఇచ్చారు. రైసీ మరణం నేపథ్యంలో ప్రస్తుత ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ మొఖ్బర్‌ను తాత్కాలిక దేశాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఖమేనీ ప్రకటించారు. ఉపవిదేశాంగ మంత్రి బఘేరీ కనీని నూతన విదేశాంగ మంత్రిగా నియమించారు. హెలికాప్టర్ కూలడానికి గల కారణాలను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. అధ్యక్షుడి మరణవార్త తెలిసి ఇరాన్ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి. ఐదు రోజులు సంతాపదినాలుగా పాటించనున్నారు. లెబనాన్, సిరియా సైతం మూ డ్రోజులు సంతాప దినాలుగా ప్రకటించాయి. భారత్ సైతం ఒక రోజు(మంగళవారం)ను సంతాప దినంగా ప్రకటించింది. రైసీ, ఇతర నేతల మృతదేహాలను తబ్రిజ్ పట్టణానికి తీసుకొస్తున్నారు. రైసీ ఖనన క్రతువును మషాద్ నగరంలో చేసే అవకాశం ఉంది.



తాత్కాలిక అధ్యక్షుడు మొఖ్బర్

సరిహద్దుకు 20 కి.మీ.ల దూరంలోని పచ్చని అటవీప్రాంతంలో హెలికాప్టర్ కూలిన ప్రాంతాన్ని కనిపెట్టి సహాయక బృందాలకు సమాచారం చేరవేసింది. దీంతో దళాలు నేరుగా ఘటనాస్థలికి చేరుకోగలిగాయి. ఆ తర్వాతే రైసీ మరణవార్తను ధ్రువీకరించారు.

జాడ చెప్పిన తుర్కియే అత్యాధునిక డ్రోన్

భారీ వర్షం, దట్టంగా కమ్ముకున్న మంచు, దారిలేని పర్వతమయ అటవీప్రాంతం కావడంతో త్రివిధ దళాలు రంగప్రవేశం చేసినా గాలింపు చర్యల్లో ఎలాంటి పురోగతి లేదు. దీంతో తుర్కియే తమ అత్యాధునిక నిఘా డ్రోన్‌ను రంగంలోకి దింపింది. అది అడవిలో ఉష్ణోగ్రతల్లో మార్పుల ఆధారంగా

సంతాపాల వెల్లువ

రైసీ మరణవార్త తెల్సి చాలా ప్రపంచదేశాలు తమ సంతాప సందేశాలను పంపించాయి. ప్రధాని మోదీ సైతం తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ''రైసీ మరణవార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్–ఇరాన్ సంబంధాల బలోపేతానికి రైసీ చేసిన కృషి చిరస్మరణీయం. రైసీ కుటుంబ సభ్యులకు, ఇరాన్ దేశ ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ విచారకర సమయంలో ఇరాన్‌కు అండగా ఉంటాం'' అని మోదీ సోమవారం 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. లెబనాన్, సిరియా, ఫ్రాన్స్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, చైనా, టర్కీ, రష్యా, మలేసియా, హౌతీ, ఖతార్, ఇరాక్, పాకిస్తాన్, అజర్‌బైజాన్, పోలండ్, యూఏఈ, వెనిజులా దేశాలు, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి, నాటో, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ సంతాపం తెలిపాయి. గొప్ప సోదరుడిని కోల్పోయామని లెబనాన్ ఉగ్రసంస్థ హెజ్‌బొల్లా, హమాస్‌తో పాటు హౌతీ తిరుగుబాటుదారులు సంతాపం ప్రకటించారు.

నూతన అధ్యక్షుడి ఎంపిక ఎప్పుడు?

తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బర్ కేవలం 50 రోజులు కొనసాగనున్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు అకస్మాత్తుగా మరణిస్తే ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఆ పదవిని తాత్కాలికంగా చేపడతారు. ఈ నియామకానికి సుప్రీం లీడర్ ఖమేనీ ఆమోద ముద్ర వేస్తారు. ఆ తర్వాత ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్, పార్లమెంట్ స్పీకర్, న్యాయ విభాగాధిపతులతో ఒక మండలిని ఏర్పాటుచేస్తారు. ఇది గరిష్ఠంగా 50 రోజుల్లోపు కొత్త అధ్యక్షుడి కోసం ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది.

మతబోధకుల కుటుంబంలో మషహద్ నగరంలో 1960 డిసెంబర్ 14న రైసీ జన్మించారు. మోతాహరీ యూనివర్సిటీలో న్యాయవిద్యను చదివారు. 15 ఏళ్ల వయసులోనే 'ఖ్వామ్'లో మతవిద్యను నేర్చుకున్నారు. 1979లో ఇస్లామిక్ విప్లవకాలంలో పశ్చిమదేశాల మద్దతున్న ఇరాన్ పాలకుడు షాకు వ్యతిరేకంగా ఆయాతొల్లా రుహొల్లా ఖొమేనీ చేసిన ఉద్యమంలో రైసీ పాల్గొన్నారు. 21 ఏళ్లకే కరాజ్ నగర ప్రాసిక్యూటర్‌గా, పాతికేళ్లకే టెహ్రాన్ డెప్యూటీ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. అటార్నీ జనరల్ స్థాయికి ఎదిగారు. తదనంతరకాలంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేశారు. అయితే 1988 ఏడాది జులై–సెప్టెంబర్ కాలంలో ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెందిన వేలాదిమంది రాజకీయ ఖైదీలను దేశవ్యాప్తంగా సామూహికంగా ఉరితీసిన ఉదంతంలో రైసీ ముఖ్యపాత్ర పోషించారని అమెరికా, ఇతర దేశాలు ఆరోపించాయి. రైసీ 2017లో హసన్ రౌహానీతో అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2021లో మరోసారి అధ్యక్ష ఎన్నికలు పోటీచేశారు. ఆ ఎన్నికల్లో ముఖ్యమైన ప్రత్యర్థి నేతలందర్నీ అనర్హులు గా ప్రకటించడంతో రైసీ గెలుపు సులువైంది. ఛాందసవాద మత సంప్రదాయాల పేరిట భావ ప్రకటన స్వేచ్ఛ, మహిళా, మానవ హక్కులను కాలరాశారని ఆయనపై మాయని మచ్చ పడింది. ఈయన మార్గదర్శకత్వంలో అమల్లోకి వచ్చిన కఠిన హిజాబ్ చట్టాన్ని అమలుచేస్తూ నైతిక పోలీసులు 2022లో మహ్‌సా అమిని అనే మహిళను కొట్టిచంపడంతో దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబికాయి. 85 ఏళ్ల ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా అలీ ఖమేనీ భవిష్యత్ రాజకీయ వారసునిగా రైసీ పేరు చాన్నాళ్లుగా వినిపిస్తోంది. హసన్ రౌహానీ కాలంలో కుదిరిన అణుఒప్పందం నుంచి అమెరికా తప్పుకున్నాక అణ్వస్త్ర స్థాయి యురేనియం శుద్ధిని రైసీ మరింత పెంచి అంతర్జాతీయ ఆంక్షలకు గురయ్యారు. పాత, కొత్త ఆంక్షల కారణంగానే కొత్త హెలికాప్టర్లు కొనలేక పాత హెలికాప్టర్ల విడిభాగాలు దొరక్క, మరమ్మతులు చేయలేక చివరకు అదే హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. రైసీకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఖైదీల సామూహిక ఉరి ఉదంతంలో ప్రమేయం

మరోవైపు సంబరాలు!

అతివాద రైసీ మరణవార్త తెల్సి ఇరాన్‌లో ఓవైపు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు జరుగుతుంటే మరోవైపు 'టెహ్రాన్ నరహంతకుడు' అంతమయ్యాడని వేలాది మంది బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకుంటున్నారు. దేశ, విదేశాల్లో ఇరానీయన్లు వేడుకలు చేసుకుంటున్న వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. నెటిజన్లు పేల్చుతున్న మీమ్స్, జోక్స్‌కు కొదవే లేదు. 'హెలికాప్టర్ ప్రమాదంలో ఒకరు బతకడం కంటే చనిపోతేనే బాగుణ్ను అని లక్షలాది మంది కోరుకోవడం మానవ చరిత్రలో ఇదే తొలిసారి అనుకుంటా'' అని అమెరికాలో ఉన్న ఇరాన్ పాత్రికేయుడు మసీహ్ అలీనెజాద్ వ్యాఖ్యానించారు. వేలాది మంది రాజకీయ ఖైదీలను ఉరితీయించడం, కఠిన హిజాబ్ చట్టాలు, మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలు రైసీ మరణ సంబరాలకు కారణమని తెలుస్తోంది.

దక్షిణాన కాషాయ జెండా

అతి పెద్ద పార్టీగా బీజేపీ | తూర్పునా అవే ఫలితాలు | ప్రధాని మోదీ విశ్వాసం

- రెండుచోట్లా అభిమాన వెల్లువ
- దాంతో విపక్షాలకు నిద్ర కరువు
- 400 ప్లస్‌తో ఎన్డీఏ రికార్డు ఖాయం
- మైనారిటీలను నేనెన్నడూ వ్యతిరేకించలేదు
- అంబానీ, అదానీలతో కాంగ్రెస్‌కు డీల్
- అందుకే ప్రచారంలో వారి ఊసెత్తని రాహుల్

భువనేశ్వర్: దక్షిణ భారతదేశంలో ఈసారి కూడా బీజేపీయే అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వెలిబుచ్చారు. దేశమంతటా ఎన్డీఏకు స్థానాలు పెరుగుతాయని, ముఖ్యంగా దక్షిణ, తూర్పు భారతదేశంలో బీజేపీ బలం మరింతగా పెరగనుందని జోస్యం చెప్పారు. ''దళిత, ఓబీసీ, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యధిక సంఖ్యలో ఉన్న పార్టీ బీజేపీయే. కానీ 'బీజేపీ పట్టణ పార్టీ, కేవలం ఉత్తరాది పార్టీ, బ్రాహ్మణ–బనియా పార్టీ' అంటూ దుష్ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. దక్షిణాదిన మాకు బలం లేదన్నది కూడా విపక్షాలు వ్యాప్తి చేసిన అలాంటి అపోహే. దేశాన్ని సర్వనాశనం చేసేందుకు ఇలాంటి అపోహలను ప్రచారంలో పెట్టాయి. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏం జరిగింది? దక్షిణ భారతంలో బీజేపీయే అతి పెద్ద పార్టీగా అవతరించింది. అప్పటితో పోలిస్తే అక్కడి ప్రజల మనసును మరింతగా గెలుచుకున్నాం. ఆ లెక్కన దక్షిణాదిన ఈసారి మరిన్ని ఎక్కువ స్థానాలు గెలుస్తున్నాం. మా భాగస్వాములనూ కలుపుకుంటే అక్కడ ఎన్డీఏ స్థానాల సంఖ్య భారీగా పెరగనుంది'' అన్నారు. ఆదివారం పీటీఐ ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిన 131 లోక్‌సభ స్థానాల్లో 2019లో బీజేపీకి 29 సీట్లు రావడం తెలిసిందే. తూర్పు భారతదేశంలో దశాబ్దాల అభివృద్ధి లేమిని పక్కా ప్రణాళికతో పదేళ్లలో తుడిచిపెట్టామని మోదీ అన్నారు. ''మొత్తం తూర్పు భారతాన్నీ సాధికారపరిచాం. ఫలితంగా 'రెడ్ కారిడార్'గా పిలిచే ఆ ప్రాంతం 'కాషాయ కారిడార్'గా మారిపోయిందని ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేయనున్నాయి. పలు తూర్పు రాష్ట్రాల్లో కాంగ్రెస్, దాని సారథ్యంలోని ఇండియా కూటమి ఖాతా కూడా తెరవలేవు'' అని జోస్యం చెప్పారు. దాంతో భువనేశ్వర్, కోల్‌కతాతో పాటు ఢిల్లీలోనూ కొన్ని పార్టీలకు ఇప్పట్నుంచే కంటిపై కునుకు కరువైందని బిజూ జనతాదళ్, తృణమూల్, కాంగ్రెస్‌లను ఉద్దేశించి ఆయన ఎద్దేవా చేశారు. ''ప్రజల ఆశీస్సులతో మేమీసారి రికార్డు స్థాయి విజయం సాధించబోతున్నాం. జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల్లో ఎన్డీఏ కూటమి 400 పై చిలుకు స్థానాలు సాధించడం ఖాయం (4 జూన్, 400 పార్)'' అని చెప్పారు. ''ఉనికిపరంగానే గాక భావజాలపరంగా కూడా బీజేపీ మాత్రమే దేశంలో సిసలైన జాతీయ పార్టీ. ఎందుకంటే దేశమే ముందన్నది మా మూల సిద్ధాంతం'' అని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలో మోదీ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

కాంగ్రెస్‌కు లారీల్లో నల్లధనం!

'అదానీ–అంబానీ' అవినీతి అంటూ ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తలను కొన్నేళ్లుగా నిత్యం విమర్శిస్తూ వచ్చిన రాహుల్ బాబా ఎన్నికలు మొదలవగానే ప్లేటు ఫిరాయించారు. ఆయన ప్రచారంలో ఎక్కడా వారి ప్రస్తావనే లేదు! హఠాత్తుగా ఎందుకీ మార్పు? ఎందుకంటే అంబానీ, అదానీలతో లోపాయకారీ లింకులున్నది కాంగ్రెస్ పార్టీకే. తమకు లారీల నిండా డబ్బులు పంపితే వారికి వ్యతిరేకంగా మాట్లాడబోమన్న కాంగ్రెస్ అగ్ర నేత అధీర్ రంజన్ చౌధరి వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. అదానీ, అంబానీలతో కాంగ్రెస్‌కు డీల్ కుదరడం, రాహుల్ తమను విమర్శించకుండా ఉండేందుకు వారిద్దరూ లారీల నిండా నల్లధనం పంపడం నిజమో కాదో చెప్పాలి! ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలపై కాంగ్రెస్ నేతల ఆరోపణలూ పస లేనివే. అవి రెండూ స్వతంత్రంగా పని చేసే సంస్థలని స్వయానా అధీర్ చేసిన తాజా ప్రకటనే అందుకు నిదర్శనం.

'ప్రత్యేక పౌరుల' హోదాకు ఒప్పుకోను

మైనారిటీ సంతుష్టీకరణ కోసం కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న ఓటుబ్యాంకు రాజకీయాలనే నా ఎన్నికల ప్రసంగాల్లో బయట పెడుతున్నాను. అంతే తప్ప మైనారిటీలకు వ్యతిరేకంగా నేనెప్పుడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. బీజేపీ కూడా వారికెప్పుడూ వ్యతిరేకం కాదు. కాకపోతే 'ప్రత్యేక పౌరుల' హోదాను ఎప్పటికీ అంగీకరించబోను. ఎందుకంటే ప్రజలందరూ సమానమే. కేవలం ఎన్నికల రాజకీయాల కోసం రాజ్యాంగంలో పేర్కొన్న లౌకిక స్ఫూర్తికి నిత్యం గండి కొట్టే పార్టీ ఏదన్నా ఉందంటే అది కాంగ్రెసే. రిజర్వేషన్లకు మతం ప్రాతిపదిక కారాదని అంబేడ్కర్, నెహ్రూతో సహా రాజ్యాంగ నిర్మాతలంతా తీసుకున్న నిర్ణయానికి తూట్లు పొడుస్తోంది. కాంగ్రెస్ మేనిఫెస్టో నిండా ముస్లిం లీగ్ ఛాయలే! చివరికి టెండర్ల కేటాయింపు వంటివాటిలో కూడా మైనారిటీలకు రిజర్వేషన్లిస్తామని అందులో హామీలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉండగా పాకిస్తాన్‌తో సమర్థంగా వ్యవహరించకుండా జాతి ప్రయోజనాలనే పణంగా పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది. రాహుల్ వ్యాఖ్యలను పాక్ నేతలు ప్రశంసిస్తున్న పరిస్థితి! మన వీర సైనికులను పొట్టన పెట్టుకున్నది పాక్ ఉగ్రవాదులు కాదని కాంగ్రెస్ నేతలంటున్నారు. పాక్ వద్ద అణుబాంబులున్నాయి గనుక ఆ దేశాన్ని గౌరవించాలని చెబుతున్నారు. సర్జికల్ దాడులకు రుజువులేవని ప్రశ్నిస్తున్నారు. వీటన్నింటినీ ప్రజలకు వివరించడం, కాంగ్రెస్ కుట్రలను బయట పెట్టడం నా బాధ్యత. కాంగ్రెస్‌ది సంతుష్టీకరణ బాట. నాది అందరినీ సంతృప్తిపరిచే అభివృద్ధి బాట. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడానికి కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీల పేలవ ప్రచారం కూడా ఓ కారణం. వాటికి సొంత కార్యకర్తలు కూడా ఓటేయడం లేదు. ఇదంతా బీజేపీకే లాభం చేకూరుస్తుంది.

బీజేడీ పుట్టి మునుగుతోంది

ఒడిశా ప్రజలు మార్పు కావాలని నిర్ణయించుకున్నారు. నవీన్ పట్నాయక్ ప్రభుత్వంపై వారిలో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. అధికార బిజూ జనతాదళ్ మనుగడ ఇక కష్టమే. ఒడిశాలో బీజేపీ ఐదేళ్లుగా తీవ్రంగా కష్టపడి నంబర్ టూ నుంచి నంబర్‌వన్ స్థానానికి చేరింది.

యూసీసీ హామీ నెరవేరుస్తాం

ఉమ్మడి పౌర స్మృతి, 'ఒక దేశం, ఒకే ఎన్నిక' బీజేపీ మేనిఫెస్టో హామీలు. వాటిని నెరవేర్చి తీరతాం. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తాం. మళ్లీ అధికారంలోకి రాగానే ముందుగా మేమేం చేయాలో సూచించాల్సిందిగా దేశ యువతనే అడగదలచుకున్నా. అందుకోసం 'తొలి 100 రోజుల కార్యాచరణ'ను 125 రోజులకు పొడిగించాను. మాకు 400 సీట్లొస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న విపక్షాల విమర్శలు నిరాధారం. నేను స్వీయ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నానని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ నా శ్రేయస్సు కూడా రాజ్యాంగ శ్రేయస్సులోనే ఇమిడి ఉంది. ఈ రోజు ఈ స్థానంలో ఉన్నానంటే రాజ్యాంగం వల్లే. నేను స్ఫూర్తి, శక్తి పొందేదే రాజ్యాంగం నుంచి!

బ్రాండ్ మోదీ!

నేను కార్యసాధకున్ని. 'బ్రాండ్ మోదీ' అన్నది రెండు దశాబ్దాల పై చిలుకు ప్రజా జీవితంలో వారి నుంచి సంపాదించుకున్న విశ్వాస ఫలితం. అంతే తప్ప దాని కోసం నేను ఏ ప్రయత్నమూ చేయలేదు. నేనూ మనిషినే. తప్పిదాలు చేసుండొచ్చు. కానీ తప్పుడు ఉద్దేశాలు మాత్రం నాకెప్పుడూ ఉండవు. మండుటెండల్లో కూడా నా సభలకు ప్రజలు పోటెత్తుతున్నారు. వారి కళ్లలో నాపై కనిపించే తిరుగులేని విశ్వాసమే నాకు శక్తినిచ్చి నడిపిస్తోంది. 13 ఏళ్లు సీఎంగా, పదేళ్లు ప్రధానిగా చేసిన వ్యక్తి మాతృమూర్తి తన చివరి రోజుల్ని ప్రభుత్వాసుపత్రిలో గడిపిందంటే, అలాంటి దేశానికి మరే ఇతర బ్రాండూ అవసరం లేదని నా అభిప్రాయం. అతడు భిన్నమైన వ్యక్తి అని ఆ దేశం ఏనాడో అర్థం చేసుకుంది''.

రూ.250 కోట్ల అవినీతి కంటే 250 జతల బట్టలు మేలే!

తాను అత్యంత ఖరీదైన దుస్తులు ధరిస్తానంటూ రాహుల్ తదితరులు చేసే ఆరోపణలపై మోదీ ఆసక్తికరంగా స్పందించారు. ''నా రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న అతి పెద్ద ఆరోపణ దుస్తుల గురించే! నాకు 250 జతల బట్టలున్నాయని గతంలో గుజరాత్ మాజీ సీఎం అమర్‌సింగ్ చౌదరి ఆరోపణలు చేశారు. అప్పుడు నేను సీఎంగా ఉన్నా. అదే రోజు ఓ సభలో పాల్గొన్నా. 'రూ.250 కోట్లు దోచుకున్న సీఎం కావాలా, లేక 250 జతల బట్టలున్న ముఖ్యమంత్రా?' అని వేదిక నుంచి ప్రజలనడిగా. 250 జతల బట్టలున్నా పర్లేదు గానీ అవినీతిపరుడు వద్దని వారంతా ముక్త కంఠంతో చెప్పారు. దాంతో విపక్షాలు ఇంకెప్పుడూ నాపై అవినీతి ఆరోపణలకు ధైర్యం చేయలేదు'' అన్నారు. నిజానికి తనకెప్పుడూ అన్ని జతల బట్టల్లేవంటూ ముక్తాయించారు.



ఏడాదిన్నరలో నాలుగోసారి..

పార్లమెంట్ విశ్వాసం పొందిన ప్రచండ

కాఠ్మండు: నేపాల్ ప్రధానమంత్రి పుష్పకుమార్ దహల్ 'ప్రచండ'సోమవారం పార్లమెంట్‌లో విశ్వాస తీర్మానం నెగ్గారు. పార్లమెంట్‌లో ప్రచండ సారథ్యంలోని నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ(మావోయిస్ట్ సెంటర్) మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. సోమవారం పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో 275 మంది సభ్యులకు గాను హాజరైన 158 మందిలో ప్రచండ ప్రభుత్వానికి అనుకూలంగా 157 మంది ఓటేశారు. ప్రచండ సభ విశ్వాసం పొందినట్లు పార్లమెంట్ స్పీకర్ ప్రకటించారు. ప్రచండ 2022లో ప్రధాని పగ్గాలు చేపట్టాక గత 18 నెలల్లో పార్లమెంట్ విశ్వాసం పొందడం ఇది నాలుగోసారి.

మార్పు గాలి వీస్తోంది

రాహుల్ ధీమా



న్యూఢిల్లీ: దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోందని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్న విషయం స్పష్టంగా తెలుస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ స్థానాలకు సోమవారం ఐదో విడత పోలింగ్ ప్రారంభమైన వేళ 'ఎక్స్'లో ఆయన ..'ఈరోజు ఐదో విడత పోలింగ్ జరుగుతోంది. బీజేపీని ఓడించి, దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రజలు కట్టుబడి ఉన్నట్లు మొదటి నాలుగు విడతల పోలింగ్‌లో స్పష్టమైంది. విద్వేష రాజకీయాలతో జనం విసిగిపోయారు. యువత ఉద్యోగాలు, రైతులు రుణ మాఫీ, కనీస మద్దతు ధర, మహిళలు ఆర్థిక స్వేచ్ఛ, భద్రత, కార్మికులు రోజువారీ వేతనాలు వంటి అంశాలపైనే నేటి పోలింగ్ ఆధారపడి ఉంది. ఈ ఎన్నికల్లో ప్రజలు ఇండియా కూటమికి మద్దతుగా నిలిచారు. దేశంలో మార్పు గాలి బలంగా వీస్తోంది'అని రాహుల్ పేర్కొన్నారు. అమేథీ, రాయబరేలతోపాటు దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఇలా ఉండగా, ఐదో దశలో పోలింగ్ జరుగుతున్న రాయ్‌బరేలీలో పార్టీ అభ్యర్థిగా రాహుల్ గాంధీ సోమవారం పర్యటించారు. రాయ్‌బరేలీలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ప్రజలతో ఆయన సెల్ఫీలు దిగారు. అయితే, మీడియాతో మాట్లాడలేదు.

చత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం

వ్యాన్ లోయలో పడి 19 మంది మృతి

దుమ్ముగూడెం: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కబీర్‌ధామ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు గాయాలపాలయ్యారు. మృతుల్లో 18 మంది మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. కబీర్‌దామ్ జిల్లాలోని సెమ్హరా గ్రామానికి చెందిన గిరిజనులు తునికాకు సేకరణ కోసం సమీపంలోని అడవికి వెళ్లారు. తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ కుక్‌దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామ సమీపంలో బంజారి ఘాట్‌లో అదుపుతప్పి 20 అడుగుల లోతున్న లోయలో పడింది.

ఐదో విడతలో 59.06 శాతం

6 రాష్ట్రాలు, 2 యూటీల్లో 49 స్థానాల్లో ముగిసిన పోలింగ్

న్యూఢిల్లీ/కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల క్రతువులో మరో అంకం ముగిసింది. సోమవారం ఐదో విడతలో ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 49 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరిగింది. పశ్చిమబెంగాల్లో అక్కడక్కడలా స్వల్ప ఘర్షణలు, ఒడిశాలో కొన్నిచోట్ల ఈవీఎంలలో చిన్న సమస్యలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడపటి సమాచారం అందేసరికి 59.06 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్లో అత్యధికంగా 73.14, మహారాష్ట్రలో అత్యల్పంగా 54.22 శాతం పోలింగ్ జరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లాలో ఏకంగా 59 శాతం పోలింగ్ నమోదవడం విశేషం! ఇది ఆ లోక్‌సభ స్థానం చరిత్రలోనే అత్యధికం. గత నాలుగు విడతల్లో కలిపి 66.95 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారంతో జమ్మూ కశ్మీర్, మహారాష్ట్రల్లో అన్ని స్థానాల్లోనూ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మొత్తమ్మీద ఇప్పటిదాకా 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 428 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ముగిసింది. మిగతా 115 స్థానాలకు మే 25, జూన్ 1న ఆరు, ఏడో విడతల్లో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి.

బెంగాల్లో ఘర్షణలు

పశ్చిమబెంగాల్లో పలుచోట్ల అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఒడిశాలో గుర్తు తెలియని వ్యక్తులు ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకెళ్తున్న ఆటోను అడ్డుకుని డ్రైవర్‌ను నరికి చంపారు. యూపీలో 14 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ఎలాంటి ఘర్షణలూ లేకుండా ముగిసింది. ముంబై సౌత్ పరిధిలో ఒకా పోలింగ్ బూత్‌లో 56 ఏళ్ల ఎన్నికల అధికారి గుండెపోటుతో మరణించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, స్మృతీ ఇరానీ, కౌశల్ కిశోర్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, ప్రతాప్‌సింగ్‌వర్మ తదితరులు ఐదో విడతలో బరిలో ఉన్నారు.



ముంబై: ముకేశ్ అంబానీ దంపతులు, కుటుంబంతో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత



ముంబైలో సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యా రాయ్, లక్నోలో రాజ్‌నాథ్ సింగ్

ఆప్‌కు అక్రమంగా రూ. 7.08 కోట్ల విదేశీ నిధులు!

న్యూఢిల్లీ: విదేశీ విరాళాల నియంత్రణ చట్టానికి (ఎఫ్‌సీఆర్‌ఏ) విరుద్ధంగా ఆమ్ ఆద్మీ పార్టీ రూ. 7.08 కోట్లను విదేశాల నుంచి సేకరించిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేంద్ర హోం శాఖకు తెలిపింది. పంజాబ్ మాజీ ఆప్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరాపై డ్రగ్స్ సంబంధిత మనీలాండరింగ్ కేసులో సోదాలు చేపట్టినపుడు ఆప్ విదేశీ విరాళాలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు, ఈ–మెయిల్స్ లభించాయని ఈడీ పేర్కొంది. 2014– 2022 మధ్య ఆప్ రూ. 7.08 కోట్లను అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్‌ల నుంచి సేకరించిందని.. ఇది ఎఫ్‌సీఆర్‌ఏ, ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఇండియన్ పీనల్ కోడ్‌లను ఉల్లంఘించడమేనని తెలిపింది. ఆప్ ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, కుమార్ విశ్వాస్, అనికేత్ సక్సేనా, కపిల్ భరద్వాజ్ మధ్య జరిగిన ఈ–మెయిల్ సంప్రదింపుల్లో ఇందుకు సంబంధించిన ఆధారాలున్నట్లు పేర్కొంది. అమెరికా, కెనడాల్లో నిధుల సేకరణ కార్యక్రమాల్లో విరాళాలిచ్చిన వ్యక్తుల వివరాలను ఆప్ తమ ఖాతా పుస్తకాల్లో చూపలేదంది.

పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీ భక్తుడు

సంబిత్ పాత్ర వివాదాస్పద వ్యాఖ్యలు

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి ప్రధాని మోదీ భక్తుడు అంటూ పూరీ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర ఆదివారం ఎన్నికల ర్యాలీలో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. సర్వత్రా విమర్శలు రావడంతో, జగన్నాథునికి మోదీ పెద్ద భక్తుడనబోయి పొరపాటున వ్యతిరేకార్థంలో మాట్లాడానంటూ సంబిత్ పాత్ర వివరణ ఇచ్చారు.

నెతన్యాహు, హమాస్ నాయకుల అరెస్టుకు ఆదేశాలు కోరతా

ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ వెల్లడి

జెరూసలెం: అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, హమాస్ అగ్రనేతలపై అరెస్టు వారెంట్లు కోరనున్నట్లు చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ సోమవారం వెల్లడించారు. గాజా, ఇజ్రాయెల్‌లో యుద్ధ నేరాలు, మానవాళిపై అకృత్యాలకు గాను నెతన్యాహు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్, హమాస్ నేతలు యాహియా సిన్వర్, మహ్మద్ దీఫ్, ఇస్మాయిల్ హనియేహ్‌లు బాధ్యులని ఆయన అన్నారు. ముగ్గురు జడ్జిల ప్యానెల్ అరెస్టు వారెంట్లు, కేసు కొనసాగింపుపై నిర్ణయం తీసుకోనుంది. సాధారణంగా ఇలాంటి వాటిల్లో నిర్ణయానికి జడ్జిలు రెండు నెలల సమయం తీసుకుంటారు. వారెంట్లు జారీ అయినా నెతన్యాహు, గాలంట్‌లకు వచ్చే ఇబ్బందేమీ లేదు. కానీ నెతన్యాహు, గాలంట్‌లు విదేశీ పర్యటనలకు వెళ్లడం కష్టమవుతుంది. వారెంట్లు కోరడాన్ని యూదు వ్యతిరేక చర్యగా నెతన్యాహు అభివర్ణించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 21 : మే : 2024



సోమవారం కొప్పళ నగరంలో ఓ రంగుల గోదాములో అగ్ని ప్రమాదం జరిగిన దృశ్యాలు

న్యూస్‌రీల్

ప్రజ్వల్‌కు విరుద్ధంగా 30న చలో హాసన్


మాట్లాడుతున్న వరలక్ష్మి తదితరులు

మండ్య: ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాజకీయ అధికారాన్ని దుర్వినియోగం చేసుకుని మహిళలపై లైంగిక దాడులకు పాల్పడడాన్ని ఖండిస్తూ మే 30న చలో హాసన్ ఆందోళనను చేపడుతున్నట్లు సీఐటీయూ రాష్ట్రాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి తెలిపారు. సోమవారం మండ్యలో మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ పాస్‌పోర్టును రద్దు చేసి ప్రపంచంలో ఏ దేశలో ఉన్నా అంతర్జాతీయ పోలీసుల సాయంతో తక్షణమే బంధించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళల వీడియోలు, ఫోటోలను షేర్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ఎఫ్ఎస్ఎల్ నివేదికను త్వరగా విడుదల చేయాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాసన్‌కు చేరుకుని బాధిత మహిళలకు అండగా నిలబడాలని కోరారు.

బాలికను కిడ్నాప్ చేసి.. పెళ్లి

మైసూరు: ఒక యువకుడు 14 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెళ్లి చేసుకున్న ఘటన మైసూరులో జరిగింది. నిందితుడు, మైసూరుజిల్లా నంజనగూడు తాలూకా బదనవాలు గ్రామానికి చెందిన అర్జున్‌పై కేసు నమోదు అయింది. కనకగిరిలో ఉండే బాలిక తండ్రికి, నిందితునికి పరిచయం ఉండేది, అలా అతడు తరచూ వారి ఇంటికి వెళ్లేవాడు. బాలికతో మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లాడు. నంజనగూడు తాలూకా సుత్తూరులో బాలికకు తాళి కట్టాడు. మూడు రోజుల తర్వాత ఇంటికివచ్చిన బాలిక మెడలో తాళిబొట్టును చూసిన తల్లికి అనుమానం వచ్చింది, ఏమైందని ప్రశ్నించగా అర్జున్ నిర్వాకం గురించి చెప్పింది. దీంతో కిడ్నాప్, బాల్య వివాహం తదితర సెక్షన్లతో నిందితునిపై కేసు పెట్టారు.

పెన్‌డ్రైవ్ కేసులో దేవరాజేకు రిమాండు


దేవరాజేగౌడ (ఫైల్)

బనశంకరి: హాసన్ ఎంపీ ప్రజ్వల్ అశ్లీల వీడియోల పెన్‌డ్రైవ్‌ను విడుదల చేసిన కేసుతో పాటు మహిళపై దౌర్జన్యం కేసుల్లో అరెస్టయిన బీజేపీ నేత, న్యాయవాది దేవరాజేగౌడకు హాసన్ 5వ సివిల్‌కోర్టు రిమాండ్‌కు ఆదేశించింది. సోమవారంతో కస్టడీ ముగియడంతో జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించడంతో ఆయనను స్థానిక జైలుకు తరలించారు.

రేవణ్ణకు బెయిల్

మహిళపై లైంగికదాడి కేసులో మాజీమంత్రి హెచ్‌డీ.రేవణ్ణకు బెంగళూరులో 42వ ఏసీఎంఎం కోర్టు జడ్జి జే.ప్రీత్ బెయిల్ మంజూరుచేశారు. రూ.5 లక్షలు బాండ్, ఒకరు హామీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా, ఈ బెయిల్‌ను ప్రశ్నిస్తూ సిట్ హైకోర్టులో అప్పీల్ చేయనుంది. మహిళ కిడ్నాప్ కేసులో అరెస్టయిన రేవణ్ణ ఇప్పటికే బెయిలుపై బయటకు వచ్చారు.

మరో న్యాయవాది కేటాయింపు

దొడ్డబళ్లాపురం: ప్రజ్వల్ లైంగిక దాడుల కేసులో సీఐడీ తరపున వాదించడానికి మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ లాయర్ ప్రొ.రవివర్మ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు హోంశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ కేసుల కోసం గతంలోనే ప్రముఖ లాయర్లు అశోక్ నాయక్, జైనాకొఠారిలను ప్రభుత్వం కేటాయించింది.

సవతి తల్లి కాదు రాక్షసి

- చిన్నారిని కొట్టిచంపింది


భర్తతో నిందితురాలు , పాప (ఫైల్)

యశవంతపుర: తల్లి లేని పాపను అమ్మలా చూసుకోవాల్సిన సవతి తల్లి ఈర్ష అసూయతో రాక్షసిలా మారింది. మూడేళ్ల చిన్నారిని కొట్టి చంపిన ఘటన బెళగావి జిల్లా కంగ్రాళి గ్రామంలో జరిగింది. వివరాలు.. సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పని చేస్తున్న రాయణ్ణ మొదటి భార్య గతంలో చనిపోయింది. వీరికి ఒక పాప ఉంది. సప్నా అనే యువతిని రాయణ్ణ రెండో పెళ్లి చేసుకున్నాడు. అతడు వేరే రాష్ట్రంలో డ్యూటీలో ఉన్నాడు. ఇంటి వద్ద సప్నా పసిపాపను నిత్యం హింసించేది. ఇదే రీతిలో సోమవారం కూడా పాపను తీవ్రంగా కొట్టడంతో ప్రాణాలు విడిచింది. పాప వాంతులు చేసుకుంటూ చనిపోయిందని సప్నా నాటకం ఆడింది. ఆమె హత్య చేసిందని పాప అవ్వ, చిన్నాన్న కేసు పెట్టారు.

పెద్ద దంతాల గజేంద్రునికి మోక్షం


అతి పొడవైన దంతాలతో ఉన్న గజరాజు ఇదే


దంతాలను కత్తిరించే ప్రక్రియ

- దంతాలు కట్ చేసిన వైనం
- బండీపుర అడవిలో ఘటన

మైసూరు: అడవిలో ఓ గజరాజుకు దంతాలు అనూహ్యంగా పెరిగిపోయాయి. తొండాన్ని దాటుకుని కొన్ని అడుగుల మేర ముందుకొచ్చాయి. అంత పెద్ద దంతాల గల ఏనుగును చూడడం పర్యాటకులకు, స్థానిక ప్రజలకు అద్భుతంగానే ఉన్నా ఆ ఏనుగు మాత్రం ఇబ్బందులు పడుతోంది. తొండం దంతాల మధ్య సాఫీగా కదలలేక కడుపు కాల్చుకుంటోంది. ఈ నేపథ్యంలో అటవీ అధికారులు ఏనుగు సమస్యను తీర్చారు. దాని దంతాలను కట్ చేశారు.

రైతుల ఫిర్యాదుతో..

వివరాలు.. చామరాజనగర జిల్లా బండీపుర అడవిలో ఒక ఏనుగుకు అడ్డదిడ్డంగా దంతాలు పెరిగాయి. దీంతో తొండం ఆ రెండు దంతాల మధ్య ఇరుక్కుపోయి అది సక్రమంగా ఆహారం తీసుకోలేకపోతోంది. పైకి తొండం పైకి ఎత్తలేక, నోరు సరిగ్గా తెరవలేక కష్టపడుతోంది. అది నిత్యం రైతుల పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తూ, ఆహారం తినేందుకు కష్టపడుతోందని గ్రామస్తులు అటవీ అధికారులకు తెలిపారు. దీని వల్ల అది బరువు కూడా తక్కువగానే ఉంది.

మత్తు మందు ఇచ్చి

అధికారులు కొన్ని రోజులుగా ఈ సమస్యపై విశ్లేషణ చేసి అడ్డంగా పెరిగిన దంతాలను కత్తిరించాలని నిర్ణయించారు. అడవుల్లోని పెద్ద చెట్లు, కొమ్మలను తినేందుకు తొండం పైకి రాకపోవడం వల్ల అడవిని వదిలేసి పొలాల్లో పంటల మీదకు పడుతోందని తెలుసుకున్నారు. ఈ క్రమంలో భారీ క్రేన్ వాహనాన్ని రప్పించి ఏనుగును బంధించారు. దానికి మత్తు మందు ఇచ్చి యంత్రపు రంపంతో దంతాలను కొంతమేర కత్తిరించారు. కబిని బ్యాక్ వాటర్‌లో గుంద్రే అటవీ జోన్ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఇప్పుడు అది మామూలు ఏనుగుల మాదిరిగా ఆహారం తీసుకోగలదని అధికారులు చెప్పారు.


దంతాలను కత్తిరించాక ఇలా ఉంది

ఓమ్ని- బైక్ ఢీ, కాంగ్రెస్ నేత మృతి

మైసూరు: ఓమ్ని కారు ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మరణించిన ఘటన జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకా మైసూరు-మానంద వాడి ప్రధాన రహదారి కరిగళ సమీపంలో జరిగింది. కరిగళకు చెందిన కాంగ్రెస్ నేత వెంకటేశ్ (40) మృతుడు. ఇతడు పొరుగూరు హోమ్మరగల్లి నుంచి ఇంటికి బైక్‌లో వెళుతుండగా కోటె నుంచి మైసూరుకు వైపు వెళుతున్న ఓమ్ని కారు ఢీ కొట్టింది. వెంకటేశ్ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. ఓమ్ని కారును వదిలేసి అందులోని వ్యక్తులందరూ పారిపోయారు., హెచ్‌డీ కోటె పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

మహిళకు వడ్డీ వ్యాపారి వేధింపులు

మైసూరు: మహిళ అప్పు తీర్చలేదని ఓ కీచకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మైసూరులోని మేటగల్లి పరిధిలో ఈ అకృత్యం చోటుచేసుకుంది. వివరాలు.. ప్రసన్న అనే వడ్డీ వ్యాపారి నుంచి నాగనహళ్లికి చెందిన మహిళ రూ. 7 వేలను మీటర్ వడ్డీకి అప్పు తీసుకుంది. భర్తకు వైద్యం చేయించడానికి ఆ డబ్బును వాడుకుంది. అప్పుపై 20 శాతం వడ్డీ కడుతోంది. అసలును ఆరు నెలల తర్వాత చెల్లిస్తామని చెప్పింది. ఇందుకు అంగీకరించని ప్రసన్న ఇప్పుడే అప్పు తీర్చాలని పట్టుబట్టాడు. ఇంటి వద్దకు వచ్చి గొడవ చేశాడు. అసభ్య పదజాలంతో నిందిస్తూ డబ్బులు ఇవ్వకపోతే నా ముందు బట్టలు విప్పి నడవాలి అని అమానుషంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, వడ్డీ వ్యాపారుల వేధింపులు పెరిగిపోతున్నాయని, పరువు పోతుందని చాలామంది బయటకు చెప్పడం లేదని స్థానికులు తెలిపారు.

సముద్రంలో పడవ పల్టీ



సముద్రంలో పడవ మునిగిపోతున్న చిత్రాలు

- 40 మంది పర్యాటకులు క్షేమం
- కార్వార జిల్లాలో ప్రమాదం

యశవంతపుర: సామర్థ్యం కంటే ఎక్కువ మంది పర్యాటకులను ఎక్కించుకొని వెళుతున్న బోటు అరేబియా సముద్రంలో మునిగిపోయింది. అదృష్టవశాత్తు అందులోని 40 మంది పర్యటకులను కరావళి కావలు దళం పోలీసులు, స్థానికులు రక్షించారు. కార్వార జిల్లా కుమటా తాలూకా తదడి గ్రామం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆదివారం మూడంగికి చెందిన గణేశ్, రమేశ్‌లకు చెందిన బోటులో 40 మంది పర్యాటకులను సముద్రంలో విహారానికి తీసుకెళ్లారు. కొంతదూరం వెళ్లగానే పడవ బోల్తా పడి అందరూ సముద్రంలోకి పడిపోయి హాహాకారాలు చేయసాగారు. సముద్ర రక్షణ దళం పోలీసులు, గ్రామస్తులు తక్షణం స్పందించటంతో పెద్ద ప్రమాదం తప్పింది. బోటు యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పడవ మునిగిన వీడియోలు వైరల్ అయ్యాయి.

చెరువులో మునిగి ఇద్దరు మృతి

మరోవైపు ఉడుపి జిల్లా కార్కళ తాలూకా ఉబ్బరబైలు గ్రామంలో చెరువులో చేపలు పట్టేందుకు హరీష్ పూజారి (48), సతీష్ పూజారి (18) అనే ఇద్దరు దిగారు. అయితే లోతైన చోట నీట మునిగి మృత్యువాత పడ్డారు. గ్రామస్తులు, పోలీసులు మృతదేహాలను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

ఒక్క ఏడాది సంతృప్తిగా ఉంది

- గ్యారంటీలను ఆపం, అప్పులు సహజమే
- మీట్ ది ప్రెస్‌లో సీఎం సిద్ధరామయ్య


మాట్లాడుతున్న సీఎం సిద్దు

శివాజీనగర: ముఖ్యమంత్రిగా ఒక సంవత్సరం పదవీకాలం తృప్తినిచ్చిందని, కాంగ్రెస్ పార్టీ కూడా సంతోషంగా ఉందని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. ఆయన ప్రభుత్వానికి సోమవారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్‌లో పాల్గొని మాట్లాడారు. రెండవ సంవత్సరంలోకి ఉల్లాసంతో ప్రవేశిస్తున్నాం, ఐదు గ్యారంటీల ద్వారా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. గ్యారంటీలను నిలిపివేసే ప్రసక్తి లేదన్నారు.

పెన్‌డ్రైవ్ కేసులో కుట్ర లేదు

పెన్‌డ్రైవ్ గురించి తాను అధికంగా మాట్లాడను. ప్రజ్వల్ రేవణ్ణపై దేవరాజేగౌడ బీజేపీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేశాడు, ఏప్రిల్ 26 ఎన్నికల తరువాత దేశం విడిచిపెట్టినవారు ఎవరు అని సీఎం విమర్శించారు. పెన్‌డ్రైవ్ అనేది కుట్ర అయితే ప్రజ్వల్‌ను ఎందుకు జేడీఎస్ నుండి సస్పెండ్ చేశారు? ఆరు నెలలు ముందుగానే తెలిసినా కూడా ఆయనకు టికెట్ ఎందుకు ఇచ్చారు? ఆయనకు అనుకూలంగా ఎందుకు ప్రసంగాలు చేశారు? అని మండిపడ్డారు. డీకే శివకుమార్ ఆడియో గురించి తనిఖీ జరుగుతోందన్నారు.

15 ఎంపీ సీట్లు గెలుస్తాం

లోక్‌సభ ఎన్నికల్లో 28 స్థానాల్లో కనీసం 15 సీట్లు లేదా 20 సీట్లు గెలుస్తామని సీఎం అన్నారు. ఎన్నికల తరువాత మంత్రి మండలిని విస్తరించే ఉద్దేశం లేదని, హైకమాండ్ చెప్పినట్లుగా చేస్తామని తెలిపారు. కాగా, సర్కారు అప్పులు చేయడం నిజమేన్నారు. నిబంధనలకు లోబడి రుణాలు తీసుకొచ్చినట్లు చెప్పారు. సర్కారు దివాలా అనేది ప్రతిపక్షా తప్పుడు ఆరోపణ అన్నారు. కుల గణన నివేదికపై మంత్రి మండలిలో చర్చించి తీర్మానం చేస్తామన్నారు.

ఏడాదిలో సున్నా సాధన

- బీజేపీ నేతల ధ్వజం



శివాజీనగర: రాష్ట్రంలో సిద్దరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యింది, అయితే సాధించింది మాత్రం శూన్యమని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఆయన, సంవత్సరంలో చేసింది శూన్యం, ఖజానా ఖాళీ, వసూళ్ల అధికం. గ్యారంటీ పథకాల కోసం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేయటంతో నిరుద్యోగ సమస్య పెరిగిపోయింది. విద్యారంగం తప్పుదారి పట్టింది. మహిళలకు భద్రత లేకుండా పోయింది. దళితుల సంక్షేమ కార్యాలు పూర్తిగా తగ్గిపోయాయి. వెనుకబడినవారి అభివృద్ధి వెనుకబడింది. రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆరోపించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలోనూ విజయేంద్ర, బీజేపీ పక్ష నేత అశోక్‌లు విలేకరులతో మాట్లాడుతూ ఇవే ఆరోపణలు చేశారు. ఒక్క ఏడాదిలో సున్నా సాధన అనే పోస్టర్లను విడుదల చేశారు. ఇప్పటినుంచి ఏడాది పాలనపై రాష్ట్రమంతటా ధర్నాలు చేయాలని బీజేపీ, జేడీఎస్‌లు నిర్ణయించారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి

బనశంకరి: చామరాజనగర జిల్లా హనూరులో తేనెటీగలు దాడిచేసిన ఘటనలో భర్త మృతిచెందగా భార్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బెళతూరు గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం బెళతూరు గ్రామానికి చెందిన రైతు తుళసిదాస్ (45), ఆశా దంపతులు అరటితోటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తుండగా తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా కుట్టాయి. ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు హనూరు ఆసుపత్రికి తరలించారు. తుళసీదాస్ మృతిచెందగా, ఆశా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు


రాజసౌధాల నగరం మైసూరులో వర్షం

బనశంకరి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండురోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం బెంగళూరు శివార్లు, దేవనహళ్లిలో పెద్ద వర్షం కురిసింది. కరావళి, మలెనాడు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా మరో మూడురోజుల పాటు ఈ ప్రాంతాల్లో కుండపోత వానలు పడే ఆస్కారముంది. దక్షిణ ఒళనాడులోనూ ఇదే తరహాలో ఒక వారం పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. దక్షిణ ఒళనాడులోని అన్ని జిల్లాల్లో వర్షాలు కురవగా కొన్ని చోట్ల భారీ వర్షాలు, మరికొన్నిచోట్ల సాధారణ వానలు పడ్డాయి. కరావళి, మలెనాడు ప్రాంతాల్లో వర్షం అధికంగా ఉంది. వర్షాలు కురుస్తుండగా రైతులు పొలం పనులకు నాంది పలికారు. దుక్కి దున్ని విత్తనాలు వేయడానికి సిద్ధం చేస్తున్నారు.


సిలికాన్ సిటీలో యశవంతపురలో దట్టమైన మేఘాలతో ఆకాశం


బెంగళూరు శివార్లలో దేవనహళ్లిలో బైక్‌లు మునిగేలా వచ్చిన వాన

క్లుప్తంగా

వర్షం నీటిలో హంపీ స్మారకాల ప్రతిబింబం


వర్షం నీటిలో హంపీ స్మారకాల బింబం

హొసపేటె: దక్షిణ కాశీ హంపీలో కురిసిన వర్షానికి స్మారక ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా స్మారకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షపు నీటిలో స్మారక చిహ్నాలు ప్రతిబింబించడం చూపరులను ఆకట్టుకుంది. వర్షం నీటిలో స్మారక చిహ్నాల ప్రతిబింబాన్ని స్థానికులు మొబైల్‌లో బంధించారు.

అనాథాశ్రమంలో అన్నదానం


అనాథలకు భోజనం పెడుతున్న దృశ్యం

హొసపేటె: అఖిల భారత భవాని దీక్ష చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జాతీయ అధ్యక్షులు శ్రీలంక గణేష్ గురు భవాని పుట్టిన రోజు సందర్భంగా సోమవారం నెహ్రూ కాలనీలోని శ్రీరామ ఆనంద నందన పిల్లల అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ముందుగా బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈవీ క్యాంప్ మహా భవాని దీక్షా పీఠం సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తంగెళ్ల నానాజీ, గురు భవాని కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి మహేష్ గురుభవాని, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు నల్లరాజ్ గురుభవాని, కర్ణాటక స్టేట్ సభ్యులు శ్రీను గురుభవాని, సీనియర్ భవాని దొర, ఎరిపిల్లి బాబ్జి, ఎరిపిల్లి రాజశేఖర్, మైలపల్లి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పరిహారం ఇవ్వరూ


వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులకు పరిహారం అందించాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. రైతులకు 2023–24వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందన్నారు. రైతులకు మూడు ఎకరాలకు రూ.3 వేల నుంచి రూ.9 వేల వరకు ఇచ్చారని, రైతులకు ఫసల్ బీమా పథకం కింద పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

అధిక ఫీజుల వసూలు తగదు


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో 2024–25వ విద్యా సంవత్సరంలో అధికంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేయడం తగదని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. సోమవారం రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అమరేష్ మాట్లాడారు. మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. అధిక ఫీజులు వసూలు చేయరాదంటూ అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రితీక్ కుమార్, కమిషనర్ కావేరిలకు వినతి పత్రం సమర్పించారు.

పేదల బియ్యంలో గోల్‌మాల్


మాట్లాడుతున్న శివకుమార్ యాదవ్

రాయచూరు రూరల్: అన్న భాగ్య పథకం కింద పేదలకు పంచే బియ్యంలో రూ.కోట్లలో గోల్‌మాల్ జరిగిందని జయ కర్ణాటక జిల్లాధ్యక్షుడు శివకుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 10 వేల క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నల్ల బజారుకు తరలించిన అంశంపై జిల్లా ఆహార పౌర సరఫరాల శాఖాధికారులకు, లోకాయుక్తకు ఫిర్యాదు చేశామన్నారు. ఆహార పౌర సరఫరాల శాఖాధికారులు యంకన్న, ఆనంద్, బసవరాజ్, హన్మంతు, బసవంత్ సింగ్, అబ్బాస్ అలీ కలిసి నిధులు స్వాహా చేసినా వారిపై చర్యలు శూన్యమన్నారు. ఈసందర్భంగా మారెప్ప, నరేష్‌లున్నారు.

చాపకింద నీరులా ఐపీఎల్ బెట్టింగ్

- పోలీసు వలలోకి చిన్న చేపలు
- అజ్ఞాతంలోకి తిమింగలాలు

కోలారు: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ దందా నగరంలో చాపకింద నీరులా సాగుతోంది. పోలీసులు ఇంతవరకు అరెస్టు చేసిన వారు చిన్న చిన్న చేపలు కాగా బెట్టింగ్ దందాలో ఉన్న ఇంకా పెద్ద పెద్ద తిమింగలాలు అజ్ఞాతంలో ఉండి వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఇంతవరకు నాలుగు బెట్టింగ్ కేసులను ఛేదించి కేవలం చిన్న మొత్తంలో డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా పలువురు పంటర్‌లు ముంబై, గోవాల్లో కూర్చుని అక్కడి నుంచే వ్యవహారాలు నడిపిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ క్రికెట్ టోర్నీ అంతమ దశకు చేరుకుంది. ఐపీఎల్‌పై దేశ విదేశాలలో భారీ ఎత్తున బెట్టింగ్ జరుగుతోంది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సీఎస్‌కే, ఆర్‌సీబీ జట్ల మధ్య జరిగిన పోటీపై భారీ ఎత్తున బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తోంది. కోలారు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూడా బెట్టింగ్ సాగుతుండగా పలు కేసులను పోలీసులు ఛేదించారు.





బెట్టింగ్‌లోకి ఆస్తులు, బంగారం

జూదర్లు డబ్బులతో పాటు బంగారం, ఆస్తులను బెట్టింగ్‌లో పెట్టడానికి వెనుకంజ వేయడం లేదు. కోలారు జిల్లాలో జరుగుతున్న ఐపీఎల్ బెట్టింగ్ దందాను అరికట్టడానికి జిల్లా ఎస్పీ ఎం నారాయణ ప్రత్యేక బృందాన్ని రచించారు. వారం రోజుల క్రితం గల్‌పేట పోలీసులు బెట్టింగ్‌లో పాల్గొన్న నలుగురిని అరెస్టు చేశారు. శనివారం మరో బెట్టింగ్ అడ్డాపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. శ్రీనివాసపురంలో బెట్టింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. కోలారు నుంచి దుబై వరకు క్రికెట్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతుందని అంటున్నారు. గతంలో బెట్టింగ్ పంటర్‌లు కోలారులోనే ఉండి వ్యవహారం నడిపే వారు. గత రెండేళ్లుగా పోలీసు యంత్రాంగం తీసుకున్న కట్టుదిట్టమైన చర్యల కారణంగా వీరు దూర ప్రాంతాల్లో కూర్చుని బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అక్కడి నుంచే ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభం కాగానే బెట్టింగ్ యాప్ లింక్ పంపించడం, ఆన్‌లైన్ బెట్టింగ్ ఐడీలు పంచుకునే ప్రయత్నం చేస్తారు. ఆన్‌లైన్‌లోనే డబ్బు వ్యవహారం జరుగుతుంది.

బెట్టింగ్‌పై నిఘా పటిష్టం

బెట్టింగ్ అడ్డుకట్టకు ప్రత్యేక బృందాన్ని రచించాం. క్రికెట్ బెట్టింగ్ యాప్‌లపై, పోలీసులపై కూడా నిఘా పెట్టాం. క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలిస్తే, పోలీసులు పాల్గొంటున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసులు బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న వారితో చేతులు కలిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎం నారాయణ, ఎస్పీ, కోలారు

అంజలి నివాసానికి కేంద్ర మంత్రి

- కుటుంబ సభ్యులకు పరామర్శ

హుబ్లీ: కళాశాల క్యాంపస్‌లో జరిగిన నేహ హిరేమఠ హత్య కేసును రాష్ట్ర సర్కారు తీవ్రంగా పరిగణించలేదని, దిగజారుడు వ్యాఖ్యల ఫలితంగా హుబ్లీలో మరో యువతి హత్య జరిగిందని, అందువల్ల ఈ రెండు కేసులను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ రెండు కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలన్నారు. డ్రగ్స్ మాఫియా జరిగే స్థలాల్లో ఔట్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ మాఫియా సమాచారం ఇచ్చిన వారి పేర్లను రహస్యంగా ఉంచి మాఫియా కఠిన చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. అంజలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన సమయంలో తగిన విధంగా స్పందించలేదని పోలీస్ అధికారులను సస్పెండ్ చేయడం ద్వారా కంటితుడుపు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. కమిషనరేట్‌ను ఎస్పీ స్థాయికి దిగజార్చడం ఉద్దేశం ఏమిటని ఆయన నిలదీశారు. అంజలి కుటుంబ సభ్యులకు కనీసం రూ.25 లక్షల పరిహారం చెల్లించి ఇంటి వసతితో పాటు తగిన రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగతంగా అంజలి కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట ఎమ్మెల్యే అరవింద బెల్లద, ఎమ్మెల్సీ ప్రదీప్ శెట్టర్‌తో పాటు నేహ తండ్రి, ఆ ప్రాంత కార్పొరేటర్ నిరంజనయ్య హిరేమఠ తదితరులు పాల్గొన్నారు.

బీడీఏ కాంప్లెక్స్‌లను మాల్స్‌గా మార్చడం తగదు

బనశంకరి: కోరమంగళలోని ఏడు బీడీఏ కాంప్లెక్స్‌లను షాపింగ్ మాల్స్‌గా మార్చాలనే నిర్ణయాన్ని ఆమ్ ఆద్మీపార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆపార్టీ బెంగళూరు మహిళా శాఖ అధ్యక్షురాలు వీణాసెరావు నేతృత్వంలో నాయకులు సోమవారం కోరమంగల బీడీఏ కాంప్లెక్స్‌ను సందర్శించారు. అనంతరం వీణాసెరావు మాట్లాడుతూ ఒక ప్రదేశానికి ఒకమాల్ చాలునని, విజయవంతంగా నడుస్తున్న బీడీఏ కాంప్లెక్స్‌ను తొలగించడం సరైందికాదన్నారు. ఇప్పటికే చాలా ట్రాఫిక్ సమస్యతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతానికి సరైన పైవంతెన, మెట్రో లేదని, దీంతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణచేయడం సరికాదన్నారు. చెట్లను తొలగించడంతో నేడు నగరం కాంక్రీట్ మయంగా మారిందని తెలిపారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ


ప్రసాదానికి పూజ చేస్తున్న జంగమ స్వాములు

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవసూగూరులోని సూగూరేశ్వర ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులకు పెరుగన్నం ప్రసాదంగా పంపిణీ చేశారు. ఉదయం సూగూరేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. దేవస్థాన భక్తులు మల్లప్ప, శశికళున్నారు.

వైభవంగా ఆదిశక్తి దేవి ప్రాణప్రతిష్ట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీనివాసపురం: తాలూకాలోని తిన్నలి గ్రామంలో శని, ఆదివారాల్లో ఆదిశక్తి దేవి ప్రాణ ప్రతిష్ఠాపనను వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయంలో నెరవేర్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి


లారీ ఢీకొన్న బైక్ ఇదే


మృతి చెందిన మేఘన


గాయపడిన కైలాష్

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా శివపుర సమీపంలో సోమవారం జాతీయ రహదారి–50పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. బైక్‌ను లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న యువతి మేఘన(18) మృతి చెందగా, యువకుడు కైలాష్‌కు తీవ్రగాయాలు కావడంతో తదుపరి చికిత్స నిమిత్తం బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ మల్లేశప్ప, సీఐ వినాయక్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. బైక్‌పై కైలాష్, మేఘన హొసపేటె నుంచి కూడ్లిగి వైపునకు వెళుతుండగా కూడ్లిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.

పంట నష్టపరిహారం అందించరూ

హొసపేటె: ఇటీవల కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు చేతికి వచ్చిన అరటి పంట దెబ్బ తినడంతో రైతులు తీవ్ర నష్ట పోయారని వెంటనే పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతులు తహసీల్దార్ శృతికి వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం నేత కాళిదాస్ మాట్లాడుతూ వర్షానికి తాలూకా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో అరటి పంటకు భారీగా నష్టం ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు పంట నష్ట పరిహారం కింద ఆర్థిక సహాయాన్ని అందచేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో ప్రజలకు కష్టాలు

- గంటల తరబడి కార్యాలయాల వద్ద వడిగాపులు

కేజీఎఫ్: గతేడాది ఏప్రిల్ నెల నుంచి నూతనంగా అమలులోకి వచ్చిన కావేరి 2.0 సాఫ్ట్‌వేర్ రిజిస్టరు విభాగంలో ఒక విప్లవాత్మక మార్పు అయినా గత కొద్ది రోజుల నుంచి అప్‌గ్రేడ్, వివిధ మార్పుల కారణంగా నిరంతరంగా సర్వర్ డౌన్ సమస్య ఎదురవుతోంది. దీంతో భూములు, స్థలాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి కార్యాలయం ముందు వడిగాపులు కాయాల్సి వస్తోంది. కావేరి 2.0 సాఫ్ట్‌వేర్‌లో ఎలాంటి సర్వర్ సమస్య ఉండదని తెలిపినా తరచుగా సర్వర్ సమస్య తలెత్తుతుండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ఆస్తి, స్థిరాస్తి, బాండ్లు తదితరాల కోసం వస్తున్న ప్రజలు జాతక పక్షుల్లా ఎదురు చూడాల్సి వస్తోంది. పలు సమయాల్లో సర్వర్ రాక ఒట్టి చేతులతో వెనుదిరుగుతున్నారు. కాగా కావేరి 2.0 సాఫ్ట్‌వేర్‌లో రోజుకో మార్పులు చేస్తుండడమే దీనికి కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని దాఖలాలను కావేరి 2.0 సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసిన తరువాత రిజిష్టరు కోసం కార్యాలయానికి వస్తే సర్వర్ లేదంటూ వెనుదిరగాల్సి వస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న దృశ్యం

సమస్య పరిష్కరిస్తాం

రిజిష్టరు, స్టాంపుల శాఖకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సర్వర్ పని చేస్తోన్నా ఎలాంటి సమస్య లేదు. కేజీఎఫ్‌లో సర్వర్ సమస్య తలెత్తిన విషయం తన దృష్టికి రాలేదు. సబ్ రిజిస్ట్రారుతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

–శ్రీనిధి, జిల్లా రిజిస్ట్రారు

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం

- రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నాయకులు గరం


ఆందోళన చేస్తున్న బీజేపీ రైతు మోర్చా నాయకులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిందని సంబరపడుతోందని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా రాష్ట్రాన్ని, జిల్లాను ముఖ్యంగా రైతులకు చేసింది ఏమీ లేదని జిల్లా రైతు మోర్చా బీజేపీ అధ్యక్షుడు గణపాల ఐనాథరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం జిల్లా బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలు, ఏడాదిలో ప్రజలకు చేసిందేమీ లేదని, రైతులను నిండా కాంగ్రెస్ ముంచుతోందని ఆందోళన చేపట్టారు. నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా రైతులకు ఎలాంటి మేలు చేయలేదు సరికదా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులను మోసం చేస్తోందన్నారు. సంవత్సరానికి రైతులకు రెండు దఫాలుగా అందాల్సిన రూ.4వేలు ఇవ్వడం లేదని, వ్యవసాయ పంట నష్టపరిహారం సక్రమంగా అందడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు అందజేసిన పథకాలను కొనసాగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కరువుతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవడం లేదన్నారు. రైతు మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురులింగనగౌడ, మాజీ మేయర్ ఇబ్రహీంబాబు, బీజేపీ ప్రముఖులు దరప్ప నాయక్, శివరుద్రగౌడ, సిద్దప్ప, సుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలు అరికట్టాలి


వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో అధికమవుతున్న నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. జిల్లాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పత్తి, పొద్దుతిరుగుడు, సజ్జలు, కంది వంగడాల నకిలీ విత్తనాలను విక్రయించడానికి వచ్చేవారి వద్ద లైసెన్సులు ఉండవన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా రైతులకు ప్రచారం చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. 2024–25వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ జేడీ దేవికాకు వినతిపత్రం సమర్పించారు.

ఆరుమాకులపల్లిలో కర్ణాటక పోలీసుల తనిఖీలు

- 30 ద్విచక్ర వాహనాల స్వాధీనం

హిందూపురం అర్బన్: చిలమత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరుమాకులపల్లిలో సోమవారం సాయంత్రం కర్ణాటక పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతంలో చోరీలకు పాల్పడుతున్న ముఠా ఇచ్చిన సమాచారం మేరకు చిక్కబళ్లాపురం డీఎస్పీ, సిబ్బంది ఆరుమాకులపల్లి చేరుకున్నారు. నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో దాచిన 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను ప్రత్యేకంగా క్యాంటర్‌లో చిక్కబళ్లాపురానికి తరలించారు. కర్ణాటక ప్రాంతంలో చోరీ చేసిన వాహనాలను తీసుకొచ్చి నాగభూషణం వద్ద డంప్ చేసి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారుగా గుర్తించారు. అలాగే చిలమత్తూరు మండలంలోని మరో రెండు గ్రామాల్లో 40 వాహనాలు రికవరీ కావాల్సి ఉందని కర్ణాటక పోలీసులు తెలిపారు.

జేడీఎస్ ధర్నా

శివాజీనగర: మాజీ ప్రధాని హెచ్.డీ.దేవేగౌడపై విమర్శలు చేశారనే ఆరోపణలపై ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్, ఎల్.ఆర్.శివరామేగౌడకు వ్యతిరేకంగా జేడీఎస్ కార్యకర్తలు సోమవారం నగరంలోని ఫ్రీడం పార్కులో ధర్నా నిర్వహించారు. బెంగళూరు మహానగర జనతాదళ (ఎస్)అధ్యక్షుడు రమేశ్‌గౌడ నేతృత్వంలో నాయకులు ర్యాలీగా ఫ్రీడం పార్కుకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఎల్.ఆర్. శివరామేగౌడ మాట్లాడేటపుడు సభ్యతను మరవటం కొత్తేమికాదని ఆరోపించారు. పెన్‌డ్రైవ్ లీకేజ్ చేసినవారిపై తనిఖీ జరగటం లేదని, ఇందులో ఎవరి పాత్ర ఉందనేది కనిపెట్టి చట్టపరిధిలో చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. పారదర్శకంగా తనిఖీ జరగాలని డిమాండ్ చేశారు.

ద్వితీయ పీయూసీ అడ్వాన్స్ ఫలితాల తర్వాత సీఈటీ ఫలితాలు

శివాజీనగర: ద్వితీయ పీయూసీ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు ప్రకటించిన తరువాతనే సామాన్య ప్రవేశ పరీక్ష (సీఈటీ–24) ఫలితాలు విడుదల అవుతాయని కర్ణాటక పరీక్షా ప్రాధికార కార్యనిర్వాహక డైరెక్టర్ హెచ్.ప్రసన్న స్పష్టం చేశారు. సోమవారం రోజున సీఈటీ ఫలితాలు విడుదల చేస్తారని ఉదయం నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో ఆయన పై విధంగా స్పష్టత ఇచ్చారు. ద్వితీయ పీయూసీ సైన్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పొందిన 50 శాతం మార్కులను చేర్చి సీఈటీ ర్యాంక్ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఇది ముందునుంచి పాటిస్తున్న విధానమన్నారు. ఈ ఏడాది ద్వితీయ పీయూసీకి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిందని, రెండు పరీక్షల్లో దేనిలో అధిక మార్కులు వస్తే వాటని సీఇటీ ర్యాంక్‌కు పరిగణించాల్సి ఉంటుందన్నారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల కోసం కేఇఏ వేచి ఉండటం అనివార్యమైనదని వివరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

హుబ్లీ: నగరంలోని పాత హుబ్లీ సోపకొది మఠం వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు... అతని వద్ద నుంచి రూ.42,500 విలువ చేసే 180 గ్రాముల గంజాయి, రూ.200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ధార్వాడ తాలూకా అమ్మినబావి నివాసి జావీద్ హాలధార్‌గా గుర్తించారు. ఆటో నడుపుతున్న ఇతను గంజాయి విక్రయించేవాడు. మరో ఘటనలో పాత హుబ్లీ గొసియా టౌన్ గార్డెన్ దగ్గర ఆదివారం సల్వార్లను పట్టుకొని హల్‌చల్ చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కటగర వీధి మహమ్మద్ సాధిక్ అలియాస్ బాబా సాధిక్ బేపారి, దాదాపీర్ చౌదరి, కొలికేర ప్లాట్ ఆసిఫ్ బేపారి, బుల్డోజర్ నగర్ మోహిన్‌ఖాన్ ధార్వాడ నిందితులు. వీరిని జుడీషియల్ కస్టడీకి అప్పగించారు.


కోలారు వార్తలు...

సాహితీవేత్తకు ఘనంగా నివాళి


ఆనంద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మాలూరు: సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత లక్కూరు సి.ఆనంద్ మరణించిన నేపథ్యంలో ఆయనకు లక్కూరు గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సి.ఆనంద్ చిన్న వయసులోనే సాహిత్య రంగంలో అపార సాధన చేశారన్నారు. లక్కూరు గ్రామంలో జన్మించిన ఆనంద్ సాహిత్య రంగంలో తనదైన సాధన చేసి గ్రామానికే కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారన్నారు. చిన్న వయస్సు నుంచే దళితులపై ఆకర్షితుడైన ఆనంద్ రచనలతో పాటు దళితులపై దౌర్జన్యాలపై కూడా అనేక రచనలు చేసి దళితులను జాగృతం చేసే ప్రయత్నం చేశారన్నారు. తెలుగు నుంచి కన్నడంలోకి అనేక అనువాద రచనలు చేశారన్నారు. సి.ఆనంద్ మరణం సాహిత్య లోకానికి తీరని లోటన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు


విజయలక్ష్మి

కోలారు: ఏపీఎంసీ మార్కెట్ యార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను సహించలేని పలువురు కూరగాయల దళారులు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని, వారి ఆరోపణలు సత్యదూరమని ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. ఎసోమవారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూరగాయల మండీ యజమానులు కూడా వీరితో చేతులు జోడించి అకారణంగా విధులకు అడ్డు పడుతున్నారన్నారు. రైతులకు తెల్ల చీటీలు ఇవ్వకుండా అధికారిక రసీదు ఇవ్వడం, రైతులు తెచ్చే 100 కిలోలకు 5 నుంచి 10 కిలోలు తగ్గించి చూపించడం, చెల్లింపుల్లో తక్కువ చెల్లిస్తుండడం, కూరగాయల వేలాన్ని నిర్ణీత సమయంలో వ్యాపారులు నిర్వహించేలా చేయడం, కూరగాయలు చెడిపోయే అవకాశం ఉండడం వల్ల శనివారం సెలవు పెట్టకూడదని తెలపడం వంటి మార్పులు తేవడం దళారులు, వ్యాపారులకు నచ్చలేదన్నారు. రైతులకు చెక్ ద్వారానే డబ్బులు ఇవ్వాలని సూచించడం కూడా వ్యాపారులకు నచ్చనందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన విధులకు అడ్డుపడుతున్న కొంతమంది కూరగాయల మండీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

మఠాధిపతుల ఒత్తిడితోనే డీసీపీపై వేటు


మాట్లాడుతున్న కోటిగానహళ్లి రామయ్య

కోలారు: హుబ్బళ్లిలో అంజలి అంబిగేర హత్య కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మఠాధిపతుల ఒత్తిడికి తలొగ్గి దళిత పోలీసు అధికారి డీసీపీ ఎం రాజీవ్‌ను సస్పెండు చేసిందని, ఈ విధంగా ప్రభుత్వం దళితులకు అన్యాయం చేసిందని సాహితీవేత్త కోటిగానహళ్లి రామయ్య ఆరోపించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాన్ని అవలంభిస్తోందన్నారు. 24 గంటల్లోగా పోలీసు అధికారి ఎం.రాజీవ్ సస్పెండు ఆదేశాలను వెనక్కు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి దళితులపై ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. రాష్ట్రంలో హత్యలు జరగడం ఇదే మొదటి సారా? అని ప్రశ్నించారు. గతంలో జరిగిన హత్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి ఘటనల్లో గతంలో వారి వారి కుల అధికారులను రక్షించారన్నారు. అంజలి హత్య కేసులో అధికారిని బలి పశువును చేశారన్నారు. మల్లికార్జున ఖర్గే, పరమేశ్వర్, హెచ్‌సీ మహదేవప్పలు దళిత జాతికి ద్రోహం చేస్తున్నారన్నారు. వీరు కుటుంబ రాజకీయ నాయకులన్నారు. దళితుల సమస్యలపై వీరు ఏనాడూ స్పందించలేదు, చేసిందేమీ లేదన్నారు.

గ్యారెంటీలే గెలుపునకు సోపానాలు


మాట్లాడుతున్న కేవీ రాంప్రసాద్

కోలారు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీటీ శ్రీనివాస్ తరపున సోమవారం ముళబాగిలు పట్టణంలోని వివిధ విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. కేపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రాంప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గ్యారెంటీ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నివృత్త కేఏఎస్ అధికారి డీటీ శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కిసాన్ ఖేత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రగౌడ, కేపీసీసీ ఎస్సీ బ్లాక్ తాలూకా అధ్యక్షుడు వి.మారెప్ప, అశోక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలతో 'ప్రైవేట్'పై ప్రజల్లో జాగృతి


మాట్లాడుతున్న నారాయణగౌడ

కోలారు: ప్రైవేటు పాఠశాలల్లో డొనేషన్ల బెడదను అరికట్టడానికి, అనధికారిక పాఠశాలలు, కళాశాలలపై కరపత్రాలను పంచడం ద్వారా ప్రజలను జాగృతం చేస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ తెలిపారు. సోమవారం ముళబాగిలు తాలూకా వడ్డహళ్లి ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. వారం రోజుల్లోగా అనధికార ప్రైవేటు పాఠశాలల జాబితాను తయారు చేసి డొనేషన్లు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు బ్రిటిష్‌వారి కాలం నుంచి ప్రైవేటు పాఠశాలల తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను ,చదివిస్తున్న తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సౌకర్యాలను కల్పిస్తే ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లాగా పెరిగేవి కావన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, ఫారూక్ పాషా, హెబ్బణి ఆనందరెడ్డి, బంగారి మంజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజకాలువకు పైప్‌లైన్ అనుసంధానం

- విల్లాలు ఉన్న ప్రాంతాల్లో వర్షం నీటి సమస్యకు చెక్
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన పాలికె కమిషనర్ తుషార్‌గిరినాథ్



పుట్టేనహళ్లి చెరువు అటవీమ్యాప్‌ను పరిశీలిస్తున్న తుషార్‌గిరినాథ్, మంజునాథ్ ప్రసాద్, రమణశ్రీగార్డీనియాలేఔట్‌లో వర్షంనీటిలో అపార్టుమెంటువాసులు

బనశంకరి: భారీ వర్షాల సమయంలో విల్లాస్‌లో నీరు నిల్వ ఉండకుండా పైపులైన్ల ద్వారా రాజకాలువలకు మళ్లించేందుకు చర్యలు చేపడుతామని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అన్నారు. బెంగళూరు నగరంలోని రమణశ్రీగార్డినియా లేఔట్, సౌత్‌హుడ్‌విల్లా ప్రాంతాల్లో 520 మీటర్ల పొడవుతో 1.600 ఎంఎం పైపు అమర్చాలని అధికారులకు సూచించారు. గత శనివారం కురిసిన వర్షానికి నీరు చొరబడిన సుమారు 32 విల్లాలను సోమవారం ఆయన బీబీఎంపీ అధికారులు, అటవీశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. పుట్టేనహళ్లి చెరువు పక్క ప్రాంతాల్లో విల్లా, అపార్టుమెంట్‌లు నిర్మించారని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనికారణంగా రాజకాలువ నిర్మాణం చేపట్టి చెరువులోకి నీటిని వదిలిపెట్టడానికి అటవీశాఖ వన్యజీవి మండలి నుంచి అనుమతి లభించే అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా 520 మీటర్ల పొడవు 1.600 ఎంఎం పైపులైన్ ను చెరువు వాకింగ్ మార్గం పక్కలో ఏర్పాటుచేసి రాజకాలువకు అనుసంధానం చేస్తామన్నారు. పనులు చేపట్టి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు రమణశ్రీలేఔట్‌ప్రాంతంలో ఏడాదిన్నర క్రితం ఎలాంటి ఇళ్లు లేని కారణంగా అక్కడ ఎలాంటి సమస్య కనబడలేదన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో విల్లా, అపార్టుమెంట్లు నిర్మించడంతో వర్షం నీటి సమస్య వెలుగు చూసిందన్నారు. తాత్కాలికంగా పంప్‌లు ఏర్పాటుచేసుకుని నీటిని మరోచోటకు వదులుతున్నారని తెలిపారు. గత శనివారం రమణశ్రీ గార్డినియాలేఔట్‌లో నిలిచిన నీటిని పూర్తిగా తొలగించామన్నారు. ప్రస్తుతం ఎలాంటి సమస్య ఉండదన్నారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా నిలిచిన నీటిని తొలగించడం కోసం పంప్ ను అక్కడ అందుబాటులో ఉంచామన్నారు. అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎన్.మంజునాథ్ ప్రసాద్ మాట్లాడుతూ యలహంక రమణశ్రీగార్డీనియాలేఔట్‌లో నీరునిల్వకుండా చర్యలు తీసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. అదనపు ప్రధాన అటవీసంరక్షణశాఖ అధికారి కుమార్‌పుష్కర్, ప్రధాన అటవీసంరక్షణాధికారి, అటవీశాఖ చీఫ్ బ్రిజేశ్‌కుమార్‌దీక్షత్, వలయ కమిషనర్ కరిగౌడ, జాయింట్ కమిషనర్ నయీమ్‌మహమ్మద్‌మోయిన్, ఇంజనీర్లు సుధాకర్, సవితా, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమలకు వెళ్లి వస్తుండగా కారు ప్రమాదం


పొలంలోకి వెళ్లిన కారు

విడపనకల్లు: మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామ సమీపంలో సోమవారం 42వ జాతీయ రహదారిలో ఓ కారు ప్రమాదానికి గురైంది. బళ్లారి ప్రాంతానికి చెందిన ఐదుగురు తిరుమల వెంకన్న దర్శనం చేసుకొని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఉరవకొండ దాటిన తరువాత పెద్ద కొట్టాలపల్లి సమీపంలో చనిపోయి రోడ్డు మీద పడి ఉన్న ఎనుమును కారు ఢీకొట్టి అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులోని ఐదుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయట పడ్డామని బాధితులు తెలిపారు. తరువాత సొంతూరికి వెళ్లిపోయారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి

మైసూరు: రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మరణించిన ఘటన మైసూరు దట్టగళ్లిలోని రామకృష్ణ పరమహంస సర్కిల్, కేఈబీ జంక్షన వద్ద జరిగింది. మైసూరు తోణచికొప్పలు నివాసి శివప్ప అనే వ్యక్తి రక్షిత్ (26) మరణించగా వెనుక కూర్చొన్న తేజస్ అనే వ్యక్తి కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బైక్‌లో వేగంగా వెళ్తుండగా కేఈబీ జంక్షన్ వద్ద అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నారు. కిందపడిడన రక్షిత్‌కు తలకు గాయమై అక్కడికక్కడే మరణించాడు. కేఆర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

మైసూరు: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో నగరంలో సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నంజుమళిగె సర్కిల్‌లో డాక్టర్ యతీంద్ర యువ బ్రిగేడ్, కృష్ణరాజ యువ బృందం ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకున్న కార్యకర్తలు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ చిత్రపటాలను పెట్టుకుని వేడుకలను జరుపుకున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


ఐశ్వర్య(ఫైల్)

శివమొగ్గ: శివమొగ్గ–యశవంతపుర రైలులో ప్రయాణించిన యువతి హఠాత్తుగా కనిపించకుండా పోయింది. ఈ విషయంపై శివమొగ్గ రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దావణగెరె జిల్లా న్యామతి తాలూకా సురహోన్నే గ్రామానికి చెందిన ఐశ్వర్య (19) మే 15న శివమొగ్గ నుంచి యశవంతపురకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించింది. అయితే బెంగళూరులో పని చేయాల్సి ఉన్న స్థలానికి రాకుండా హఠాత్తుగా మాయమైంది. ఆమె మొబైల్ కూడా స్విచ్చాఫ్ అయింది. యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేయసి మృతితో విరక్తి.. ప్రియుడు ఆత్మహత్య


కార్తీక్ పూజారి(ఫైల్)

యశవంతపుర: ప్రేమికురాలు ఆత్మహత్య చేసుకోవటంతో ప్రేమికుడు కూడా బలవన్మరణం చెందాడు. ఈ ఘటన మంగళూరులో జరిగింది. అతికారి బెట్టకు చెందిన కార్తీక్ పూజారి(20) ఓ యువతిని గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఏకారణం చేతనే ఆమె శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ప్రియురాలు లేని జీవితం వ్యర్థమని భావించిన కార్తీక్ పూజారి ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నవనీత అలంకరణలో బనశంకరీదేవి



బనశంకరి: బెంగళూరు నగర వాసుల ఆరాధ్య దేవత బనశంకరీదేవి నవనీత అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చింది. సోమవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకం చేపట్టి వెన్న, వివిధ రకాల పూలతో అలంకరణచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

వర్షాలకు రోడ్లు గుంతలమయం


వర్షాలకు రోడ్డు కోసుకుపోయి ఏర్పడిన గుంత

- ఫొటోలు తీసి యాప్‌లో ఉంచుతున్న నగరవాసులు
- గుంతల పూడ్చివేతపై అధికారుల ఉదాసీనత


గుంతలో నిలబడిన వర్షం నీరు

బనశంకరి: ఇటీవల బెంగళూరు నగరంలో కురిసిన భారీవర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లలో నీరు నిల్వ ఉండటంతో గుంతలు ఎక్కడ ఉన్నది తెలియడం లేదు. దీంతో వాహనాలు గుంతల్లో పడి చోదకులు గాయపడుతున్నారు. పాలికె పరిధిలో 1,344 కిలోమీటర్ల అర్టీరియల్, సబ్ అర్టీరియల్ రోడ్లు ఉన్నాయి. 13,638 కిలోమీటర్ల పొడవు వార్డు రోడ్లు ఉన్నాయి. ప్రతివార్డులో నాలుగైదు గుంతలు దర్శనమిస్తున్నాయి. అడ్డరోడ్లు, గల్లీరోడ్లలో చాలావరకు గుంతలు ఏర్పడ్డాయి. ఎన్‌ఎంచ్‌ఎం.లేఔట్ మొదటి క్రాస్, కిర్లోస్కర్ లేఔట్, గురురాజలేఔట్ 2వ మెయిన్, శెట్టిహళ్లి 5 క్రాస్, అశోకనగర 14 వక్రాస్, త్యాగరాజనగర గంగమ్మ ఆలయం మెయిన్‌రోడ్డు, ఐటీఐలేఔట్ జీపీఎస్ సంస్థ ముందు రోడ్లు గుంతల మయం అయ్యాయి. నైరుతి రుతుపవనాలు సమీపిస్తుండటంతో నగరంలో మరిన్ని రోడ్లు గుంతలమయంగా మారడం ఖాయని ప్రజలు పేర్కొంటున్నారు మరోపక్క ఫిక్స్ మై స్ట్రీట్ యాప్‌లో నగరవ్యాప్తంగా ప్రమాదకర రోడ్డుగుంతలు దర్శనమిస్తున్నాయి. నగరప్రజలు రోడ్డు గుంతలు ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేసి పాలికె దృష్టికి తీసుకువస్తున్నారు. కానీ గుంతలు పూడ్చడంలో బీబీఎంపీ తమవైఖరి మార్చుకోవడంలేదు.

భూహక్కుపత్రాలు ఇచ్చేవరకు పోరాటం


పొలం వద్ద శిబిరంలో కూర్చున్న దళిత రైతులు

శివమొగ్గ: దళితులు సాగు చేస్తున్న భూమిని ఎంపీఎం కర్మాగారం అధికారులు ఆక్రమించారని ఆరోపిస్తూ శివమొగ్గ జిల్లా హొళెహోన్నూరు సమీపలోని చందనకెరె దళిత సామాజికవర్గం కార్యకర్తలు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. చందనకెరె గ్రామ సర్వే నంబర్ 12/ఏ బ్లాక్‌లో సుమారు 28 ఎకరాల భూమిని 1960–61లో గ్రామంలోని 14 మంది దళితులకు సాగు చేసేందుకు పంపిణీ చేశారు. 1985–86 వరకు పంటలు సాగు చేస్తూనే వచ్చారు. అయితే తమ అసహాయతను ఆసరాగా చేసుకుని పీఎం కర్మాగారం వారు కొన్నేళ్ల క్రితం ఆ భూమిని లాక్కున్నారని. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసినా, కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి న్యాయ పోరాటం కోసం నిరవధిక ఆందోళనకు దిగారు. తమ పొలాలకు సంబంధించి హక్కు పత్రాలను అందివ్వాలని, తమ డిమాండ్ నెరవేరే వరకు ఈ ఆందోళన విరమించేది లేదని తెలిపారు.

అడవిదున్న వేటగాడి అరెస్ట్


పట్టుబడిన వేటగాడితో అటవీశాఖ పోలీసులు

దొడ్డబళ్లాపురం: అడవి దున్నను వేటాడి మాంసాన్ని తరలిస్తున్న ఎమ్మెమాడు నివాసి హ్యారిస్(42)అనే వేటగడిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్దనుంచి 549 కేజీల మాంసం, రెండు కత్తులు, పికప్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. మరో వేటగాడు పరారయ్యాడు.

కోడలిని వేధించి వీధిలోకి గెంటేశారు

మైసూరు: కోడలిని వేధించి ఇంటిబయటకు గెంటేయగా బాధితురాలు నజర్‌బాద్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మైసూరు గురురాజ లేఔట్‌లో గిరీశ్, వసంత దంపతులు నివాసం ఉంటున్నారు. గిరీష్ ఎలాంటి పని చేయకుండా భార్యను వేధించడమే పనిగా పెట్టుకున్నాడు. అతనికి తల్లి లలితమ్మ, తండ్రి వెంకటేశ్ సహకారం అందించారు. కొన్ని రోజుల క్రితం ఓ ఛానల్‌లో కోడలిని వీధిలోకి నెట్టే దృశ్యం కనిపించింది. అదే తరహాలో భర్త గిరీశ్ వసంతను వీధిలోకి నెట్టేశాడు.గిరీశ్‌కు అతని తల్లిదండ్రుల మద్దతు కూడా లభించింది. వీరి వేధింపులు తాళలేక వంసతకుమారి నజర్‌బాద్‌పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఇద్దరు బాలురు జల సమాధి

యశవంతపుర: చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృతి చెందారు. ఈ విషాద ఘటన బాగల్‌కోటె తాలూకా బనహట్టిలో జరిగింది. బనహట్టికి చెందిన సంజయ్ లక్ష్మణ తళవార్(12), సమర్థ సదాశివ తళవార్(10) ఆదివారం గ్రామ సమీపంలో చెరువుకు ఈత కొట్టేందుకు వెళ్లారు. నీటిలోకి దిగిన సమర్థ సదాశివ మునిగిపోతుండగా కాపాడేందుకు సంజయ్ వెళ్లాడు. చేతులు పట్టుకొని లాగుతుండగా ఆ బాలుడు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ గల్లంతైనట్లు తెలియగానే పోలీసులు, అగిమాపక సిబ్బంది వచ్చి గాలించి మృతదేహాలను బయటకు తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మారణాయుధాలతో హల్‌చల్


పట్టుబడిన నిందితులు సయ్యద్‌సుహేల్, సయ్యద్ ముబారక్

బనశంకరి: మారణాయుధాలతో హల్‌చల్ చేసిన ఇద్దరు కటకటాల పాలయ్యారు. డీసీపీ కులదీప్‌కుమార్‌జైన్ కథనం మేరకు... డీజే.హళ్లి నివాసులైన సయ్యద్‌సుహేల్, సయ్యద్‌ముబారక్ ఈనెల 12 తేదీన బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్‌లోకి మారణాయుధాలతో వెళ్లి హల్ చేసి వినియోగదారులను భయభ్రాంతులకు గురిచేశారు. బార్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో హెబ్బాళ్ పోలీస్‌స్టేషన్ హొయ్సళ సిబ్బంది వెళ్లి ఆ ఇద్దరినీ అరెస్ట్ చేసి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

పారిపోతూ భవనంపై నుంచి పడిన దొంగ

మైసూరు: దొంగ పారిపోతూ భవనంపై నుంచి పడి గాయపడిన ఘటన మైసూరు మానసి నగరలో జరిగింది. కార్పెంటర్‌గా పని చేస్తున్న రవి అనే వ్యక్తి దొంగతనం చేస్తూ పట్టుబట్టాడు. మానసి నగరలో డాక్టర్ బాలాజీ ఇంటిలో సిమెంట్ పని చేసేందుకు వచ్చాడు. అతనికి ఇంట్లో ఒక ప్రాంతంలో స్థలం కేటాయించి అక్కడే ఉంటూ పని చేసేందుకు అవకాశం కల్పించారు. రవి నకిలీ తాళంతో ఇంటిలో దొంగతనానికి యత్నించాడు. ఈ సమయంలో డాక్టర్ బాలాజీ వచ్చాడు. తలుపు తీసి ఉండడం గమనించి అనుమానంతో పోలీసులకు సమచారం అదించాడు. పసిగట్టిన రవి భవనంపై నుంచి దుప్పటి కట్టి కిందకి దిగేందుకు యత్నించాడు. అయితే కాలు జారి పడి తలకు తీవ్ర గాయమైంది. మైసూరు గ్రామీణ పోలీసులు రవిని అదుపులోకి తీసుకొని ఆస్పత్రికి తరలించారు. కాగా రవి గతంలో కూడా మూడుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. అతనికి డాక్టర్ బాలాజీ బుద్ధి చెప్పి హెచ్చరించాడు. అయితే బుద్ధి రాని రవి మరోమారు చోరీకి యత్నించి గాయాల పాలయ్యాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


హరీష్

దొడ్డబళ్లాపురం: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు బలయ్యారు. కారు ఢీకొని బైకిస్టు మృతి చెందిన సంఘటన మంగళూరు శివారులోని 73వ జాతీయ రహదారి మార్గంలోని కణ్బూరు వద్ద చోటుచేసుకుంది. మృతుడిని మంగళూరు తాలూకా తొక్కొట్టు కల్లాపు నివాసి హరీష్(43)గా గుర్తించారు. ఇతను హైవేపై రోడ్డుపక్కన బైక్ నిలిపి మొబైల్‌లో మాట్లాడుతుండగా అదుపుతప్పిన కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో హరీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళూరు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు...

మండ్య: కారు బైక్‌ను ఢీకొని గొల్లరహళ్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షురాలు ఇంద్రమ్మ(30) మృతి చెందింది. ప్రమాదంలో కుమారుడికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం తన కుమారుడితో కలసి బైక్‌లో హలగూరుకి వెళుతుండగా బైపాస్ రోడ్డులో కనకపుర నుంచి అతివేగంగా వచ్చిన బొలేరో వాహనం వీరి బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన తల్లీకుమారుడిని హలగూరులోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంద్రమ్మ మరణించింది.

రంగోలిలో శ్రీగురురాఘవేంద్ర స్వామి



శ్రీగురురాఘవేంద్రస్వామి చిత్రం, రంగోలిని రూపొందించిన కళాకారుల బృందం

మైసూరు: మంత్రాలయంలో మైసూరు కళాకారుల బృందం రంగోలి పోటీల్లో అద్భుతాన్ని ప్రదర్శించింది. శ్రీ గురురాఘవేంద్ర చిత్రాన్ని గీసి అందరి దృష్టిని ఆకర్షించింది. మైసూరు కళాకారులు పునీత్ కుమార్ ఎస్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల బృందం ఈనెల 7న మంత్రాలయానికి వెళ్లింది. 8న శ్రీగురురాఘవేంద్ర స్వామికి పూజలు సమర్పించి సాయంత్రం ఐదు గంటలకు రంగోలిలో 36,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో శ్రీ గురురాఘవేంద్ర స్వామి చిత్రాన్ని రూపొందించడం ప్రారంభించింది. 9న తెల్లవారుజామున 3.30 గంటలకు 66 శాతం రంగోలిని గీశారు. వర్షం రావడంతో మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. రెండో రోజు ఇదే బృందం 43 డిగ్రీలసెల్సియస్ ఉష్ణోగ్రతలో పాదరక్షలు లేకుండా భక్తిభావంతో రాఘవేంద్ర బొమ్మను గీసింది. మధ్యాహ్నం 3.30 గంటలకు 90 శాతం పని ముగిసింది. 10 శాతం గీస్తే చిత్రం పూర్తవుతుందనుకుంటున్న తరుణంలో మళ్లీ వర్షం వచ్చి వారి శ్రమ నీటి పాలైంది. అయితే అభిలాష్‌కు రాఘవేంద్ర మీద ఉన్న భక్తిభావంతో మూడో రోజు మళ్లీ ప్రయత్నించింది. ఈసారి దేవాలయం గర్భగుడి ముందు అతిపెద్ద రాఘవేంద్ర చిత్రాన్ని రూపొందించారు. పునీత్ కుమార్ నగరంలోని జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఈ వివరాలు మీడియాకు వివరించారు.

హోసూరు వార్తలు..

నేత్రపర్వంగా తేరు వేడుక


రథాన్ని లాగుతున్న భక్తులు

హోసూరు: హోసూరు సమీపంలోని పాతకోట గ్రామంలో సీతారామాంజనేయస్వామి ఆలయ రథోత్సవం ఘనంగా జరిగింది. నాలుగు రోజుల క్రితం ఆలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపనతో రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం విశేషంగా అలంకరించిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఉత్సవ మూర్తిని తేరులో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పాతకోట చుట్టుప్రపల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగారు.

లారీ ఢీకొని స్కూటరిస్టు మృతి

హోసూరు: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని వన్నలవాడి గ్రామానికి చెందిన మునిరాజ్ భార్య హేమ (40) ఆదివారం సాయంత్రం స్కూటర్‌లో హోసూరు– బెంగళూరు హైవేలో ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన మహిళ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఇంటి కరెంటు బిల్లు రూ.8.75 లక్షలా?

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని ఓ గ్రామంలో నివాసముంటున్న రైతు ఇంటికి కరెంటు బిల్లు రూ. 8.75 లక్షలు వచ్చింది. ఆ మేరకు బిల్లు కట్టాలని విద్యుత్ శాఖ ద్వారా అతని సెల్‌ఫోన్‌ను మెసేజ్ రాగా చూసి గుండెపోటు వచ్చినంత పనైంది. వివరాల మేరకు కెలమంగలం సమీపంలోని చిన్నట్టి గ్రామానికి చెందిన రైతు వెంకటేష్. ఇతని కుటుంబంలో ఐదుమంది ఉన్నారు. రాష్ట్రంలో 100 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు ఉచితం కావడంతో ఆ ఇంటికి ఇంతవరకు విద్యుత్ బిల్లు వచ్చేది కాదు. ఈ నేపథ్యంలో మే నెలలో ఇంటి కరెంటు బిల్లు రూ. 8.75 లక్షలు చెల్లించాలని వెంకటేష్ మొబైల్‌కి విద్యుత్ శాఖ ద్వారా మెసేజ్ వచ్చింది. అది చూసి కంగారుపడిన బాధితుడు సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగులు చేసే పొరపాట్ల వల్ల అమాయక ప్రజలు భయపడాల్సి వస్తోందని స్థానికులు ఆరోపించారు.

మద్యం కోసం ఆత్మహత్య

క్రిష్ణగిరి: మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన బేరికెలో చోటు చేసుకొంది. వివరాల మేరకు సూళగిరి దగ్గర ముదుగురికి గ్రామానికి చెందిన అంజప్ప (46) కూలి కార్మికుడు. ఇతనికి తాగుడు అలవాటుండేది. ఆదివారం మద్యం తాగేందుకు భార్యను డబ్బులడిగాడు. ఇవ్వకపోవడంతో కోపం పట్టలేక ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. బేరికె పోలీసులు కేసు నమోదు చేశారు.

వృథాగా కొత్త చెత్త వాహనాలు


మూలన పడిన చెత్త తరలించే బ్యాటరీ వాహనాలు

- ఊరికే మూలన పడేశారు

క్రిష్ణగిరి: లక్షలాది రూపాయలను ఖర్చు పెట్టినప్పుడు ఫలితం కూడా ఉండాలి. కానీ ఇక్కడ ఎలాంటి ప్రయోజనం లేదు. ఎందుకు కొన్నారో, ఎందుకు పక్కన పెట్టేశారో అధికారులకే తెలియదు. తాలూకా కేంద్రం సూళగిరిలో కొనుగోలు చేసిన చెత్త తొలగింపు వాహనాలు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి పట్టణ పంచాయతీలో వెలువడే చెత్తాచెదారాన్ని తొలగించేందుకు గత ఆరునెలల క్రితం బీడీఓ కార్యాలయం ద్వారా ఎలెక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేశారు. వాటిని బీడీవో కార్యాలయ ఆవరణలో అలంకారప్రాయంగా నిలిపి ఉంచారు. పట్టణంలో చెత్తాచెదారం సేకరణకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారని, లక్షల రూపాయల ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన బ్యాటరీ వాహనాలను వృథాగా పడేశారని, బీడీవో కార్యాలయ అధికారులు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు.


తుప్పు పడుతున్న వాహనం

దొంగతనం చేస్తే రూ.20వేల వేతనం

- పొలాల్లో పంప్‌సెట్లు, కేబుల్స్ చోరీ చేయడమే ఉద్యోగం
- ఇద్దరి అరెస్ట్

తుమకూరు: ఆఫీసులు, ఫ్యాక్టరీల్లో జీతంపై సిబ్బందిని నియమించుకోవడం సాధారణం. అయితే ఓ వ్యక్తి దొంగతనాలు చేసేందుకు ఇద్దరు ఉద్యోగులను పెట్టుకొని నెలకు రూ.20వేల వేతనం ఇస్తూ వారితో చోరీలు చేయిస్తున్నాడు. ఇలా చోరీలు చేస్తూ ఇద్దరు దొంగలు పోలీసులకు పట్టుబడ్డారు. బెంగళూరుకు చెందిన వెంకటేశ్ బెంగళూరులోని బసవేశ్వరనగర్‌కు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తిని నియమించుకొని చోరీలు చేయిస్తున్నాడు. అతనికి నెలకు రూ.20వేలు చెల్లించేవాడు. ఇతను కారులో తుమకూరు జిల్లా కొరటగెరెకు వెళ్లి వ్యవసాయ తోటల్లో వ్యవసాయ పంప్‌సెట్లు, కేబుల్స్, వాటి సామగ్రిని దొంగలించేవాడు. దొంగ సొత్తును వినేష్ పాటిల్ అనే వ్యక్తి ద్వారా విక్రయించేవాడు. మూడు నెలలుగా తుమకూరు జిల్లాలోని పొలాల్లో పంప్‌సెట్లు చోరీకి గురవుతుండటంతో పెద్ద ఎత్తున పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు నిఘా పెట్టారు. గత వారం చోరీ చేసిన పంప్‌సెట్లను కారులో తరలిస్తున్న దృశ్యాలు సీసీకెమెరాల్లో నమోదయ్యాయి. ఎస్పీ అశోక్ ఆదేశాలతో కొరటగెరె సీఐ అనిల్, ఎస్ఐ మంజునాథ్, కానిస్టేబుళ్లు మోహన్, దొడ్డలింగయ్య, సంజీవరాజులు సీసీకెమెరాలను పరిశీలించగా కారు నంబర్ లభ్యమైంది. ఆ నంబర్ ఆధారంగా బెంగళూరులోని కామాక్షి పాళ్యలో గాలింపు చేపట్టి రాఘవేంద్ర, వినేష్ పాటిల్‌ను అరెస్ట్ చేశారు. నిందితులనుంచి కారు, కేబుల్ స్వాధీనం చేసుకున్నారు.

అన్న కళ్లెదుటే తమ్ముడి మృతి

శివాజీనగర: రోడ్డు ప్రమాదంలో అన్న కళ్లెదుటే తమ్ముడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన జ్ఞానభారతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో సోమవారం జరిగింది. ధార్వాడకు చెందిన గిరీష్, వినాయక (20)సోదరులు. ఐటీఐ చదువుతూ జిగణిలో నివాసం ఉంటున్నారు. బొమ్మనహళ్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పార్ట్‌టైం జాబ్ చేసేవారు. సోమవారం ఉదయం సుంకదకట్టలో ఉన్న కాలేజీకి సోదరులు బైక్‌లో బయల్దేరారు. వినాయక బైక్ డ్రైవ్ చేస్తుండగా, గిరీశ వెనుక కూర్చున్నాడు. నైస్ రోడ్డులోని మంగనహళ్లి వద్ద అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఇద్దరూ చెల్లాచెదురుగా పడిపోయారు. అదే సమయంలో వచ్చిన మరో వాహనం వినాయకపై దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గిరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జ్ఞానభారతి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం

శివాజీనగర: బైలహొంగల ఎమ్మెల్యే మహాంతేశ్ కౌజలగి తృటిలో పెను ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఆయన ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా వచ్చిన కారు ఢీకొన్న ఘటన విధానసౌధ ముందు సోమవారం సంభవించింది. ఎమ్మెల్యేల భవన్ నుంచి వెళుతున్న వాహనం విధానసౌధ వైపు నుంచి రోడ్డులోకి రాగానే వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది.దీంతో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణపాయం సంభవించలేదు. ఎమ్మెల్యే మరో కారులో వెళ్లిపోయారు. కబ్బన్ పార్కు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఓ మదీ మేలుకో..!

- ఏటా పెరుగుతున్న మానసిక సమస్యలు
- స్మార్ట్‌ఫోన్ల వాడకంతో అధిక ప్రభావం
- మానసిక ఆరోగ్య అవగాహన నెల మే



మానసిక ఆరోగ్య అవగాహన నెల పోస్టర్‌లు

గుంటూరు మెడికల్: ఇంట్లో పిల్లలు అదే పనిగా వీడియోగేమ్స్‌ ఆడుతూ మిగతా పనులను పక్కన పెట్టేస్తున్నారా.. తదేకంగా గంటల తరబడి టీవీలకు అతుక్కుపోయి ఉంటున్నారా.. అయితే వారిని ఓ కంట కనిపెట్టి ఉండాల్సిందే. లేకుంటే చిన్నవయస్సులోనే వారు మానసిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని మానసిక వ్యాధి నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంటలకొద్దీ కంప్యూటర్‌ ముందు కూర్చుని చాటింగ్‌లు చేయటం, ఫేస్‌బుక్‌లో తలమునకలవుతూ ఉండటం మానసిక వ్యాధులకు కారణమవుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్‌ వినియోగం బాగా పెరగడం వల్ల మానసిక జబ్బులు ఎక్కువయ్యాయని ఈ–ఎడిక్షన్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. మానసిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా మే నెలను ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ‘ సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లా వ్యాప్తంగా 35 మంది మానసిక వైద్యనిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతిరోజూ 20 మంది వరకు వివిధ రకాల మానసిక సమస్యలతో బాధపడే వారు వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో రోజూ 100 నుంచి 130 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

నాలుగేళ్లుగా జీజీహెచ్‌లో మానసిక సమస్యలతో చికిత్స తీసుకున్న వారు ఇలా..

సంవత్సరం	రోగుల సంఖ్య
2020	16,529
2021	22,726
2022	28,579
2023	29,371
2024	2,505

మానసికవ్యాధి లక్షణాలు...

చికాకు, కోపం, విసుగు తదితర లక్షణాలు వారానికి పై బడి ఉంటే వారు మానసిక వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాలి. తనలో తాను మాట్లాడుకోవటం, ఒంటరిగా తనొక్కడే ఉండి నవ్వుకోవటం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవటం, చేసిన పనిని పదేపదే చేయాలనుకోవటం, అనవసరమైన ఆలోచన్లి ఆపుకోలేకపోవటం, నిద్రలోపం, బరువు పెరగటం, నిర్ణయాలు తీసుకోవటంలో తీవ్ర జాప్యం చేసి తనమీద ఆధారపడే వారందరిని ఇబ్బందికి గురిచేస్తూ తానూ ఇబ్బందులకు గురికావడం, ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం, తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాల వరకు వెళ్ళటం, తిరగబడి దాడి చేయటం, వ్యక్తిలో ఉన్న అనుమానాలు ఎన్ని రూపాల్లో నివృత్తి చేసే యత్నం చేసినా ఒప్పుకోకపోవటం తదితర లక్షణాలు మానసిక వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయి.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం

మానసిక వ్యాధులకు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలను అందించటంతోపాటుగా మందులూ పైసా ఖర్చు లేకుండా అందిస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు రోజూ 21 నబర్ ఓపీలో వైద్య సేవలు లభిస్తాయి.

హార్మోన్ల లోపమే కారణం

ఒత్తిడి, వ్యసనాలు, మితిమీరిన సెల్‌ఫోన్, ఎల్రక్టానిక్ పరికరాల వినియోగం వల్ల ప్రస్తుతం మానసిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ జబ్బులు వంశపారంపర్యంగానూ అధికంగా వస్తుంటాయి. మెదడులో రసాయనాలు ఊరటంలో మార్పు, మెదడులో గడ్డలు ఏర్పటం, మెదడులో ‘డోపమిన్‌’ హార్మోన్ లోపం, హార్మోన్ అసమతుల్యం, అసమానత్వం, పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవటం, ఫిట్స్, నిద్రలేమి వల్ల కూడా మనో వ్యాధులు వస్తాయి. మానసిక వ్యాధులతో ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు ఎక్కువగా బాధ పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆందోళనకు గురిచేసే విషయాలను పట్టించుకోకూడదు. మద్యం, పొగతాగటం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఆరు నుంచి తొమ్మిది గంటలపాటు నిద్రపోవాలి. కుటుంబ సభ్యులందరితో సమయం గడపాలి. రోజూ వ్యాయామం చేయాలి. మానసిక వ్యాధులకు అనేక ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్‌ ఇవటూరి శరత్‌చంద్ర, మానసిక వైద్య నిపుణులు సంఘం రాష్ట్ర కార్యదర్శి, గుంటూరు

పిల్లలు, పెద్దలు తేడా లేదు



పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ప్రస్తుతం మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. క్రమశిక్షణ లేని ఆధునిక జీవనశైలే దీనికి కారణం. ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే త్వరగా నయం చేసేందుకు అవకాశం ఉంది. మందులతోపాటుగా రోగులకు కౌన్సెలింగ్ చాలా ముఖ్యం. వ్యాధి గ్రస్తులను కుటుంబ సభ్యుల పర్యవేక్షిస్తూ మందులు సక్రమంగా మింగేలా చేస్తే వ్యాధి నుంచి త్వరితగతిన బయటపడతారు.

–డాక్టర్‌ ఐవీఎల్‌ నరసింహారావు, మానసిక వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు

- అనుకూలించిన వాతావరణం
- తెగుళ్ల బెడద అంతంత మాత్రమే
- గణనీయంగా దిగుబడులు
- మార్కెట్‌లో మంచి ధర
- మొక్కజొన్న రైతుల్లో ఆనందం


మద్దూరు కరకట్టపై ఆరబోసిన మొక్కజొన్న రాశి


ఎండబెట్టిన మొక్కజొన్న కండెలు

కంకిపాడు: ఈ ఏడాది మొక్కజొన్న సాగు ఆశాజనకంగా ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించటం, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో మంచి దిగుబడులు లభించాయి. దిగుబడులకు తోడు మార్కెట్‌లో మంచి ధర కూడా లభిస్తుండటంతో మొక్కజొన్న రైతుల మోములో చిరునవ్వులు వికసిస్తున్నాయి.

కృష్ణాజిల్లాలో 10,598 ఎకరాల్లో సాగు...

ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు అపరాలతో పాటుగా మొక్కజొన్న సాగును ఎంచుకున్నారు. జిల్లాలోని 25 మండలాల్లో 10,598 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. 15 రోజులుగా రైతులు మొక్కజొన్న కోత కోయించి మిషను పట్టిస్తున్నారు. మొక్కజొన్న గింజలను ఎండబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు హైరానా పడుతున్నారు. అయితే పంటను సంరక్షించుకుని నాణ్యత దెబ్బతినకుండా మార్కెట్‌కు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

ఎకరాకు 40 క్వింటాళ్లకు పైగా దిగుబడులు..

ఈ రబీ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు బాగా అనుకూలించాయి. తెగుళ్ల బెడద కూడా అంత ప్రభావం లేదు. కత్తెర పురుగుతో కొంత ఇబ్బందులు పడ్డా సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకోవటంతో పంటను కాపాడుకోగలిగారు. దీంతో ఎకరాలకు 40 క్వింటాళ్లకు పైగా దిగుబడులు లభించాయి. పంటను మార్కెట్‌కు తరలించి మద్దతు ధర పొందుతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,090గా మద్దతు ధర నిర్ణయించింది. దీంతో బయటి మార్కెట్‌లో వ్యాపారులు సైతం మద్దతు ధర కంటే అదనంగానే చెల్లించి కొనుగోళ్లు చేపడుతున్నారు. పలువురు కోళ్లఫారాల నిర్వాహకులు కోళ్ల మేత కోసం మొక్కజొన్నలను కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుంటున్నారు. వీరి నుంచి రైతులకు రూ.2,200 వరకూ ధర చెల్లిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఆశించిన ధర లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

‘బేలర్‌’తో వరిగడ్డి వృథాకు చెక్‌!

- రైతుకు, పశుపోషకులకు ఉభయ తారకం
- ఎకరా గడ్డి రూ.4 వేలకు పైమాటే..


హార్వెస్టర్‌తో కోసిన గడ్డిని కట్టలు కడుతున్న బేలర్‌ యంత్రం

పెనుగంచిప్రోలు: హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తుక్కుగా మారి పొలమంతా పడుతోంది. దీనిని రైతులు పొలాల్లోనే కాల్చేస్తున్నారు. దీంతో డెయిరీ ఫారం నిర్వహించే వారికి, పశుపోషకులకు పశుగ్రాసం కరువైంది. గ్రాసానికి డిమాండ్ కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో పలువురు పాడి రైతులు బేలర్ యంత్రాలతో కట్టలు కట్టిన గడ్డిని తెచ్చుకుంటూ పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు.

ఒక్కో కట్టకు రూ.30 నుంచి రూ.35 ఖర్చు..

వరిగడ్డి కట్టలు కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానమై ఉంటాయి. ట్రాక్టర్ నడుస్తున్న కొద్దీ పొలమంతా పడిన గడ్డిని యంత్రాలు కట్టలు కడతాయి. ఎకరం గడ్డిని గంటలోపే 40 నుంచి 50 కట్టలు కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30 నుంచి రూ.35 తీసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో గేదెలు పెంచేవారు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ముందుగా రైతులకు ఎంతో కొంత చెల్లించి యంత్రాలతో కట్టలు కట్టిస్తున్నారు. గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో చాలా మంది రైతులు కాల్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. కట్టలను ఒక్క రోజు ఎండబెట్టి బండ్లు లేదా ట్రాక్టర్లలో ఇళ్లకు తరలిస్తున్నారు. మళ్లీ, వర్షాకాలం సీజన్ పంట కోసేవరకు గడ్డి దొరకదు కాబట్టి పశుగ్రాసాన్ని 3, 4 నెలలు వచ్చేలా నిల్వ చేస్తున్నారు. ఇలా గడ్డిని కట్టలు కట్టడం వలన గేదెలు కూడా బాగా తింటాయని రైతులు అంటున్నారు. రైతులు గడ్డిని నిల్వ చేసుకోవడం కూడా సులభంగా ఉందంటున్నారు. ప్రస్తుతం ఒక ఎకరా వరిగడ్డికి రూ.4 వేల పైనే ధర పలుకుతోంది.

నిల్వ చేసుకోవటం సులభం



కట్టలు కట్టిన గడ్డిని రైతులు నిల్వ చేసుకోవటం సులభం. వృథాగా పోయే గడ్డి కట్టలు కట్టటం వలన రైతులకు కూడా ప్రయోజనకరంగా ఉంటోంది. వర్షాలు వచ్చే సీజన్‌కు ముందు గడ్డిని రైతులు నిల్వ చేసుకోవాలి. యంత్రాలు రావటంతో కట్టలు కట్టి గడ్డిని ఇంటి దగ్గర వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

– రాములు, రైతు, పెనుగంచిప్రోలు

వైభవంగా నృసింహస్వామి జయంత్యుత్సవాలు


ఉత్సవంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) గ్రామోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యావాహచనం, అగ్ని ప్రతిష్ఠ నరసింహమూల మంత్ర హోమం, సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుమ్భారాధన నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ఎలక్షన్‌-2024

బీజేపీ అభ్యర్థుల్లో... నాలుగోవంతు

ఫిరాయింపుదారులే

దేశవ్యాప్తంగా 435 స్థానాల్లో బీజేపీ పోటీ | **వారిలో ఏకంగా 106 మంది వలస పక్షులే**

నేతలు పార్టీలు మారడం, సిద్ధాంతాలు మార్చుకోవడం రాజకీయాల్లో పరిపాటే. చాలా ఏళ్లుగా ఉన్న ధోరణే. కానీ సిద్ధాంతాలు, విలువలకు పెద్దపీట వేస్తామని చెప్పుకునే బీజేపీ కొన్నాళ్లుగా ఫిరాయింపు నేతలకు పెద్దపీట వేస్తుండటం విశేషం. ఈ లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బరిలో ఉన్న 435 మంది బీజేపీ అభ్యర్థులను గమనిస్తే ఆశ్చర్యకరమైన వివరాలు తెలుస్తాయి. వీరిలో ఏకంగా 106 మంది, అంటే నాలుగో వంతు అభ్యర్థులు గత పదేళ్లలో కమలం గూటికి వలస వచ్చినవాళ్లే! అందులోనూ 90 మంది గత ఐదేళ్లలో బీజేపీలోకి ఫిరాయించారు!

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌



ప్రముఖ జంపర్లు

జ్యోతిరాదిత్య సింధియా (కేంద్ర మంత్రి, కాంగ్రెస్‌ మాజీ నేత-గుణ)
జితిన్‌ ప్రసాద (కాంగ్రెస్‌ మాజీ నేత-పిలిభిత్‌)
నవీన్‌ జిందాల్‌ (ప్రముఖ పారిశ్రామికవేత్త-కురుక్షేత్ర)
అశోక్‌ తన్వర్‌ (హరియాణా పీసీసీ మాజీ చీఫ్‌-సిర్సా)
ప్రణీత్‌ కౌర్‌ (అమరీందర్‌సింగ్‌ భార్య-పటియాలా)
సీతా సోరెన్‌ (జేఎంఎం ఎమ్మెల్యే-దుమ్కా)

ఈసారి ఎలాగైనా 2019 కంటే ఎక్కువ లోక్‌సభ స్థానాలు సాధించాలని అధికార బీజేపీ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తోంది. ప్రాంతీయ పార్టీల్లో టికెట్లు రాని వారు, మోదీ మేనియా కలిసొస్తుందని భావించిన వాళ్లు ఎన్నికల ముందే బీజేపీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఆరు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయగా వారిలో ఏకంగా ఐదుగురు 2019 తర్వాతే పార్టీ తీర్థం తీసుకోవడం విశేషం! తెలంగాణలోనూ 17 మంది బీజేపీ అభ్యర్థుల్లో 11 మంది 2014 తర్వాత వచ్చి చేరిన వారే. వీరిలో చాలామంది మాజీ కాంగ్రెస్, టీడీపీ, బీఆర్‌ఎస్‌ నేతలే.

ఇతర రాష్ట్రాల్లోనూ అంతే..

ఏపీ వంటి చోట్ల బీజేపీ బలహీనంగా ఉంది గనుక వలస నేతలకు పెద్దపీట వేసిందనుకుంటే పార్టీ అత్యంత బలోపేతంగా ఉన్న యూపీ, హరియాణా తదితర చోట్లా ఇదే బాట పట్టడం ఆశ్చర్యం కలిగించేదే! హరియాణాలోని 10 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్నవారిలో ఆరుగురు 2014 తర్వాత పార్టీలో చేరినవారే. ప్రముఖ పారిశ్రామికవేత్త నవీన్‌ జిందాల్‌ అయితే లోక్‌సభ ఎన్నికల ముందే బీజేపీ కండువా కప్పుకున్నారు. పీసీసీ మాజీ చీఫ్‌ అశోక్‌ తన్వర్‌ కూడా అంతే. ఇక యూపీలో బీజేపీ సొంతంగా పోటీ చేస్తున్న 74 లోక్‌సభ స్థానాలను చూస్తే 23 చోట్ల బరిలో ఉన్నవాళ్లు బయటి నుంచి వచ్చినవారే. అంటే ఏకంగా 31 శాతం! పంజాబ్‌లోని 13 స్థానాల్లో ఏకంగా ఏడుగురు బీజేపీ అభ్యర్థులు వలస వచ్చిన బాపతే. వీరిలో చాలామంది కాంగ్రెస్‌ మాజీలే. వీరు చాలావరకు మాజీ సీఎం అమరీందర్‌ సింగ్‌ తన పార్టీని బీజేపీలో విలీనం చేసినప్పుడు బీజేపీలోకి వచ్చారు. జార్ఖండ్‌లో కూడా 13 మంది బీజేపీ అభ్యర్థుల్లో ఏడుగురు జేఎంఎం, కాంగ్రెస్, జార్ఖండ్‌ వికాస్‌ మోర్చాల నుంచి జంప్‌ చేసిన నేతలే. వీరిలో మాజీ సీఎం హేమంత్‌ సోరెన్‌ మరదలు సీతా సోరెన్‌ కూడా ఉన్నారు. ఒడిశాలో 29 శాతం, తమిళనాడులో 26 శాతం మంది బీజేపీ అభ్యర్థులు ఫిరాయింపుదారులే! మహారాష్ట్రలోనూ పావు వంతు బీజేపీ అభ్యర్థులు బయటి నుంచి వచ్చిన బాపతే.

ఎందుకని..?

బీజేపీ బలహీనంగా ఉన్న ఏపీ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలే గాక బలంగా ఉన్నచోట కూడా ఇలా ఫిరాయింపులను భారీగా ప్రోత్సహిస్తుండటం వెనుక విజయమే పరమావధి అంటున్నారు. మరీ ముఖ్యంగా గత రెండు లోక్‌సభ ఎన్నికల నుంచి యూపీలో బీజేపీ హవా నడుస్తోంది. అయినా అక్కడ కూడా 31 శాతం మంది వలసదారులకు టికెట్లివ్వడం ఇందుకు నిదర్శనం. ప్రత్యర్థి పార్టీలు బలమైన అభ్యర్థులను దింపిన చోట బీజేపీ ప్రధానంగా ఫిరాయింపుదారులనే నమ్ముకుంది. తనకు గెలుపు గుర్రాలు లేరనుకున్న లోక్‌సభ స్థానాల్లో ఇతర పార్టీల నుంచి బలమైన నాయకులను ఆకర్షించేందుకు బీజేపీ ఏమాత్రం వెనుకాడటం లేదు!

రాష్ట్రాలవారీగా ఫిరాయింపుదారులు

రాష్ట్రం	బీజేపీ అభ్యర్థులు	ఫిరాయింపుదారులు (2014 తర్వాత)
ఆంధ్రప్రదేశ్‌	6	5
తెలంగాణ	17	11
హరియాణా	10	6
పంజాబ్‌	13	7
జార్ఖండ్‌	13	7
ఉత్తరప్రదేశ్‌	74	23
ఒడిశా	21	6
తమిళనాడు	19	5
మహారాష్ట్ర	28	7
పశ్చిమబెంగాల్‌	42	10
బిహార్‌	17	3
కర్ణాటక	25	4
కేరళ	16	2
రాజస్తాన్‌	25	2
గుజరాత్‌	26	2
మధ్యప్రదేశ్‌	29	2
ఇతర రాష్ట్రాల్లో	54	4

అనంత్‌నాగ్‌-రాజౌరీలో...

అంతుపట్టని ఓటరు నాడి

పీడీపీ, ఎన్సీ హోరాహోరీ

- సవాలు చేస్తున్న చిన్న పార్టీలు
- తొలిసారి బరిలో కశ్మీరేతరుడు
- పోటీలో లేకున్నా బీజేపీ ప్రచారం

జమ్మూ కశ్మీర్‌లో అనంత్‌నాగ్‌–రాజౌరీ స్థానంలో పోటీ ఈసారి ఆసక్తి రేపుతోంది. ఉమ్మడి రాష్ట్ర చివరి సీఎం, పీపుల్స్‌ డెమొక్రటిక్‌ పార్టీ చీఫ్‌ మెహబూబా ముఫ్తీ బరిలో దిగడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఇక్కడ పోలింగ్‌ మే 7న మూడో విడతలో జరగాల్సింది. బీజేపీ, ఇతర పార్టీల విజ్ఞప్తి మేరకు ఆరో విడతలో భాగంగా మే 25కు కేంద్ర ఎన్నికల సంఘం మార్చింది...

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

2022 పునర్విభజనలో అనంత్‌నాగ్‌ లోక్‌సభ స్థానం కాస్తా అనంత్‌నాగ్‌–రాజౌరీగా మారింది. విపక్ష ఇండియా కూటమి భాగస్వాములైన నేషనల్‌ కాన్ఫరెన్స్, పీడీపీ కశ్మీర్‌ లోయలో మాత్రం పరస్పరం పోటీ పడుతున్నాయి. లోయలోని 3 లోక్‌సభ స్థానాలూ 2014లో పీడీపీకే దక్కాయి. 2019లో వాటన్నింటినీ ఎన్సీ కైవసం చేసుకుంది. అనంత్‌నాగ్‌ సిట్టింగ్‌ ఎంపీ హస్నాయిన్‌ మసూదీ కేవలం 6,676 ఓట్లతో గట్టెక్కారు. ఎన్సీ ఈసారి వ్యూహాత్మకంగా గుర్జర్‌ బకర్వాల్‌ మత నాయకుడు, పార్టీ సీనియర్‌ నేత మియా అల్తాఫ్‌ను బరిలో దింపింది. ఆయనకు పూంచ్, రాజౌరిలో గట్టి మద్దతుంది. ఇది ఇతర పార్టీల ఓట్లను చీల్చే అవకాశముంది. మోదీ ప్రభుత్వం ఫిబ్రవరిలో పహాడీ జాతి సమూహాలకు షెడ్యూల్డ్‌ తెగ హోదా ఇచ్చాక సమీకరణాలు మారాయి. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి వేరు కుంపటి పెట్టుకున్న గులాం నబీ ఆజాద్‌ డెమొక్రటిక్‌ ప్రోగ్రెసివ్‌ ఆజాద్‌ పార్టీ (డీపీఏపీ) నుంచి మహమ్మద్‌ సలీమ్‌ పారే, అప్నీ పార్టీ నుంచి జాఫర్‌ ఇక్బాల్‌ మన్హాస్‌ బరిలో ఉన్నారు. ఆర్టికల్‌ 370 రద్దు నేపథ్యంలో బల్‌దేవ్‌ కుమార్‌ రూపంలో జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా ఓ స్థానికేతరుడు పోటీ చేస్తుండటం విశేషం. ఆయన స్వస్థలం పంజాబ్‌.



లెక్కలు మార్చేసిన డీలిమిటేషన్‌!

2022కు ముందు జమ్మూలో రెండు (జమ్మూ, ఉధంపూర్‌), కశ్మీర్‌లో మూడు (శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్‌), లద్దాఖ్‌లో ఒక లోక్‌సభ స్థానముండేవి. డీలిమిటేషన్‌ తర్వాత జమ్మూలో రెండు స్థానాలు కొనసాగినా అక్కడి పూంచ్, రాజౌరి జిల్లాల్లో చాలా భాగాన్ని కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌ లోక్‌సభ స్థానంతో కలిపి అనంత్‌నాగ్‌–రాజౌరీగా చేశారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 18 అసెంబ్లీ సీట్లున్నాయి. మొత్తం 18.3 లక్షల ఓటర్లున్నారు. 10.94 లక్షల మంది కశ్మీర్‌ ప్రాంతంలో, 7.35 లక్షల మంది జమ్మూలో ఉన్నారు. మెజారిటీ కశ్మీరీలు ముస్లింలు. జమ్మూలో 3 లక్షల మేర గుర్జర్లు, బేకర్వాల్‌ సామాజిక వర్గం ఉంది. మిగతా జనాభా పహాడీలు (హిందువులు, సిక్కులు ఇతరత్రా). వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చడం వంటి చర్యల ద్వారా బీజేపీ నెమ్మదిగా లోయలో పాగా వేయజూస్తోంది. ఈసారి పోటీ చేయకున్నా వేరే పార్టీలకు మద్దతిస్తోంది. బీజేపీ నేతలు తీవ్రంగా ప్రచారమూ చేస్తున్నారు. ఎన్సీ, కాంగ్రెస్, పీడీపీలపై సభలు పెట్టి మరీ విమర్శలు గుప్పిస్తున్నారు! ఆ మూడింటికి కాకుండా ఎవరికైనా ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




బీజేపీ అడ్డుకుంటోంది: ముఫ్తీ

తాము ప్రజలను కలవకుండా మోదీ సర్కారు అడ్డుకుంటోందని ముఫ్తీ ఆరోపిస్తున్నారు. ‘‘ఆర్టికల్‌ 370 రద్దుతో వారు నెలకొల్పామంటున్న శాంతి నిజానికి శ్మశాన వైరాగ్యం. మాకది ఆమోదయోగ్యం కాదు. జమ్మూ కశ్మీర్‌ యంత్రాంగం దన్నుతో దక్షిణ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి’’ అని మండిపడుతున్నారు.

కశ్మీరీ పండిట్‌ ఒంటరి పోరు

కశ్మీరీ పండిట్లు. 1980ల్లో పెచ్చరిల్లిన హింసాకాండకు తాళలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోయిన ప్రజలు. ఏళ్ల కొద్దీ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఈ వర్గానికి చెందిన దిలీప్‌ కుమార్‌ పండిత (54) ఈసారి అనంత్‌నాగ్‌–రాజౌరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు! ముఫ్తీ, మియా అల్తాఫ్‌ అహ్మద్‌లకు గట్టి సవాల్‌ విసురుతున్నారు. పౌర చర్చల ద్వారా పండిట్లు, ముస్లింలతో పాటు కశ్మీరీలందరినీ ఏకం చేస్తానన్నది ఆయన హామీల్లో ప్రధానమైనది. నిజాయితీగా ఆయన చేస్తున్న ప్రయత్నం స్థానికులను ఆకర్షిస్తోంది. ప్రతి గడపకూ వెళ్లి ఓట్లడుగుతున్నారు. స్థానికులతో భేటీ అవుతున్నారు. ఐదు వలస శిబిరాల్లో ఉన్న 35,000 మంది పండిట్లను తనకే ఓటేయాలని కోరారు. ‘‘35 ఏళ్లుగా ఇంటికి దూరంగా బతుకుతున్నాం. మాకిప్పటికీ న్యాయం జరగలేదు. కశ్మీరీ పండిట్లకు న్యాయం కోసం, వారు లోయలోకి సురక్షితంగా తిరిగొచ్చే పరిస్థితులను నెలకొల్పడం కోసం పోరాడుతున్నాను’’ అని మీడియాకు తెలిపారు పండిత.





మల్టీ టాలెంట్
ఫౌజియా అర్షి

ఆకాశమే హద్దు

డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా బాలీవుడ్‌లో గుర్తింపు పొందిన ఫౌజియా అర్షి మేనేజ్‌మెంట్ అండ్ మార్కెటింగ్ పుస్తకాల రచయిత్రి, గిటారిస్ట్, సింగర్, మ్యూజిక్ కంపోజర్, డైలాగ్ రైటర్. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా విజయపథంలో దూసుకుపోతోంది.

ఎఫ్ఏ ఎయిర్‌లైన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా తాజాగా మరో సవాలును స్వీకరించనుంది.

ఖాళీగా కూర్చోకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఫౌజియా అర్షి పెట్టింది పేరు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఫౌజియాకు టైమ్ అంటే కొత్త విషయం తెలుసుకోవడం. కొత్త కళలో అక్షరాలు దిద్దడం. కాలాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకున్న ఆమె కృషి వృథా పోలేదు. 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అని ప్రపంచం గుర్తించేలా చేసింది.

'హోగయా దిమాగ్ క దహీ' బాలీవుడ్ సినిమాతో నవ్వులు పూయించింది. ఈ రోరింగ్ కామెడీ ఫిల్మ్‌లో ఓంపురి, రాజ్‌పాల్ యాదవ్ లాంటి నటులు నటించారు.

ఫస్ట్–జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా టీనేజ్‌లోనే తన వ్యాపారదక్షతను చాటుకుంది ఫౌజియా.

'ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్' పేరుతో ఆమె రాసిన పుస్తకానికి మంచి పేరు వచ్చింది. మేనేజ్‌మెంట్ డిప్లొమా కోర్సుల విద్యార్థులకు బాగా ఉపకరించే ఈ పుస్తకం ప్రపంచ మార్కెటింగ్‌కు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, భౌగోళిక వాతావరణాన్ని కళ్లకు కడుతుంది. 'ది సన్ రైజెస్ ఫ్రమ్ ది వెస్ట్' అనేది దీనికి పూర్తిగా భిన్నమైన పుస్తకం. 'ఏది వాస్తవం?' అంటూ వాస్తవాన్ని గురించి లోతుగా విశ్లేషించే పుస్తకం. తాత్విక ఛాయలు కనిపించే ఈ పుస్తకం రకరకాల చుక్కలను కనెక్ట్ చేసి ఒక రూపాన్ని మన ముందు ఆవిష్కరిస్తుంది.

ఎంత అలవోకగా పుస్తకం రాయగలదో అంతే అలవోకగా రాగం తీయగలదు. అప్పటికప్పుడు పదాలు అల్లుతూ పాట పుట్టించగలదు. కాన్వాస్‌పై కనువిందు చేసే చిత్రాన్ని సృష్టించగలదు. ఇక గిటారిస్ట్‌గా ఆమె నైపుణ్యం సరేసరి. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌గా ఎంత జటిలమైన విషయాలనైనా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించగలదు.

ఫౌజియాకు చెందిన డైలీ మల్టీ మీడియా లిమిటెడ్ (డీఎంఎల్)... సినిమాలు, టెలివిజన్ కంటెంట్, యాడ్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్స్, ఈవెంట్ ఆర్గనైజింగ్, పొలిటికల్ క్యాంపెయిన్‌కు సంబంధించిన కంపెనీ.


సామాజిక సేవారంగంలో చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకొని ఫౌజియాను బ్రిటన్ పార్లమెంట్ సత్కరించింది.

ఫౌజియాకు ఇంగ్లీష్ భాషలో ఇష్టమైన మాట 'న్యూ ఛాలెంజ్'.

ఎప్పటికప్పుడు కొత్త ఛాలెంజ్‌లను అధిగమిస్తూ తన సత్తా చాటుతోంది.

తాజా విషయానికి వస్తే...

ముంబైకి చెందిన ఎఫ్ఏ ఎయిర్‌లైన్స్ ప్రాంతీయ విమానయాన సంస్థ 'ఫ్లైబిగ్'ను కొనుగోలు చేసే ప్రక్రియ జరుగుతోంది. లావాదేవీలు పూర్తయిన తరువాత 'ఫ్లైబిగ్'ను మరిన్ని విమానాలతో విస్తరించనున్నారు. ఎఫ్ఏ ఎయిర్‌లైన్స్‌కు ఫౌజియా అర్షి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంది. 'ఫ్లైబిగ్' రూపంలో మరో సవాలు అర్షి ముందుకు రానుంది. ఈ సవాలును కూడా ఫౌజియా విజయవంతంగా అధిగమించగలరన్నది ఆమె గురించి తెలిసిన వారు కాస్త గట్టిగానే చెప్పేమాట.



డైరెక్టర్‌గా...



రైటర్‌గా...



గిటారిస్ట్‌గా...

● నోమొఫోబియా



ఫోన్ కనపడకపోతే ప్రాణం పోతోందా?

ఒక్క నిమిషం.. ఫోన్ కనపడదు.
చాలా భయం. చాలా ఆందోళన.
చాలా కోపం. చాలా వణుకు.
ఈ లక్షణాలన్నీ ఉంటే
మీకు 'నో మొబైల్ ఫోన్ ఫోబియా'
లేదా 'నోమొఫోబియా' ఉన్నట్టే.
ఇది మీకు చేటు చేస్తుంది.
దీన్నుంచి బయటపడమని
సైకియాట్రిస్ట్‌లు సూచిస్తున్నారు.

ఇంతకుముందు మనిషి రెండు చేతులు రెండు కాళ్లతో ఉండేవాడు. ఇప్పుడు అతని చేతికి అదనపు అంగం మొలుచుకుని వచ్చింది– మొబైల్ ఫోన్. అది లేకుండా గతంలో మనిషి బతికాడు. ఇప్పుడూ బతకొచ్చు. కాని మొబైల్ ఫోన్‌తో మన వ్యక్తిగత, కుటుంబ, వృత్తిగత, స్నేహ, సాంఘిక సమాచార సంబంధాలన్నీ ముడి పడి ఉన్నాయి కాబట్టి అది కలిగి ఉండక తప్పదు. అలాగని అదే జీవితంగా మారితే నష్టాలూ తప్పవు. ఐదు నిమిషాల సేపు ఫోన్ కనిపించకపోతే తీవ్ర ఆందోళన చెందుతూ ఉన్నా, సినిమాకు వెళ్లినప్పుడైనా మూడు గంటల సేపు ఫోన్ స్విచ్చాఫ్ చేయలేకపోయినా, రాత్రి ఫోన్ ఎక్కడో పడేసి మీరు మరెక్కడో నిద్రపోలేకపోయినా, ఎంత ఆత్మీయులొచ్చినా ఫోన్ వైపు చూడకుండా దానిని చేతిలో పెట్టుకోకుండా వారితో గడపలేకపోయినా మీకు 'నోమొ ఫోబియా' ఉన్నట్టు.

కేస్‌స్టడీ 1

ఆఫీస్ నుంచి హుషారుగా ఇల్లు చేరుకున్న సుందర్ కాసేపటికి బట్టలు మార్చుకుని ముఖం కడుక్కుని రిలాక్స్ అయ్యాడు. ఫోన్ గుర్తొచ్చింది. టీ పాయ్ మీద లేదు. టీవీ ర్యాక్ దగ్గర లేదు. కంగారుగా భార్యను పిలిచి ఆమె ఫోన్‌తో రింగ్ చేయించాడు. రింగ్ వస్తోంది కాని ఇంట్లో ఆ రింగ్ వినపడలేదు. సుందర్‌కు చెమటలు పట్టాయి. మైండ్ పని చేయలేదు. ఎక్కడ మర్చిపోయాడు. కారు తాళాలు తీసుకుని కిందకు వెళ్లి కారులో వెతికాడు. లేదు. మళ్లీ పైకి వచ్చి ఇల్లంతా వెతికాడు. దారిలో పెట్రోలు పోయించుకున్నాడు... అక్కడేమైనా పోయిందా? మరోచోట ఫ్రూట్స్ కొని ఫోన్‌పే చేశాడు. అక్కడ పడేసుకున్నాడా? ఫోన్.. మొబైల్ ఫోన్.. అది పోతే... అది పోతే... మైండ్ దిమ్మెక్కిపోతోంది. సరిగ్గా అప్పుడే అతని కూతురు వచ్చి రక్షించింది. 'నాన్నా.. ప్యాంట్ జేబులో మర్చిపోయావు. వాల్యూమ్ లో అయి ఉంది' అని. ఫోన్ కనపడకపోతే ప్రాణం పోతుంది ఇతనికి. అంటే నోమొ ఫోబియా ఉన్నట్టే.

కేస్ స్టడీ 2

ఇంటికి చాలా రోజుల తర్వాత గెస్టులు వచ్చారు. వారు ఎదురుగా కూచుని మాట్లాడుతున్నారు. ఇంటి యజమాని విజయ్ ఫోన్ చేతిలో పట్టుకుని వారితో మాట్లాడుతున్నాడు. ప్రతి నిమిషానికి ఒకసారి ఫోన్ చూస్తున్నాడు. వాళ్లతో మాట్లాడుతూనే ఫేస్‌బుక్ స్క్రోల్ చేస్తున్నాడు. వాళ్లతో మాట్లాడుతూనే వాట్సప్ చెక్ చేస్తున్నాడు. వాళ్ల వైపు ఒక నిమిషం ఫోన్ వైపు ఒక నిమిషం చూస్తున్నాడు. వాళ్లకు విసుగొచ్చి కాసేపటికి లేచి వెళ్లిపోయారు. విజయ్‌కు నోమొ ఫోబియా ఉంది.

కేస్ స్టడీ 3

దుర్గారావు ఆఫీస్ పని మీద వేరే ఊరు వెళ్లి హోటల్‌లో దిగాడు. దిగాక గాని తెలియలేదు అక్కడ ఫోన్ సిగ్నల్స్ అందవని. కాల్స్ ఏమీ రావడం లేదు. డేటా కూడా సరిగ్గా పని చేయడం లేదు. ఆ ఊళ్లో వేరే మంచి హోటళ్లు లేవు. సిగ్నల్ కోసం హోటల్ నుంచి గంట గంటకూ బయటకు వెళ్లాల్సి వస్తోంది. ఇక అక్కడ ఉన్నంత సేపు దుర్గారావుకు అస్థిమితమే. చిరాకే. ఏ కాల్ మిస్సవుతున్నానో అన్న బెంగే. ఏ మెసేజ్ అందడం లేదో అన్న ఆందోళనే. ఇదీ నోమొ ఫోబియానే.

ఎలా బయటపడాలి?

- ఖాళీ సమయాల్లో మెల్లమెల్లగా ఫోన్‌ను పక్కన పడేయడం ప్రాక్టీస్ చేయండి.
- రోజులో ఒక గంటైనా ఏదో ఒక సమయాన ఫోన్ స్విచ్చాఫ్ చేయడం మొదలుపెట్టండి.
- సినిమాలకు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు ఫోన్ ఇంట్లో పడేయడమో, మ్యూట్ చేసి జేబులో పడేయడమో చేయండి.
- ఫోన్ నుంచి దృష్టి మరల్చే ఆటలు, పుస్తక పఠనం, ఇతర హాబీలపై దృష్టి పెట్టండి.
- యోగా, ప్రాణాయామం చేయడం మంచిది.
- ఫోన్‌లో మీ కాంటాక్ట్స్, ముఖ్యమైన ఫొటోలు, ఇతర ముఖ్య సమాచారం పర్సనల్ కంప్యూటర్‌లోనో మెయిల్స్‌లోనో నిక్షిప్తం చేసుకుని ఫోన్ ఎప్పుడుపోయినా మరో సిమ్ కొనుక్కోవచ్చు అనే అవగాహన కలిగి ఉంటే నోమొ ఫోబియాను దాదాపుగా వదిలించుకోవచ్చు.

నష్టాలు

- నోమొఫోబియా ఉంటే మీ అనుబంధాలు దెబ్బ తింటాయి. ఎందుకంటే అనుబంధాల కంటే ఫోన్‌తో బంధం ముఖ్యమని భావిస్తారు కాబట్టి.
- నోమొ ఫోబియా మీ లక్ష్యాలపై మీ ఫోకస్‌ను తప్పిస్తుంది. మీరు ఎక్కువసేపు ఒక పని మీద మనసు లగ్నం చేయరు. దీనివల్ల చదువుకునే విద్యార్థి, పని చేయాల్సిన ఉద్యోగి, ఇంటిని చక్కదిద్దే గృహిణి అందరూ క్వాలిటీ వర్క్‌ను నష్టపోతారు. పనులు పెండింగ్‌లో పడతాయి.
- నోమొ ఫోబియా కలిగిన వారు తమను తాము నమ్ముకోవడం కన్నా ఫోన్‌ను నమ్ముకుంటారు. చివరకు ఫోన్ లేకుండా ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టడానికి కూడా ఇష్టపడరు.
- సోషల్ మీడియా సంబంధాలే అసలు సంబంధాలుగా భావించి అసలు సంబంధాలు కోల్పోతారు.
- ఫోన్ ఇతరుల చేతుల్లో పడితే వారు ఏమి ఆరా తీస్తారోనని అనుక్షణం ఫోన్‌ని కనిపెట్టుకుని ఉంటారు.

సాగుబడి

కృత్తిక కార్తె : మే 25 వరకు
రోహిణి కార్తె : మే 26 నుంచి

అర్బన్ అన్నదాత!

- అర్బన్ సాగు కోసం సొంత టెక్నాలజీలను అభివృద్ధి చేసిన హైదరాబాద్ సంస్థ 'అర్బన్ కిసాన్'
- అర్బన్ సాగుకు అనుగుణంగా స్పీడ్ బ్రీడింగ్ పద్ధతుల్లో అనేక కూరగాయలు, పండ్ల వంగడాల రూపుకల్పన.
- పూర్తిగా సొంత టెక్నాలజీతోనే దేశ విదేశాల్లో హైబ్రిడ్ స్మార్ట్ అర్బన్ ఫామ్స్‌ను భాగస్వామ్య పద్ధతిలో నెలకొల్పుతోంది.



విస్తారమైన పొలాల్లో ఆరుబయట సాగేది సంప్రదాయ వ్యవసాయం అయితే.. నియంత్రిత వాతావరణంలో అత్యాధునిక సాంకేతికతలతో చేసేది అర్బన్ వ్యవసాయం. మట్టిలో కాకుండా పోషకాలతో కూడిన నీటిలో వర్టికల్ స్ట్రక్చర్లలో లేదా కొబ్బరి పొట్టుతో కూడిన గ్రోబాగ్స్‌లో అర్బన్ సాగు జరుగుతూ ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక సాగు వ్యవస్థలతో పాటు ప్రత్యేకంగా బ్రీడింగ్ చేసిన వంగడాలు కూడా అవసరమే అంటోంది 'అర్బన్ కిసాన్'. మానవాళి రేపటి ఆహారపు, పర్యావరణ అవసరాలు తీర్చటం కోసం స్పీడ్ బ్రీడింగ్ తదితర పద్ధతుల్లో పరిశోధనలు చేపట్టి చక్కని పురోగతి సాధిస్తోంది. ఈ హైదరాబాద్ సంస్థ విదేశాల్లోనూ సత్తా చాటుతోంది. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సహా పలు సంస్థల భాగస్వామ్యంతో అర్బన్ సాగు ప్రపంచంలో తనదైన ముద్ర వేస్తోంది.

పట్టణీకరణ తామరతంపరగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అత్యాధునిక సాంకేతికతలతో కూడిన అర్బన్ ఫార్మింగ్ పద్ధతులు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కోవలోనివే హైడ్రోపోనిక్స్, సాయిల్ లెస్ ఫార్మింగ్, వర్టికల్ ఫార్మింగ్, ఇండోర్ ఫార్మింగ్ వంటివి. ఈ సాగు వ్యవస్థలను ముఖ్యంగా అర్బన్ రైతులకు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో హైదరాబాద్ సమీపంలో ఏడేళ్ల క్రితం ప్రారంభమైంది 'అర్బన్ కిసాన్'. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో పనిచేస్తూ అర్బన్ కిసాన్ అభివృద్ధి సాధిస్తోంది. ఇక్కడ పండించిన లెట్యూస్, ఇటాలియన్ బసిల్ తదితర ఆకుకూరలు, రంగురంగుల కాప్సికం తదితర కూరగాయలతో తయారైన సలాడ్స్‌ను ఫార్మ్‌బౌల్ పేరుతో హైదరాబాద్‌లో అందుబాటులోకి తెస్తోంది.

అర్బన్ సాగు కోసం ప్రత్యేక వంగడాలు

హైదరాబాద్ నగర శివారు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి పారిశ్రామికవాడలో అర్బన్ కిసాన్ పరిశోధన కేంద్రం ఏర్పాటైంది. విహారి కానుకొల్లు, డాక్టర్ సాయిరాం రెడ్డి పాలిచర్ల కొందరు మిత్రులతోపాటు అర్బన్ కిసాన్ సహ వ్యవస్థాపకులుగా ఉన్నారు. విహారి సీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, డా. సాయిరాం రెడ్డి, డా. నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పరిశోధనలు సాగుతున్నాయి. హైడ్రోపోనిక్స్, వర్టికల్ ఫార్మింగ్ వ్యవస్థలను శీతల గదిలో, పాలీహౌస్‌లో, మేడపైన.. ఇలా అనేక వాతావరణ పరిస్థితుల్లో మట్టి లేకుండా వివిధ పంటలు పండించటంపై వారు లోతైన పరిశోధనలు చేస్తున్నారు.

పొలాల్లో వాడే సాధారణ వంగడాలను నియంత్రిత వాతావరణంలో, పరిమిత స్థలంలో సాగు చేయటం అనేక ఇబ్బందులతో కూడిన పని. అందుకే అర్బన్ సాగుకు అవసరమైన ప్రత్యేక వంగడాల రూపుకల్పన కృషికి అర్బన్ కిసాన్ శ్రీకారం చుట్టింది. మన దేశపు 150 రకాల కూరగాయలు, ఆకుకూరలపై ప్రయోగాలు చేశారు. తక్కువ ఉష్ణోగ్రతల్లో పండటంతో పాటు.. వేర్ల పొడవు, మొక్క సైజు, ఆకారం తదితర అంశాల్లో అర్బన్ ఫార్మింగ్‌కు అనువుగా చిన్న సైజులో ఉండేలా అనేక సరికొత్త వంగడాలను రూపొందించామని డా. సాయిరాం రెడ్డి 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. ఇవి తిరిగివాడుకోదగిన సూటి రకాలేనని, వీటిని నియంత్రిత వాతావరణంలో ఏ దేశంలోనైనా పండించవచ్చన్నారు.

2.5 ఏళ్లలోనే కొత్త వంగడాలు

బెండ, టొమాటో, పచ్చిమిర్చి వంగ తదితర కూరగాయల్లో ఒక్కో రకానికి సంబంధించి 2–3 రకాల వంగడాలను రూపొందించారు. ఫంగస్ సోకని బేసిల్ (ఇటాలియన్ తులసి)ను రూపొందించారు. ఎరుపు, ఆకుపచ్చ, కాండం తెల్లగా ఆకు గ్రీన్‌గా ఉండే రకరకాల తోటకూర రకాలను రూపొందించారు. పాలకూర, కొత్తిమీర, గోంగూరలో కూడా కొత్త వంగడాలను రూపొందించారు. కీరదోస, సొర, కాకర వంటి తీగజాతులు పాలినేషన్ అవసరం లేకుండా దిగుబడినిచ్చే విధంగా రూపొందిస్తున్నాం అన్నారు డా. సాయిరాం. సాధారణంగా ఒక కొత్త వంగడాన్ని బ్రీడింగ్ చేయాలంటే 6–7 ఏళ్లు పడుతుంది. స్పీడ్ బ్రీడింగ్ పద్ధతిలో తాము 2.5 ఏళ్లలోనే కొత్త వంగడాలను రూపొందించగలిగామన్నారు.

95 శాతం నీటి ఆదా

వేగవంతమైన నగరీకరణ నేపథ్యంలో నగరాల్లో ఏడాది పొడవునా అర్బన్ ప్రాంతీయులకు తాజా ఆకుకూరలు, కూరగాయలు అందించడానికి ద్రవరూప ఎరువులతో చేసే వర్టికల్ ఫార్మింగ్ ఉపయోగపడుతోంది. హైడ్రోపోనిక్స్ పద్ధతిలో పంటలు పండించటం వల్ల కలిగే ప్రయోజనాలను భారత్‌తోపాటు ప్రపంచదేశాలు ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాయి. సాధారణ వ్యవసాయంలో వాడే నీటితో పోల్చితే ఈ పద్ధతిలో 95% ఆదా అవుతుంది. పొలంలో పంటతో పోల్చితే నిర్దిష్టమైన స్థలంలో 30 రెట్లు అధిక దిగుబడి సాధించడానికి హైడ్రోపోనిక్స్ ఉపయోగపడుతుందని, అందులోనూ ఈ సాంకేతికతను దేశీయంగానే అభివృద్ధి చేశామని అర్బన్ కిసాన్ చెబుతోంది.

సాగులో ఉన్న పంటల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా పోషకాల మోతాదు, పిహెచ్ స్థాయిలు, వాతావరణంలో తేమ, కార్బన్‌డయాక్సయిడ్ స్థాయి, కాంతి తీవ్రత వంటి అనేక ఇతర అంశాలన్నిటినీ ఒక యాప్ ద్వారా నియంత్రిస్తుండటం విశేషం. వర్టికల్ ఫార్మింగ్ వ్యవస్థల్లో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను ఉపయోగిస్తూ ఫార్మింగ్ ఆటోమేషన్‌లో అర్బన్ కిసాన్ తనదైన ప్రత్యేకతను చాటుతోంది. ప్రపంచవ్యాప్తంగా హైడ్రోపోనిక్స్ సాగు జరుగుతున్నా ఇందులో అన్ని దశలకు సంబంధించిన సంపూర్ణ సాంకేతికత ఒకే చోట అందుబాటులో లేదు. అర్బన్ కిసాన్ పూర్తిగా సొంత సాంకేతికతను అభివృద్ధి చేసుకోవటం విశేషం.

మధ్యప్రాచ్య దేశాల్లో ఆదరణ

అర్బన్ కిసాన్ ఇండోర్ హైడ్రోపోనిక్స్ యూనిట్లలో పూర్తిస్థాయిలో ఆటోమేషన్ చేస్తారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, కృత్రిమ మేధ, సెన్సార్ల ఆధారంగానే ఫామ్ యాజమాన్యం ఉంటుంది. దుబాయ్, ఒమన్, ఖతార్ దేశాల్లో మూడేళ్ల క్రితం 50% భాగస్వామ్యంతో హైడ్రోపోనిక్స్ యూనిట్‌ను నెలకొల్పాం. అదే మాదిరిగా బహామాస్ దేశంలోనూ 50% భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను కూడా తాము ఇక్కడి నుంచే పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నామని డా. సాయిరాం రెడ్డి వివరించారు. అక్కడ ఆకుకూరల ధర కిలో 12 డాలర్లు. మా యూనిట్లలో కిలో 5 డాలర్లకే ఆకుకూరలను ఉత్పత్తి చేస్తున్నాం. అమెరికా, కెనడా, నార్వే దేశాల్లో కూడా జాయింగ్ వెంచర్లు ఏర్పాటు చేయబోతున్నాం.

మన దేశంలో హైడ్రోపోనిక్స్ యూనిట్లకు పారిశ్రామిక విద్యుత్తు చార్జీలు వర్తిస్తుండటం ఈ హైటెక్ సాగు విస్తరణకు ప్రతిబంధకంగా మారింది. ఇప్పటికైతే ఇది కాస్త ఖరీదైన ప్రత్యామ్నాయ ఆహారోత్పత్తి పద్ధతే. కానీ, పోషక విలువలున్న, పురుగుమందుల్లేని ఆహారాన్ని అందించే ఈ పద్ధతి ఏదో ఒక రోజున మెయిన్ స్ట్రీమ్‌లోకి వస్తుందని అర్బన్ కిసాన్ ఆశాభావంతో ముందడుగు వేస్తోంది.

– పంతంగి రాంబాబు,
సాక్షి సాగుబడి డెస్క్







హైదరాబాద్ నగర శివారు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి పారిశ్రామికవాడలోని అర్బన్ కిసాన్ పరిశోధన కేంద్రంలో హైడ్రోపోనిక్స్ సాగు దృశ్యాలు

చెప్పినంత దిగుబడి..!

హైడ్రోపోనిక్స్ సాగు ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్నారు. అయితే, ఎవరి దగ్గరా కంప్లీట్ టెక్నాలజీ లేదు. మా దగ్గర తప్ప. మేం వాడుతున్నది స్వయంగా మేం దేశీయంగా పరిశోధనల ద్వారా రూపొందించుకున్న పరిపూర్ణమైన, సమగ్ర సాంకేతికత ఇది. అందుబాటులో ఉన్న టెక్నాలజీలతో పోల్చితే 60% ఖర్చుతోనే మా టెక్నాలజీని అర్బన్ ఫార్మర్స్ పొందవచ్చు. దీని ద్వారా చెప్పినంత దిగుబడి కచ్చితంగా ఇస్తుంది. ప్రపంచంలో ఎవరైనా టెక్నాలజీ అమ్ముతారు లేదా ప్రొడక్టు అమ్ముతారు. మేం అలాకాదు. ఇతర సంస్థలతో కలిసి భాగస్వామ్యంలో యూనిట్లు నెలకొల్పి ఉత్పత్తి చేసి విక్రయించి లాభాలు పంచుకుంటాం. ఈ పద్ధతిలోనే అనేక దేశాల్లో యూనిట్లు ఏర్పాటు చేశాం. పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలంటే హైడ్రోపోనిక్ కూరగాయలు, ఆకుకూరలను ప్రీమియం ప్రైస్‌తో అమ్మగలగాలి. మానవాళి భవిష్యత్తు ఆహారపు అవసరాలు తీర్చగలిగిన శక్తిసామర్థ్యాలున్న టెక్నాలజీ ఇది.


– డాక్టర్ సాయిరాం రెడ్డి పాలిచర్ల
అర్బన్ కిసాన్ పరిశోధనా కేంద్రం,
గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
sai@urbankisaan.com





ఇంటి పంట

కలబంద రసంతో ఉపయోగాలెన్నో..



కలబందలో మొక్కలకు కావలసిన పోషకాలు, యాంటిఆక్సిడెంట్లు, ఎంజైమ్‌లు పుష్కలంగా ఉంటాయి. అమైనా ఆమ్లాలు, కాల్షియం, జింక్, మెగ్నీషియం వంటివి 75 రకాల పోషకాలుంటాయి.. ఇది మొక్కలను క్రిములు, వైరస్‌లు, శిలీంధ్రాల నుంచి కాపాడుతుంది. కలబంద ఆకు ముక్కలను మిక్సీలో వేస్తే రసం వస్తుంది. స్పూనుతో ఈ కింద చెప్పిన కొలతలో ఇంటిపంటలు / మిద్దెతోటల సాగులో వాడుకోవచ్చు:

1. ఒక టీస్పూను కలబంద రసాన్ని ఒక లీటరు నీటితో కలిపి మొలక దశలో లేదా చిన్న మొక్కలు స్ప్రే చేయవచ్చు. వారానికి ఒక సారి చేస్తే సరిపోతుంది. **2.** ఒక టేబుల్ స్పూన్ రసాన్ని ఒక లీటరు నీటితో కలిపి మొక్క ఉన్న కుండీలో పోయాలి. ఇలా నెలకు ఒకసారి చేయాలి. దీనివలన మొక్కకు ఇమ్యూనిటీ పెరుగుతుంది. **3.** మొక్కను ఒక కుండీ నుంచి వేరే కుండీలోకి మార్చినప్పుడు లీటరు నీటికి ఒక టేబుల్ స్పూన్ రసాన్ని కలిపి కుండీలో పోయాలి. ఇలా చేస్తే మొక్క మార్పిడి వత్తిడికి గురికాదు. **4.** ఎరువుగా వాడాలి అన్నప్పుడు 2 టేబుల్ స్పూన్ల కలబంద రసాన్ని లీటరు నీటితో కలిపి మొక్క కుండీలో పోయాలి. ఇలా 15 రోజులకు ఒకసారి వాడాలి. **5.** స్ప్రే చేయాలంటే ఒక టేబుల్ స్పూన్ వాడాలి లీటరు నీటికి. ఆకుల అడుగు భాగంలో మాత్రమే స్ప్రే చేయాలి. దీనివలన మొక్క తొందరగా పోషకాలను గ్రహిస్తుంది. **6.** రూటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఏదైనా మొక్క కొమ్మను విరిచి నాటుకోవాలంటే, నేరుగా కలబంద రసంలో అరగంట కొమ్మ చివరను నానబెట్టి, ఆ తరువాత నాటవచ్చు. **7.** ఇది బూడిద తెగులును అరికడుతుంది.

గమనిక: కలబంద రసం తయారు చేసిన అర గంట లోపే వాడాలి. పులిస్తే అందులో ఉన్న పోషకాలు కొన్ని పోతాయి.

– విజయలక్ష్మి, బెంగళూరు మిద్దెతోట బృందం





జ్యోతి యర్రాజీకి స్వర్ణం, రజతం

కొత్త సీజన్‌లో భారత మహిళా అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ మరోసారి మెరిసింది. జర్మనీలో జరిగిన కుర్ప్‌ఫాల్జ్ గాలా మీట్‌లో జ్యోతి ఒక స్వర్ణం, ఒక రజత పతకం నెగ్గింది. 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో జ్యోతి 13.06 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని గెలిచింది. 200 మీటర్ల ఫైనల్లో జ్యోతి 23.83 సెకన్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని దక్కించుకుంది. రెండు వారాల క్రితం నెదర్లాండ్స్‌లో జరిగిన హ్యారీ షుల్టింగ్ గేమ్స్‌లో జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణంతో కొత్త సీజన్‌ను ఘనంగా ఆరంభించింది.

ఆనంద్‌కు మూడో స్థానం

కాసాబ్లాంకా చెస్ వేరియంట్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విజేతగా నిలిచాడు. నలుగురు మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య మొరాకోలో ఆరు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో కార్ల్‌సన్ 4.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని పొందాడు. ఐదుసార్లు ప్రపంచ మాజీ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. హికారు నకమురా (అమెరికా) 3.5 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచాడు. ఆనంద్ ఒక గేమ్‌లో ఓడిపోయి, మరో గేమ్‌లో నెగ్గి, మిగతా నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.



ఫైనల్ వేటలో ఎవరిదో జోరు!

నేడు తొలి క్వాలిఫయర్‌లో కోల్‌కతాతో హైదరాబాద్ 'ఢీ'

గెలిస్తే నేరుగా టైటిల్ పోరుకు ● ఓడినా... మరో అవకాశం

రాత్రి గం.7:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్', జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


కమిన్స్, శ్రేయస్ అయ్యర్

అహ్మదాబాద్: గత రెండు నెలలుగా పది జట్ల పోరు 'ప్లే ఆఫ్స్' లక్ష్యంగా సాగింది. మెరుపులు, ధనాధన్ ధమాకాలతో ఐపీఎల్ 17వ సీజన్ మరింత మజాను పంచింది. ఇప్పుడు నాలుగు జట్ల సమరం ఫైనల్ దిశగా జరగనుంది. ముందుగా మంగళవారం జరిగే తొలి క్వాలిఫయర్‌లో జోరు మీదున్న సన్‌రైజర్స్ హైదరాబాద్... రెండుసార్లు (2012, 2014) చాంపియన్ అయిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో తలపడనుంది. 2016లో ఐపీఎల్ ట్రోఫీ సాధించిన సన్‌రైజర్స్ ప్రస్తుత సీజన్‌లో భీకరమైన ఫామ్ దృష్ట్యా టైటిల్ వేటలో ముందంజ వేయాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు కోల్‌కతా తక్కువేం కాదు... తగ్గేలా లేనేలేదు! ఈ సీజన్‌లో కేవలం 3 మ్యాచ్‌లే ఓడిన నైట్‌రైడర్స్ ఎవరికి సాధ్యం కానీ 9 విజయాల్ని సాధించి పాయింట్ల పట్టికలో 'టాప్'లో నిలిచింది. అటు బౌలింగ్, బ్యాటింగ్‌లో సమతూకంగా ఉన్న కేకేఆర్ రెండో క్వాలిఫయర్‌దాకా చాన్స్ తీసుకోకుండా ఫైనల్ బెర్త్ సాధించాలని ఆశిస్తోంది.

సన్ తుఫాన్‌కు ఎదురేది?



సన్‌రైజర్స్ కొట్టిన కొట్టుడు... దంచిన దంచుడు... 200 పైచిలుకు లక్ష్యమైనా మాకేంటని ఛేదించిన వైనం చూస్తే హైదరాబాద్‌కు ఎదురు నిలవడం ఏ జట్టుకైనా కష్టమే! దంచేసే ఓపెనర్ హెడ్ డకౌటైన గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 215 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలోనే ఛేదించి టాప్–2లోకి దూసుకొచ్చింది. అభిషేక్ శర్మ, ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, క్లాసెన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లకు పదేపదే చుక్కలు చూపిస్తున్నారు. ఈ జట్టు బలం బ్యాటింగే! అయితే నిలకడ లేని బౌలింగ్‌తోనే అసలు సమస్యంతా! బౌలర్ల వైఫల్యం వల్లే 277/3, 287/3, 266/7 లాంటి రికార్డు స్కోర్లు నమోదు చేసినా భారీ తేడాతో ఏ మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. కెప్టెన్ కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ సహా బౌలర్లంతా కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తేనే సన్‌రైజర్స్‌కు విజయం సులువవుతుంది.

ఫైట్ రైడర్స్

ఫిల్ సాల్ట్–సునీల్ నరైన్ ఓపెనింగ్ జోడీ మెరుపులతో కోల్‌కతా నైట్‌రైడర్స్ కాస్తా ఫైట్‌రైడర్స్‌గా మారింది. కీలకమైన మ్యాచ్‌లో సాల్ట్ (స్వదేశానికి తిరుగుముఖం) లేకపోయినప్పటికీ బ్యాటింగ్ బలం ఏమాత్రం తగ్గలేదు. ఎందుకంటే వెంకటేశ్ అయ్యర్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నితీశ్ రాణా, రసెల్, రింకూ సింగ్, రమణ్‌దీప్ ఇలా ఎనిమిదో వరుస వరకు తిరుగులేని బ్యాటింగ్ లైనప్ ఉన్న జట్టు కోల్‌కతా. ప్రత్యేకించి రసెల్, రింకూ, రమణ్‌దీప్‌లైతే స్పెషలిస్టు హిట్టర్లు. టాప్–3 విఫలమైన ప్రతీసారీ జట్టును నడిపించారు. బౌలింగ్‌లో అనుభవజ్ఞుడైన స్టార్క్, నరైన్, రసెల్‌లతో పాటు హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తిలు నైట్‌రైడర్స్ విజయాల్లో భాగమవుతున్నారు. ఇక నైట్‌రైడర్స్ మ్యాచ్ ఆడి పది రోజులవుతోంది. ఈ నెల 11న ముంబై ఇండియన్స్‌పై మొదట 157/7 స్కోరే చేసినా... ప్రత్యర్థిని 139/8కు కట్టడి చేసి 18 పరుగులతో గెలిచింది. తర్వాత గుజరాత్, రాజస్తాన్‌లతో జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షంతో రద్దయ్యాయి. దీంతో ఆటగాళ్లంతా 'మ్యాచ్ ఆకలి' మీదున్నారు. తప్పకుండా ఇరుజట్ల మధ్య హోరాహోరీ సమరం గ్యారంటీ!

26 ఐపీఎల్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ జట్లు ముఖాముఖిగా 26 సార్లు తలపడ్డాయి. 17 మ్యాచ్‌ల్లో నైట్‌రైడర్స్... 9 మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ గెలుపొందాయి. ఈ సీజన్‌లో ఈ రెండు జట్లు ఒకసారి పోటీపడగా నైట్‌రైడర్స్ నాలుగు పరుగుల తేడాతో నెగ్గింది. నైట్‌రైడర్స్‌పై సన్‌రైజర్స్ అత్యధిక స్కోరు 228, అత్యల్ప స్కోరు 116 కాగా... సన్‌రైజర్స్‌పై నైట్‌రైడర్స్ అత్యధిక స్కోరు 208, అత్యల్ప స్కోరు 101.

జట్లు (అంచనా)

హైదరాబాద్: కమిన్స్ (కెప్టెన్), హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్ రెడ్డి, క్లాసెన్, షహబాజ్, సమద్, సన్వీర్, భువనేశ్వర్, విజయకాంత్, నటరాజన్. **కోల్‌కతా:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నరైన్, గుర్బాజ్, వెంకటేశ్, నితీశ్ రాణా, రింకూ సింగ్, రసెల్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్ రాణా, వరుణ్, అనుకుల్/వైభవ్.

పిచ్, వాతావరణం

నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఆరు మ్యాచ్‌ల్ని పరిశీలిస్తే... పిచ్ బౌలర్లకు, బ్యాటర్లకు సమాన అవకాశాలు కల్పించింది. మూడు మ్యాచ్‌ల్లో 200 పైచిలుకు స్కోర్లు నమోదయ్యాయి. తక్కువ స్కోర్ల మ్యాచ్ (గుజరాత్ 89 ఆలౌట్: ఢిల్లీ 92/4) కూడా ఇక్కడే నమోదైంది. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

శభాష్ దీప్తి...

ప్రపంచ రికార్డుతో పసిడి పతకం | 400 మీటర్లలో విశ్వ విజేతగా తెలంగాణ అమ్మాయి



కోబే (జపాన్): ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్, తెలంగాణకు చెందిన దీప్తి జివాంజి పసిడి పతకంతో మెరిసింది. ప్రపంచ రికార్డుతో ఆమె స్వర్ణం సొంతం చేసుకోవడం విశేషం. సోమవారం జరిగిన మహిళల 400 మీటర్ల (టి20 కేటగిరీ) పరుగును దీప్తి 55.07 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది ఈ ఈవెంట్‌లో అమెరికాకు చెందిన బ్రియానా క్లార్క్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డు (55.12 సెకన్లు)ను దీప్తి బద్దలు కొట్టింది. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ పోటీల్లో 56.18 సెకన్లతో రేసును ముగించిన 20 ఏళ్ల దీప్తి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ ఖాతాలో 4 పతకాలు ఉండగా, శనివారం వరకు పోటీలు జరుగుతాయి.



పేదరికం నుంచి పైకెగసి...

పారా అథ్లెటిక్స్‌లో టి20 కేటగిరీ అంటే 'మేధోలోపం' ఉన్న ప్లేయర్లు పాల్గొనే ఈవెంట్. ఆమె స్వస్థలం వరంగల్ జిల్లా కల్లెడ. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి రోజూవారీ కూలీలు. ఒకవైపు పేదరికం ఉండగా, మరో వైపు దీప్తిని 'బుద్ధిమాంద్యం' ఉన్న అమ్మాయిగా ఊర్లో అందరూ హేళన చేసేవారు. ఇలాంటి సమయంలో భారత అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ ఆమెకు అన్ని విధాలా అండగా నిలిచారు. ఒక స్కూల్ మీట్‌లో దీప్తి రన్నింగ్ ప్రతిభ గురించి తన మిత్రుడి ద్వారా ఆయనకు తెలిసింది. దాంతో రమేశ్ ఆ అమ్మాయిని హైదరాబాద్‌కు రప్పించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) శిక్షణా కేంద్రంలో కోచింగ్ అందించే ఏర్పాట్లు చేశారు. మానసికంగా కొంత బలహీనంగా ఉండటంతో ఆమెకు శిక్షణ ఇవ్వడంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా 'మైత్రా ఫౌండేషన్'తో కలిసి ఆర్థికంగా సహకారం అందించారు. తన ప్రతిభ కారణంగా కెరీర్ ఆరంభంలో ఆమె అందరూ పాల్గొనే సాధారణ అథ్లెటిక్స్ ఈవెంట్లలోనూ పోటీ పడి విజయాలు సాధించడం విశేషం. 2019 ఆసియా అండర్–18 చాంపియన్‌షిప్‌లో కాంస్యం, 2021 సీనియర్ నేషనల్స్‌లో కాంస్యం సాధించిన దీప్తి 2022లో చివరిసారిగా రెగ్యులర్ పోటీల బరిలోకి దిగింది. రెండు అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనడం ద్వారా దీప్తికి 'పారా క్రీడల' లైసెన్స్ లభించింది. దాంతో పూర్తిగా పారా పోటీలపైనే ఆమె దృష్టి పెట్టింది. గత ఏడాది జరిగిన గ్వాంగ్జూ ఆసియా పారా క్రీడల్లో 400 మీటర్ల ఈవెంట్‌లోనే దీప్తి స్వర్ణం గెలుచుకుంది. ఆర్థిక సమస్యలతో ఒకదశలో తమ భూమిని అమ్ముకున్న తల్లిదండ్రులు దీప్తి 'ఆసియా' విజయం తర్వాత ప్రభుత్వం ఇచ్చిన రూ. 30 లక్షలతో మళ్లీ భూమి కొనుక్కోగలిగారు. ఇదే ప్రపంచ రికార్డు జోరులో మున్ముందు పారా ఒలింపిక్స్‌లో పతకాలు సాధించగల సత్తా దీప్తిలో ఉంది.


కోచ్ నాగపురి రమేశ్‌తో...

జ్యోతిక శ్రీ బృందానికి స్వర్ణం

ఆసియా 4x400 మిక్స్‌డ్ రిలేలో భారత జట్టు జాతీయ రికార్డు



అమోజ్ జేకబ్, శుభ, జ్యోతిక శ్రీ, అజ్మల్

బ్యాంకాక్: ఆసియా రిలే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అజ్మల్, దండి జ్యోతిక శ్రీ, అమోజ్ జేకబ్, శుభాలతో కూడిన భారత బృందం మిక్స్‌డ్ రిలే 4x400 మీటర్ల విభాగంలో స్వర్ణ పతకం గెలిచింది. భారత బృందం 3 నిమిషాల 14.12 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో గత ఏడాది ఆసియా క్రీడల్లో 3 నిమిషాల 14.34 సెకన్లతో నెలకొల్పిన జాతీయ రికార్డు తెరమరుగైంది. భారత్‌కు బంగారు పతకం దక్కడంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతిక శ్రీ కీలకపాత్ర పోషించింది. ఈ ప్రదర్శనతో భారత బృందం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 21వ స్థానానికి చేరుకుంది. జూన్ 30వ తేదీలోపు భారత బృందం టాప్–16లోకి చేరితే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుంది.

సినిమా


● ఎన్టీఆర్

ఆగస్టులో ఆరంభం

హీరో ఎన్టీఆర్, 'కేజీఎఫ్, సలార్' మూవీ చిత్రాల ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం ('ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్) ఆగస్టులో ఆరంభం కానుంది. సోమవారం (మే 20) ఎన్టీఆర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రం అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. 'ఎన్టీఆర్ నీల్' మూవీ షూటింగ్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ''భారీ యాక్షన్ మూవీగా 'ఎన్టీఆర్ నీల్' రూపొందనుంది. ప్రశాంత్ నీల్ ఈ సినిమా స్క్రిప్ట్‌ను ఫైనల్ చేస్తున్నారు. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని దాన్ని మరో రేంజ్‌కు తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు ప్రశాంత్ నీల్. ఎన్టీఆర్–ప్రశాంత్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమా ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అద్భుతమైన మహిళలకు ధన్యవాదాలు

''సినిమాల్లో ఉండే మహిళలను కొనియాడటం ఓ మరపు రాని అనుభూతి. ఈ సాయంత్రం ఇంత హ్యాపీగా ఈ వేడుక చేసుకోవడానికి కారణమైన అద్భుతమైన మహిళా నిర్మాతలు, నటీమణులకు, దర్శకులకు కృతజ్ఞతలు. ఈ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు'' అని నటి అమీ జాక్సన్ అన్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కాన్స్ చిత్రోత్సవాల్లో అమీ జాక్సన్ 'ఉమెన్ ఇన్ సినిమా గాలా'కు హాజరయ్యారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా అమీ ఈ విధంగా స్పందించారు. తెలుపు రంగు సూట్‌లో ఆమె హుందాగా అగుపించారు. ఇంకా బాలీవుడ్ నుంచి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఈ వేడుకలకు హాజరయ్యారు. బంగారు వర్ణం గౌనులో జాక్వెలిన్ ఎర్ర తివాచీపై క్యాట్ వాక్‌తో కనువిందు చేశారు.

- అమీ జాక్సన్

కాన్స్‌లో కన్నప్ప టీమ్: విష్ణు మంచు టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను ఈ నెల 20న కాన్స్ చిత్రోత్సవాల్లో ఆవిష్కరించనున్నట్లు విష్ణు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా, విష్ణు భార్య విరానికా కాన్స్ చిత్రోత్సవాలకు హాజరు అయ్యారు.


● జాక్వెలిన్ ఫెర్నాండెజ్
● అమీ జాక్సన్

వినాయక చవితి చుట్టూ...

''గం గం గణేశా' దర్శకుడు ఉదయ్ నా వద్ద పని చేశాడు. అంకితభావం, కష్టపడే తత్వం ఉన్న అతనికి ఈ సినిమా తప్పకుండా సక్సెస్ ఇవ్వాలి'' అని రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతీ శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గం..గం..గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో విజయేంద్ర ప్రసాద్, దర్శకులు వంశీ పైడిపల్లి, సాయి రాజేశ్ అతిథులుగా పాల్గొన్నారు. ''గం గం గణేశా'ని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు వంశీ కారుమంచి, కేదార్ సెలగంశెట్టి. ''వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమా రూపొందించాం'' అన్నారు ఉదయ్ శెట్టి. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''గం గం గణేశా'లో తొలిసారి ఎనర్జిటిక్ క్యారెక్టర్ చేశాను'' అన్నారు.


● నయన్ సారిక, ఆనంద్ దేవరకొండ

మాస్ తథాస్తు


● రామ్ తేజ్, భానుచందర్

రామ్ తేజ్ హీరోగా భానుచందర్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'తథాస్తు'. కన్నా నాగరాజు సమర్పణలో తోట వెంకట నాగేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ వేడుక సోమవారం జరిగింది. డైరెక్టర్ చంద్రమహేశ్, నిర్మాత దామోదర ప్రసాద్ ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేసి, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. భానుచందర్ మాట్లాడుతూ– ''తథాస్తు'లో వినోదం, భావోద్వేగాలు ఉన్నాయి'' అన్నారు. ''కంప్లీట్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'తథాస్తు' రూపొందుతోంది. మా బ్యానర్‌లో రూపొందిన 'మల్లె మొగ్గ' సినిమా ఇటీవల విడుదలవగా మంచి ఆదరణ వస్తోంది'' అన్నారు దర్శక–నిర్మాత తోట వెంకట నాగేశ్వరరావు. ''నన్ను హీరోని చేసిన మా మావయ్య వెంకట నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు'' అన్నారు రామ్ తేజ్.

పవర్‌ఫుల్ రోల్


● మనోజ్ మంచు

''మిరాయ్'లో పవర్‌ఫుల్ పాత్ర చేస్తుండడం సవాల్‌గా ఉంది. ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్‌తో మళ్లీ ఇండస్ట్రీకి రావడం ఎగ్జయిటింగ్‌గా, సంతోషంగానూ ఉంది'' అని మనోజ్ మంచు అన్నారు. 'హనుమాన్' మూవీ ఫేమ్ తేజ సజ్జ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రితికా నాయక్ కథానాయికగా, మనోజ్ మంచు కీలక పాత్రలో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. సోమవారం (మే 20) మనోజ్ మంచు పుట్టినరోజు సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ది బ్లాక్ స్వోర్డ్‌గా ఇంటెన్స్, పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు మనోజ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత వెండితెరకి వస్తున్నాను. ఈ చిత్రం రెండు భాగాలుగా వస్తుంది. తొలి భాగం 2025 ఏప్రిల్ 18న రిలీజ్ అవుతుంది'' అన్నారు. ''మిరాయ్'లో మనోజ్ అన్న భాగం కావడం అదృష్టం'' అన్నారు కార్తీక్ ఘట్టమనేని. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి, సంగీతం: గౌర హరి.

గాడ్ పవర్?


● సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్

'రామాయణ్' టైటిల్ 'గాడ్ పవర్'గా మారిందా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి రాముడు, సీత పాత్రల్లో నితీష్ తివారీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం గురించి ఇప్పటివరకూ యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రామాయణం ఆధారంగా 'రామాయణ్' టైటిల్‌తో తెరకెక్కిస్తున్నారని వార్తలు వచ్చాయి. అలాగే సీతారాముల గెటప్స్‌లో సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్ ఉన్న ఫొటోలు లీక్ అయి, వైరల్‌గా మారాయి. ముంబైలో చడీ చప్పుడూ లేకుండా కొన్ని రోజుల క్రితం ఈ చిత్రం షూటింగ్ ఆరంభించారు. ఆ లొకేషన్లోని రణ్‌బీర్, సాయి పల్లవి ఫొటోలే బయటికొచ్చాయి. కాగా.. ఈ చిత్రానికి 'రామాయణ్' టైటిల్‌కి బదులు 'గాడ్ పవర్' అనే టైటిల్ ఫిక్స్ చేయాలని యూనిట్ అనుకుంటోందనే వార్త ప్రచారంలో ఉంది.

ఫ్యాంటసీ టుక్ టుక్

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ సి. కృష్ణ దర్శకత్వంలో రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాముల రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్ విడుదలైంది. ''ఒక గ్రామం నేపథ్యంలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో సాగే చిత్రం ఇది. ఈ కథలో ఓ ఆటోకి ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇచ్చే చిత్రంగా రూపొందించాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, కెమెరా: హార్దిక్ శ్రీకుమార్.


● 'టుక్ టుక్' పోస్టర్

అందమైన ప్రయాణం ఆరంభం

''**మా** జీవితంలో మరో అందమైన ప్రయాణం ఆరంభమైంది'' అంటూ బాలీవుడ్ దర్శక–నిర్మాత, రచయిత ఆదిత్య ధర్ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. నటి యామీ గౌతమ్, ఆదిత్య ధర్ 2021లో పెళ్లి చేసుకున్నారు. ఈ నెల 10న యామీ ఒక మగబిడ్డకు జన్మనిచ్చారు. తమ కుమారుడికి 'వేదవిద్' అని పేరు పెట్టినట్లు ప్రకటించి, పై విధంగా పేర్కొన్నారు ఆదిత్య ధర్. ''మా కుమారుడు ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు మాకు, దేశానికి గర్వకారణంగా నిలిచేలా ఎదగాలని ఆశిస్తున్నాం'' అని కూడా ఆదిత్య ధర్ పేర్కొన్నారు. ఇక యామీ గౌతమ్ విషయానికొస్తే.. తెలుగులో 'నువ్విలా' ఆమె తొలి చిత్రం. ఆ తర్వాత 'గౌరవం, యుద్ధం, కొరియర్ బాయ్ కల్యాణ్' (2015) వంటి చిత్రాల్లో నటించారు. 'కొరియర్ బాయ్...' తర్వాత వేరే తెలుగు చిత్రాల్లో నటించలేదు. హిందీ చిత్రాలతో బిజీ అయ్యారు.


● యామీ గౌతమ్, ఆదిత్య ధర్

యాక్షన్ ఎంటర్‌టైనర్

శివ కంఠంనేని లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బిగ్ బ్రదర్'. ప్రియా హెగ్డే హీరోయిన్. గోసంగి సుబ్బారావు డైరెక్టర్. జి. రాంబాబు యాదవ్ సమర్పణలో కె. శివశంకర్ రావు, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం' ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నటులు మురళీ మోహన్, అశోక్ కుమార్, నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ పాల్గొన్నారు. ''భోజ్‌పురి పరిశ్రమకు వెళ్లి 15 సినిమాలు చేశాను. చాలా రోజుల తర్వాత తెలుగులో 'బిగ్ బ్రదర్'తో రీ ఎంట్రీ ఇవ్వడం ఎగ్జయిటింగ్‌గా ఉంది'' అన్నారు గోసంగి సుబ్బారావు. ''బిగ్ బ్రదర్'లో నటించడం గర్వంగా ఉంది'' అన్నారు శివ కంఠంనేని. 'యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ను ఇష్టపడేవారిని మా మూవీ అలరిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


● శివ కంఠంనేని

సాక్షి బిజినెస్
మంగళవారం
21-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	89	74,006
నిఫ్టీ ▲	36	22,502

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	16,788	▲	102
డోజోన్స్	39,890	▼	113
ఎఫ్‌టీఎస్ఈ 100	8,424	▲	4
డాక్స్	18,769	▲	65
షాంఘై	3,171	▲	17
నికాయ్	39,070	▲	282

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.57	107.12
€	యూరో	ఎస్‌బీఐ	89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.06	54.23
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.76	56.70
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.54	64.19
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.08	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.48

ఫ్లిప్‌కార్ట్ నుంచి ఐరిస్ ప్లాట్‌ఫాం

న్యూఢిల్లీ: ఈ–కామర్స్ కంపెనీ ఫ్లిప్‌కార్ట్ తాజాగా ఐరిస్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. కస్టమర్ల కొనుగోళ్ల ధోరణులు, మార్కెట్లో ట్రెండ్ల గురించి, వ్యాపార పనితీరును మెరుగుపర్చుకునేందుకు తీసుకోదగిన చర్యలు మొదలైన వాటి గురించి బ్రాండ్లు తెలుసుకునేందుకు ఇది సహాయపడుతుంది. దీనితో కంపెనీలు డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవచ్చని, అమ్మకాలు మెరుగుపర్చుకోవచ్చని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.

వృద్ధి 6.2%: ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: భారత్ మార్చితో గడచిన ఆర్థిక సంవత్సరంలో (2023–24) 6.9– 7.0 శాతం శ్రేణిలో వృద్ధి సాధిస్తుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనావేసింది. మార్చి త్రైమాసికంలో 6.2 శాతం వృద్ధి నమోదవుతుందని సంస్థ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ సునీల్ కుమార్ సిన్హా పేర్కొన్నారు. మే 31న అధికారిక గణాంకాల నేపథ్యంలో తాజా అంచనాలను సంస్థ వెలువరించింది. 2023–24 తొలి మూడు త్రైమాసికాల్లో 8.2 శాతం, 8.1 శాతం, 8.4 శాతం వృద్ధి రేట్లు నమోదయిన సంగతి తెలిసిందే.

పెట్ ఫుడ్ వ్యాపారంలోకి గ్రోవెల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆక్వాకల్చర్ ఫీడ్స్ సంస్థ గ్రోవెల్ తాజాగా పెంపుడు జంతువుల పౌష్టికాహార విభాగంలో విస్తరిస్తోంది. దీనిపై వచ్చే 5–7 ఏళ్లలో రూ. 80–100 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ఎంఎస్ఆర్ కార్తీక్ తెలిపారు. వివిధ ఉత్పత్తులవ్యాప్తంగా తమకు తెలుగు రాష్ట్రాల్లో నాలుగు ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో రెండు సిద్ధమవుతున్నాయని చెప్పారు. గ్రూప్ స్థాయిలో రూ. 2,000 కోట్ల పైచిలుకు టర్నోవరు ఉన్నట్లు కార్తీక్ వివరించారు. 20 పైగా దేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా పెట్ ఫుడ్స్ విభాగం 2027 నాటికి బిలియన్ డాలర్ల స్థాయికి పెరుగుతుందన్న అంచనాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇందులో బిస్కెట్లు మొదలైన ట్రీట్స్ సెగ్మెంట్ ప్రస్తుతం రూ. 650 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు చేరగలదని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	550-00
చిత్తూరు	628-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00

యూఎస్ జెనరిక్స్ మార్కెట్లో భారత్ హవా

- 47 శాతం వాటాతో అగ్రస్థానం
- 219 బిలియన్ డాలర్ల పొదుపు
- ఇక్వియా ఇన్‌స్టిట్యూట్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జెనరిక్ ఔషధ రంగంలో భారత కంపెనీల హవా కొనసాగుతోంది. 2022లో వైద్యుల సిఫార్సు మేరకు యూఎస్‌లో రోగులు వినియోగించిన మొత్తం జెనరిక్స్‌లో 47 శాతం భారతీయ కంపెనీలు సరఫరా చేశాయి. ఔషధాల పరిమాణం పరంగా భారత్ తొలి స్థానంలో నిలిచింది. ఇక్వియా నేషనల్ ప్రిస్క్రిప్షన్ ఆడిట్ ప్రకారం.. అందుబాటు ధరలో జెనరిక్ మందుల సరఫరాలో భారతీయ కంపెనీలు తమ సత్తా చాటుతున్నాయి. ప్రభుత్వ బీమా కార్యక్రమాలు, ప్రైవేట్ బీమా కంపెనీలు ఔషధాల కోసం చెల్లించిన మొత్తంలో.. భారతీయ ఫార్మా కంపెనీలు అందించిన మందులు సగానికంటే అధికంగా ఉండడం గమనార్హం. యూఎస్ సంస్థలు 30 శాతం వాటాతో రెండవ స్థానం సంపాదించాయి. మధ్యప్రాచ్య దేశాలు 11 శాతం, యూరప్ 5, కెనడా 3, చైనా 2, ఇతర దేశాల కంపెనీలు 2 శాతం జెనరిక్స్ సరఫరా చేశాయి.

50 శాతంపైగా మన కంపెనీలవే..

చికిత్సల పరంగా చూస్తే మానసిక రుగ్మతలకు వినియోగించిన మందుల్లో భారతీయ కంపెనీలు సరఫరా చేసినవి ఏకంగా 62 శాతం ఉన్నాయి. హైపర్‌టెన్షన్ 60 శాతం, లిపిడ్ రెగ్యులేటర్స్ 58, యాంటీ అల్సర్స్ 56, నరాల సంబంధ చికిత్సలకు 55 శాతం మందులు భారత్ నుంచి సరఫరా అయినవే కావడం విశేషం.

మధుమేహ సంబంధ ఔషధాల్లో భారత్ వాటా 21 శాతంగా ఉంది. ఇక బయోసిమిలర్స్ సరఫరాలో మూడవ స్థానంలో ఉన్న భారత సంస్థల వాటా ప్రస్తుతం 15 శాతంగా ఉంది. యూఎస్ 56 శాతం, కొరియా 18, యూరప్ 11 శాతం బయోసిమిలర్స్ సరఫరా చేశాయి.

భారతీయ కంపెనీలు సరఫరా చేసిన జెనరిక్ మందుల కారణంగా 2022లో యూఎస్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ 219 బిలియన్ డాలర్ల మేర పొదుపు చేయగలిగింది. 2013 నుంచి 2022 మధ్య మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్లు ఆదా అయ్యాయని ఇక్వియా నేషనల్ ప్రిస్క్రిప్షన్ ఆడిట్ నివేదిక పేర్కొంది. భారతీయ కంపెనీల నుండి వచ్చే జెనరిక్ ఔషధాలతో వచ్చే ఐదేళ్లలో అదనంగా 1.3 ట్రిలియన్ డాలర్ల పొదుపు అవుతుందని అంచనా.

మరో 1.3 ట్రిలియన్ డాలర్లు..

భారత్–యూఎస్ మధ్య బలమైన ఫార్మా వాణిజ్య భాగస్వామ్యం కోసం రెండు దేశాలు ఔషధ ముడిపదార్థాలకై విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి ఔషధ స్థితిస్థాపకతను సాధించాలని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) ఇటీవల కోరింది. ఔషధాల రంగంలో ఇరు దేశాలు కలిసి వచ్చి అగ్రిగేటర్‌గా మారాలి అని ఐపీఏ అభిప్రాయపడింది. 70 శాతం యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ చైనా నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్నాయి.

సానుకూల సంకేతాలు

ఈ వారం మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల అంచనా



ముంబై: ట్రేడింగ్ నాలుగు రోజులే జరిగే ఈ వారంలోనూ ఎన్నికల అప్రమత్తత కొనసాగే వీలుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. చివరి దశ కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు, ప్రపంచ పరిణామాలు, స్థూల ఆర్థిక గణాంకాలు, విదేశీ ఇన్వెస్టర్ల తీరుతెన్నులు స్టాక్ సూచీలకు దిశానిర్దేశం చేస్తాయంటున్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ, క్రూడాయిల్ ధరలూ ట్రేడింగ్ ప్రభావితం చూపొచ్చంటున్నారు. ఇక ప్రాథమిక మార్కెట్లో అవఫిస్ స్పేస్ సొల్యూషన్స్ ఐపీఓ బుధవారం ప్రారంభం కానుంది. ఇటీవల పబ్లిక్ ఇష్యూ పూర్తి చేసుకున్న గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ షేర్లు గురువారం ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి.

''అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి. ఇది దేశీయ ఈక్విటీ మార్కెట్‌కు కలిసొచ్చే అంశం. అయితే ఎన్నికల సంబంధిత పరిణామాల వార్తలు, కార్పొరేట్ ఆర్థిక ఫలితాల ప్రకటన నేపథ్యంలో ఒడిదుడుకుల ట్రేడింగ్ కొనసాగొచ్చు. నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 22,500 స్థాయిని నిలుకోగలిగితే జీవితకాల గరిష్టాన్ని (22,795) పరీక్షించవచ్చు. అమ్మకాలు నెలకొంటే 22,200 వద్ద మరో కీలక మద్దతు ఉంది'' అని నిపుణులు తెలిపారు. ఇక ఈ వారంలో దాదాపు 200 కి పైగా కంపెనీలు తమ క్యూ4 ఫలితాలు ప్రకటించనున్నాయి. ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా యాజమాన్య వ్యాఖ్యలు కీలకం కానున్నాయి. అమెరికా ఆర్థిక పరిణామాలు భారత్ మార్కెట్‌పై ప్రభావం చూపనున్నాయి.

కార్యకలాపాల విస్తరణలో నెక్స్ట్‌వేవ్

NXT WAVE

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే ఎడ్‌టెక్ సంస్థ నెక్స్ట్‌వేవ్ కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ ఏడాది ఆఫ్‌లైన్ మాధ్యమంలోకి ప్రవేశిస్తోంది. హైదరాబాద్ క్యాంపస్‌లో తొలి బ్యాచ్‌లో 750 మంది విద్యార్థులకు శిక్షణనివ్వనున్నట్లు సంస్థ సీఈవో రాహుల్ అట్లులూరి తెలిపారు. ప్లస్‌టు తర్వాత విద్యార్థులు ఇటు పరిశ్రమకు అవసరమైన టెక్ నైపుణ్యాలను నేర్చుకుంటూ అటు నాలుగేళ్ల వ్యవధి డిగ్రీ పట్టా కూడా పొందే విధంగా బిట్స్ పిలానీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఆయన వివరించారు. వచ్చే ఏడాది నాటికి బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో 10 క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాహుల్ చెప్పారు. ప్రస్తుతం తమ సిబ్బంది సంఖ్య 1,400గా ఉండగా, దీన్ని 3,000కు పెంచుకోనున్నట్లు వివరించారు. గడిచిన మూడేళ్లలో సుమారు రూ. 295 కోట్ల నిధులు సమకూర్చుకున్నట్లు రాహుల్ తెలిపారు.

వర్ల్‌పూల్ లాభం 25 శాతం అప్..



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కన్జూమర్ డ్యూరబుల్స్ తయారీ సంస్థ వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన సుమారు 25 శాతం పెరిగి రూ. 79.5 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో ఇది రూ. 64 కోట్లు. సమీక్షాకాలంలో ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 1,734 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను నికర లాభం రూ. 224 కోట్లుగా, ఆదాయం రూ. 6,830 కోట్లుగా నమోదైంది. షేరు ఒక్కింటికి రూ. 5 చొప్పున కంపెనీ డివిడెండ్ ప్రకటించింది.

ఇండియా సిమెంట్స్ నష్టాలు తగ్గాయ్



క్యూ4లో రూ. 50 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ ఇండియా సిమెంట్స్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా తగ్గి రూ. 50 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 250 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,486 కోట్ల నుంచి రూ. 1,267 కోట్లకు క్షీణించింది. ఈ కాలంలో సిమెంట్, క్లింకర్ అమ్మకాల పరిమాణం 24.36 లక్షల టన్నులుగా నమోదైంది. సిమెంట్ విక్రయ ధరలు నీరసించినప్పటికీ భూమి విక్రయం ద్వారా రూ. 24 కోట్ల నగదు లాభం ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది. మొత్తం వ్యయాలు రూ. 1,638 కోట్ల నుంచి రూ. 1,352 కోట్లకు తగ్గాయి. ఇక పూర్తి ఏడాదికి రూ. 216 కోట్ల నికర నష్టం ప్రకటించింది. 2022–23లో రూ. 170 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 5,608 కోట్ల నుంచి రూ. 5,112 కోట్లకు వెనకడుగు వేసింది.

ఆయిల్ ఇండియా బోనస్ షేర్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఆయిల్ ఇండియా లిమిటెడ్(ఓఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 13 శాతం పైగా వృద్ధితో రూ. 2,028 కోట్లను దాటింది. కంపెనీ చరిత్రలోనే ఇది ఒక క్వార్టర్‌కు అత్యధికంకాగా.. చమురు ధరలు బలపడటం, ఉత్పత్తి పుంజుకోవడం ఇందుకు సహకరించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం మరింత అధికంగా 18 శాతం ఎగసి రూ. 2,333 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 1,980 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. వాటాదారులకు 1:2 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీకి బోర్డు అనుమతించింది. దీంతో ప్రతీ 2 షేర్లకు 1 షేరు ఉచితంగా లభించనుంది. అంతేకాకుండా ప్రతీ షేరుకి రూ. 3.75 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. బోనస్ తదుపరి రూ. 2.5గా డివిడెండ్ వర్తించనుంది. ఇక క్యూ4లో మొత్తం ఆదాయం సైతం 16 శాతం పుంజుకుని రూ. 10,375 కోట్లను అధిగమించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఓఐఎల్ నికర లాభం 29 శాతం క్షీణించి రూ. 6,980 కోట్లకు పరిమితమైంది. చట్టబద్ధ నిబంధనలకు అనుగుణంగా ప్రొవిజన్లు చేపట్టడం లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది.

ఐఆర్‌ఎఫ్‌సీ లాభం హైజంప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్‌ఎఫ్‌సీ) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 34 శాతం జంప్ చేసి రూ. 1,717 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,285 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 0.7 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 6,230 కోట్ల నుంచి రూ. 6,478 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు రూ. 4,945 కోట్ల నుంచి రూ. 4,761 కోట్లకు తగ్గాయి. ఈ ఏడాది(2024–25) దేశ, విదేశీ మార్కెట్ల నుంచి రూ. 50,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. వివిధ రకాల బాండ్లు, ప్రయివేట్ ప్లేస్‌మెంట్ తదితర మార్గాలలో నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏ, అశోక్‌నగర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

తెలంగాణ ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని.. వరంగల్ జిల్లా అశోక్ నగర్‌లోని తెలంగాణ ట్రైబల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమీ ఫర్ మెన్ (టీటీడబ్ల్యూఆర్ఏఎఫ్‌పీఏ) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 80
» **సీట్ల వివరాలు:** బీఎస్సీ(ఎంపీసీ)–40 సీట్లు, బీఏ(హెచ్ఈపీ)–40 సీట్లు.
» **కోర్సు వ్యవధి:** మూడేళ్లు.
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి 60 శాతం మార్కులతో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన పురుష విద్యార్థులు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ ప్రాంతం), రూ.1,50,000(గ్రామీణ ప్రాంతం) మించకూడదు. » **వయసు:** 01.07.2024 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 10.05.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.05.2024
» **వెబ్‌సైట్:** https://www.ttwrdcs.ac.in

ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్-2024

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ).. దేశవ్యాప్తంగా ఐదు ప్రాంతీయ విద్యా సంస్థ(ఆర్ఐఈ)ల్లో వివిధ ఉపాధ్యాయ విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎన్‌సీఈఆర్‌టీ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **ఆర్ఐఈ ఉన్న ప్రాంతాలు:** అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.

కోర్సులు-ఆర్ఐఈ క్యాంపస్ వివరాలు

» బీఎస్సీ బీఈడీ (నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు) –భువనేశ్వర్, మైసూరు.
» బీఏ బీఈడీ(నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్)–భువనేశ్వర్, మైసూరు.
» ఎంఎస్సీఈడీ(ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్)–మైసూరు.
» బీఈడీ(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్, షిల్లాంగ్.
» బీఈడీ–ఎంఈడీ(మూడేళ్లు)–భోపాల్.
» ఎంఈడీ(రెండేళ్లు)–అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూర్.
» **అర్హత:** కోర్సును అనుసరించి 10+2/హయ్యర్ సెకండరీ/సీనియర్ సెకండరీ, డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, కౌన్సిలింగ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 16.06.2024.
» **బీఎస్సీ బీఈడీ, బీఏ బీఈడీ, ఎంఎస్సీఈడీ పరీక్ష ఫలితాల వెల్లడి తేది:** 05.07.2024.
» **బీఈడీ, ఎంఈడీ పరీక్ష ఫలితాల ప్రకటన తేది:** 10.07.2024.
» **వెబ్‌సైట్:** https://cee.ncert.gov.in

టీఎస్ సీపీజీఈటీ-2024

తెలంగాణ రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు, మహిళా విశ్వవిద్యాలయాలు, జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం సీపీజీఈటీ–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు:** ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంఎల్ఐబీఎస్సీ, బీఎల్ఐబీఎస్సీ.
» **ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు:** బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎకనామిక్స్, ఐఎంబీఏ.
» **పీజీ డిప్లొమా కోర్సులు:** చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సిలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్.
» **అర్హత:** పీజీ కోర్సులకు డిగ్రీలో కనీసం 40 శాతం మార్కులు, బీఈడీ/బీపీఈడీ కోర్సులకు డిగ్రీలో 55 శాతం మార్కులు, ఇంటిగ్రేటెడ్ కోర్సులకు 10+2/ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ రూల్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ప్రవేశ పరీక్ష:** సంబంధిత సబ్జెక్ట్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా నిర్వహిస్తారు.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 18.05.2024.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది:** 17.06.2024.
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 25.06.2024. » **రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 30.06.2024.
» **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేది:** 05.07.2024.
» **వెబ్‌సైట్:** https://cpget.tsche.ac.in

డిగ్రీతో.. డిఫెన్స్ కొలువులు



సీడీఎస్ఈ (2)-2024

» సీడీఎస్ఈ (2)-2024 నోటిఫికేషన్ విడుదల
» ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లో కమిషన్డ్ ర్యాంకు పోస్టులు
» త్రివిధ దళాలకు చెందిన అయిదు అకాడమీల్లో 459 పోస్టులు
» ఎంపికైతే శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్

బ్యాచిలర్ డిగ్రీ తర్వాత.. డిఫెన్స్‌లో కొలువుల కోసం ఎదురుచూసే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! అదే.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్!! ఈ పరీక్షలో విజయం సాధించి, మలి దశలోనూ ప్రతిభ చూపితే.. త్రివిధ దళాల్లో కమిషన్డ్ ర్యాంకు హోదాతో కొలువుదీరొచ్చు! ఈ ఉద్యోగంతో త్రివిధ దళాల్లో ఉజ్వల కెరీర్‌తోపాటు దేశ సేవ చేసే ఉన్నత అవకాశం లభిస్తుంది. తాజాగా.. సీడీఎస్ఈ(2)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీడీఎస్ఈ (2) వివరాలు, ఎంపిక విధానం, వేతనాలు తదితర వివరాలు..

మొత్తం 459 పోస్టులు

త్రివిధ దళాల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు సీడీఎస్ పరీక్ష నిర్వహిస్తుంది. తాజాగా మొత్తం 459 పోస్టుల భర్తీకి సీడీఎస్ఈ (2)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఇండియన్ మిలటరీ అకాడమీ (డెహ్రాడూన్)–100 పోస్టులు, ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా) –32 పోస్టులు, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)–32 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (చెన్నై) (పురుషులు)–276 పోస్టులు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (చెన్నై) (మహిళలు)–19 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు.

అర్హతలు ఇలా

- **ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్ చదివుండాలి.

ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

వయసు

- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **నేవల్ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** జూలై 2, 2001–జూలై 1, 2005 మధ్య జన్మించి ఉండాలి. (డీజీసీఏ కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్న వారికి రెండేళ్ల సడలింపు ఇస్తారు).
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ:** జూలై 2, 2000–జూలై 1, 2006 మధ్య జన్మించి ఉండాలి.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో ఆఫీసర్ కేడర్ పోస్టుల భర్తీకి రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. వీటిలో మొదటిది.. యూపీఎస్సీ నిర్వహించే సీడీఎస్ రాత పరీక్ష. ఇందులో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించి మెరిట్ జాబితాలో నిలిస్తే.. మలి దశలో ఆయా దళాలకు చెందిన సర్వీస్ సెలక్షన్ బోర్డులు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. ఈ ప్రక్రియలోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగంలో కొలువు ఖరారవుతుంది.

రాత పరీక్ష ఇలా

- తొలిదశలో నిర్వహించే సీడీఎస్ఈ రాత పరీక్ష ఆయా విభాగాలకు వేర్వేరుగా ఉంటుంది.
- ఇండియ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాత పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కు కోత విధిస్తారు.
- ఇండియన్ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కోర్సుల పరీక్షలో ఇంగ్లిష్ వంద మార్కులకు, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ వంద మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం 2 గంటలు.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ పరీక్షలో ఇంగ్లిష్ వంద మార్కులకు, జనరల్ నాలెడ్జ్ వంద మార్కులకు నిర్వహిస్తారు. వీటికి కూడా ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం 2గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. దీనికి 300 మార్కులు కేటాయించారు. అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు పరీక్ష జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులు 6 రోజుల పాటు ఉంటాయి.
- మలి దశలో మొదట స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే స్టేజ్–2కు అనుమతిస్తారు. స్టేజ్–1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్) టెస్టులు, స్టేజ్–2లో సైకాలజీ టెస్టులు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. స్టేజ్ –1, స్టేజ్–2ల తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్ (డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. చివరగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు నిర్వహిస్తారు.

తుది దశలో ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా.. ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూను బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలోనే ఒక ప్రక్రియ కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న అభ్యర్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు.

అకాడమీలలో శిక్షణ

సీడీఎస్ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన అభ్యర్థులకు ఎంపికైన అకాడమీల్లో వేర్వేరుగా శిక్షణ ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ (డెహ్రాడూన్)లో 18 నెలలు, నేవల్ అకాడమీలో 17 నెలలు, ఎయిర్ ఫోర్స్ అకాడమీలో 18 నెలలు, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో 11 నెలలు శిక్షణ అందిస్తారు. ఈ శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్ హోదాలో పర్మనెంట్ కొలువు సొంతమవుతుంది. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్–లెఫ్టినెంట్ హోదా లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందిన వారు ప్రారంభంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా విధులు చేపడతారు. ఇలా ఆయా విభాగాల్లో అడుగుపెట్టిన వారు కొన్ని నెలలు ప్రొబేషన్‌లో ఉంటారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూన్ 4
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, జూన్ 5 – జూన్ 11
- **పరీక్ష తేదీ:** 2024, సెప్టెంబర్ 1
- **వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఇంగ్లిష్:** ఈ విభాగం వంద మార్కులకు ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ భాషపై పట్టును, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజీలు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్ టెస్టు, ఫిల్ అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ద ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి.
- **జనరల్ నాలెడ్జ్:** అభ్యర్థులకు సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహన పరీక్షించే విభాగమిది. దీనికి కూడా వంద మార్కులు కేటాయించారు. ఈ విభాగంలో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సెర్‌సైజెస్ –అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.
- **ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్:** ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. వంద మార్కులకు జరిగే విభాగం ఇది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనోమెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

చెడు అలవాట్లతో మెదడుకు చేటు..

జీవనశైలి మార్పు, దురలవాట్ల కారణంగా పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసులు

- బీపీ, షుగర్ సమస్యలపట్ల నిర్లక్ష్యంతో తీవ్ర అనర్థాలు
- మెదడు సంబంధిత వ్యాధుల బారిన యువత, మధ్య వయస్సు వారు..
- ఆరోగ్యశ్రీ కింద న్యూరో, న్యూరో సర్జరీలో 2019-20లో 26 వేల మందికి చికిత్స
- 2023-24 నాటికి 40 వేలు దాటిన కేసులు



ఆధునిక జీవనశైలి, దురలవాట్ల కారణంగా మెదడు సంబంధిత జబ్బుల బారినపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఒకప్పుడు 60 ఏళ్ల పైబడిన వారిలో వయోభారం, బీపీ, షుగర్ నియంత్రణలో లేకపోవడం తదితర కారణాలతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుండేది. అయితే, ప్రస్తుతం నమోదవుతున్న బ్రెయిన్ స్ట్రోక్ కేసుల్లో 25-30 శాతం కేసుల్లో బాధితుల వయస్సు 20-45 ఏళ్ల లోపే ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ న్యూరాలజీ విభాగం వెల్లడించిన ఒక నివేదిక ప్రకారం ఏడాది కాలంలో 300 మంది స్ట్రోక్‌తో అడ్మిట్ కాగా.. 25 శాతం మంది 21-45 ఏళ్ల వయస్సు వారేనని తేలింది. అలాగే, ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటిమంది ఈ స్ట్రోక్ బారినపడుతుండగా, వీరిలో సగం మంది మృత్యువాత పడుతున్నారు. మిగిలిన వారు శాశ్వత వికలాంగులుగా మిగిలిపోతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఇటీవల వెల్లడించింది.

– సాక్షి, అమరావతి

దురలవాట్లతో చేటు..

ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు మెదడుకు చేటుచేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ అలవాట్లను మానుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ కొందరిలో మాత్రం మార్పు రావడంలేదు. బ్రిటీష్ మెడికల్ జర్నల్ 2021లో వెల్లడించిన ఒక అధ్యయనం ప్రకారం.. ధూమపానం, మద్యపానం అలవాట్లున్న వ్యక్తులు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడటానికి 80 శాతం ఎక్కువ అవకాశాలున్నాయి. గుండె జబ్బులకు దారితీసే ప్రధాన కారకాల్లో ధూమపానం ఒకటి. గుండెపోటు కేసుల్లో 25 శాతం వరకూ ఇదే ప్రధాన కారణంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే, పొగాకులోని నికోటిన్, విషతుల్యాలు రక్తనాళాల లోపలి పొరను దెబ్బతీస్తాయి. దీంతో రక్తనాళ గోడల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోయి పూడిక ఏర్పడుతుంది. పూడిక చిట్లిపోతే హఠాత్తుగా రక్తం గడ్డకట్టి నాళం పూర్తిగా మూసుకుపోవచ్చు. ఇది గుండెపోటుకు దారితీస్తుంది. అదే విధంగా మెదడు రక్తనాళాల్లో పూడికలతో స్ట్రోక్ సంభవిస్తుంది.

ఏటా కేసుల పెరుగుదల..

బ్రెయిన్ స్ట్రోక్, ఇతర న్యూరో సంబంధిత కేసులు ఏటా పెరుగుతున్నాయి. ఇందుకు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద అందించిన చికిత్సలే నిదర్శనంగా ఉంటున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద న్యూరో, న్యూరో సర్జరీ విభాగాల్లో చికిత్స పొందిన రోగుల సంఖ్య గడిచిన ఐదేళ్లలో ఏటా వృద్ధి చెందుతూ వచ్చింది. 2019-20లో 26,023 మంది చికిత్స పొందారు. 2022-23 నాటికి ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. ఆ ఏడాది 40 వేల మందికి ప్రభుత్వం ఉచితంగా చికిత్సలు అందించింది. ఇక 2023-24లోను చికిత్స పొందిన వారి సంఖ్య 40 వేలు దాటింది.

యువతలో బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు..

- బీపీ, షుగర్ నియంత్రణలో లేకపోవడం.. ఊబకాయం ఉండటం. ప్రస్తుతం రాష్ట్రంలో 30 ఏళ్ల పైబడిన వారిలో 25 శాతం మంది బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారు.
- కొందరిలో బీపీ, షుగర్ సమస్యలు ఉన్నప్పటికీ సంబంధిత లక్షణాలు లేకపోవడంతో బయటకు తెలీడంలేదు. కానీ లోలోపల జరగాల్సిన నష్టం జరుగుతోంది.
- మహిళలు నెలసరిని వాయిదా వేయడం, అధిక రక్తస్రావాన్ని నియంత్రించుకోవడం కోసం వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోకుండా మందులు వాడటం..
- ఊబకాయం కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీస్తోంది.
- శారీరక శ్రమ లేకపోవడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..



- రోజుకు 45 నిమిషాలు నడవాలి, ఇతర వ్యాయామాలు చేయాలి.
- ఆహారంలో 25 శాతం పండ్లు, 30 శాతం కూరగాయలు, 25 శాతం పిండి పదార్థాలు, 20 శాతం ప్రొటీన్లు ఉండేలా చూసుకోవాలి. జంక్ ఫుడ్‌ను పూర్తిగా నియంత్రించాలి.
- శరీర బరువును నియంత్రించుకోవాలి. బీపీ, షుగర్ వంటి సమస్యలు ఉంటే తరుచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.
- తీవ్ర ఒత్తిడికి లోనవ్వకుండా ఉండాలి. ఆరు గంటలు నిద్రపోవాలి.

జీవనశైలి మార్పుపై దృష్టిపెట్టాలి..

గతంలో ఎన్నడూ లేనట్లుగా ఈ మధ్య కాలంలో యంగ్ ఏజ్ స్ట్రోక్ కేసులు ఎక్కువగా చూస్తున్నాం. సాధారణంగా 55 ఏళ్ల పైబడిన వారిలోనే స్ట్రోక్ ఎక్కువగా వస్తుంది. అయితే, ప్రస్తుతం అందుకు భిన్నంగా కేసులు వస్తున్నాయి. 25 ఏళ్ల, అంతకంటే చిన్న వయస్సు వాళ్లు బ్రెయిన్ స్ట్రోక్ బారినపడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం ఆధునిక జీవనశైలి. యువతలో కొందరు ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు అలవాటుపడుతున్నారు. ఇది కొందరిలో వ్యసనంగా మారుతోంది. ఇలాంటి వారిలో ఐదేళ్ల అనంతరం స్ట్రోక్ రావడానికి అవకాశముంది. ఈ క్రమంలో ప్రజలు జీవనశైలి మార్పు చేసుకోవడంతో పాటు బీపీ, షుగర్, ఊబకాయం నియంత్రించుకోవడంపై దృష్టి పెట్టాలి. మరోవైపు.. స్ట్రోక్ బాధితులను గోల్డెన్ హవర్‌లో ఆస్పత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి రక్షించడానికి ఆస్కారం ఉంటుంది.

– డాక్టర్ ఎన్. వెంకటసుందరాచారి, న్యూరాలజిస్ట్, మచిలీపట్నం వైద్య కళాశాల ప్రిన్సిపాల్

క్లుప్తంగా...

ఆంధ్ర విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోండి

- కిర్గిజ్‌స్థాన్‌లో భారత ఎంబసీకి విదేశాంగశాఖ ఆదేశాలు
- జీవీఎల్ లేఖపై స్పందించిన కేంద్రమంత్రి ఎస్.జైశంకర్

సాక్షి, న్యూఢిల్లీ: కిర్గిజ్‌స్థాన్‌లోని ఆంధ్ర విద్యార్థుల భద్రత కోసం చర్యలు తీసుకోవాలని విదేశాంగ శాఖ భారత రాయబార కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసింది. బిష్కెక్‌లో భారతీయ విద్యార్థులతో సహా విదేశీ విద్యార్థులపై హింస, దాడులు జరుగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో అక్కడ చదువుతున్న విద్యార్థులు, వారి కుటుంబాలు మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావును కలిశాయి. ఈ మేరకు శనివారం విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌కు జీవీఎల్ లేఖ రాశారు. 2,000 మంది ఆంధ్ర విద్యార్థులు అక్కడ చదువుతున్నారని, వారి భద్రత విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన కేంద్ర మంత్రి బిష్కెక్‌లోని విద్యార్థుల రక్షణకు అవసరమైన తక్షణ చర్యలు చేపట్టాలని భారత రాయబార కార్యాలయం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి విద్యార్థుల తల్లిదండ్రుల తరఫున జీవీఎల్ ధన్యవాదాలు తెలిపారు.

ఈఏపీ సెట్ ఐదో రోజు 57,880 మంది హాజరు

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీ సెట్–2024 ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షకు ఐదవ రోజైన సోమవారం నాడు 2 సెషన్లలో కలిపి 94.37%% హాజరు నమోదైనట్లు సెట్ చైర్మన్, కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజు తెలిపారు. 61,330 మందికిగాను 57,880 మంది పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. ఏపీతో పాటు హైదరాబాద్‌లోని సెంటర్లలో ఈఏపీ సెట్ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు.

ఏఎన్‌యూకి అంతర్జాతీయ యంగ్ యూనివర్సిటీ ర్యాంక్



ఏఎన్‌యూ: ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రకటించిన యంగ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ -2024 లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్జాతీయంగా బ్యాండ్ 401–500 ర్యాంక్‌ని, రాష్ట్ర స్థాయిలో 1 వ ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. పనితీరు సూచికలు, బోధన (అభ్యాస వాతావరణం), పరిశోధన వాతావరణం (పరిమాణం, ఆదాయం–కీర్తి), పరిశోధన నాణ్యత (సైటేషన్ ప్రభావం, పరిశోధన బలం, పరిశోధన శ్రేష్టత–పరిశోధన ప్రభావం), అంతర్జాతీయ దృక్పథం (సిబ్బంది, విద్యార్థులు–పరిశోధన), పరిశ్రమలు (ఇన్కమ్ అండ్ పేటెంట్స్) లను పరిశీలించి ర్యాంక్ లను విడుదల చేసింది. ర్యాంకులు రావడం పట్ల విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ర్యాంకింగ్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.రవిని అభినందించారు. రెక్టార్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిద్దయ్య పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించిన డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ ఫలితాలను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ విడుదల చేశారు. ఈ పరీక్షలకు బీఏ, బి.కామ్, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఏ ఓఎల్ కోర్సుల నుంచి 23, 450 మంది హాజరుకాగా, వీరిలో 23, 240 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని సీఈఆర్ ప్రకాశరావు తెలిపారు. ఈ ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద్ మూర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్దయ్య, దూర విద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, డిగ్రీ పరీక్షల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, సీటీఏ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఏసీటీఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా ప్రైవేట్ ప్రిన్సిపాళ్లు తగదు

- కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాంధీ

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులను తప్పించడం దురదృష్టకరమని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లను గతంలో అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లుగా ఉపయోగించుకునేవారని, వారిని ఇప్పుడు డిపార్ట్‌మెంటల్ అధికారులుగా నియమించడం సరికాదని తెలిపారు. పరీక్ష పేపర్ల బండిల్స్ సీల్ ఓపెన్ చేసే సమయంలో ప్రైవేటు కళాశాలలకు చెందిన వ్యక్తులు బాధ్యులుగా ఉండటంతో అనేక సమస్యలు తలెత్తుతాయని, మాస్ కాపియింగ్ జరిగే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉన్నతాధికారులు తమ నిర్ణయంపై పునరాలోచన చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

యువికా-2024పై విద్యార్థులకు అవగాహన

- యువికా-2024 ప్రోగ్రామ్‌కు దేశవ్యాప్తంగా 353 మంది విద్యార్థుల ఎంపిక
- షార్ కేంద్రానికి 51 మంది విద్యార్థులు హాజరు



యువికా-2024 ప్రోగ్రాంకు వివిధ రాష్ట్రాల నుంచి షార్ కేంద్రానికి విచ్చేసిన 51 మంది విద్యార్థులతో షార్ అధికారులు

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): యువికా–2024ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పరిధిలోని ఏడు కేంద్రాల్లో వర్చువల్ పద్ధతిలో ఈ నెల 13న లాంఛనంగా ప్రారంభించారు. దీన్ని పురస్కరించుకుని ఇస్రోలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌తో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఐఐఆర్ఎస్) డెహరాడూన్, నార్త్ ఈస్టరన్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎన్ఈఎస్ఏసీ) షిల్లాంగ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) అహ్మదాబాద్, యూఆర్‌రావు స్పేస్ సెంటర్ (యూఆర్ఎస్‌సీ) బెంగళూరు, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) తిరువనంతపురం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) హైదరాబాద్‌లో యువికా–2024పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువికా–2024 ప్రోగ్రామ్‌కు దేశవ్యాప్తంగా 353 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఎంపిక చేయగా, ఇందులో షార్ కేంద్రానికి 51 మంది విద్యార్థులు విచ్చేశారు. వీరికి సోమవారం అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 24న యువికా–2024 ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తెలిపారు.

24 నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఉదయం 8.45 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

సాక్షి, అమరావతి: పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించబోతున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ వెల్లడించారు. ఈ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సోమవారం వర్చువల్ మీటింగ్‌లో జిల్లా విద్యాశాఖాధికారులను ఆయన ఆదేశించారు. ఈ పరీక్షల కోసం 1,61,877 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 96,938 మంది బాలురు, 64,939 మంది బాలికలున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 685 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 685 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 685 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 6,900 మంది ఇన్విజిలేటర్లతో పాటు 86 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ పోలీస్ స్క్వాడ్స్ కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్లతో చర్చించి పరీక్షా కేంద్రాలకు తగినన్ని బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేంద్రంలో ఏఎన్ఎంతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఉండేలా చూడాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 8.45 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్స్ జారీ చేస్తామని చెప్పారు. మాల్ ప్రాక్టీసెస్‌కు పాల్పడితే ఏపీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్టు 1997 కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. 0866–2974540 లేదా, dir-govexmas-@yahoo.comలో సంప్రదించాలన్నారు.

పరీక్షల నిర్వహణ తేదీలిలా..

ఫస్ట్ లాంగ్వేజ్	24-05-24
సెకండ్ లాంగ్వేజ్	25-05-24
థర్డ్ లాంగ్వేజ్	27-05-24
మాథమెటిక్స్	28-05-24
ఫిజికల్ సైన్స్	29-05-24
బయోలాజికల్ సైన్స్	30-05-24
సోషల్ స్టడీస్	31-05-24
ఓఎస్ఎస్‌సీ పేపర్-1	01-06-24
ఓఎస్ఎస్‌సీ పేపర్-2	03-06-24

మూలాలు మరచిపోకూడదు

- విశ్రాంత సీజేఐ జస్టిస్ రమణ



ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌ను ప్రారంభిస్తున్న విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

నరసరావుపేట రూరల్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా మూలాలు మరచిపోకూడదని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని కేసానుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నేషనల్ ఫ్రాంఛైజ్ అధిపతి సుభాష్ కలువ అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మన భాష, సంస్కృతి పెంపొందించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనన్నారు. పల్నాడు ప్రాంతంలో అంతర్జాతీయస్థాయి విద్యాబోధనతో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఎంత ఎత్తుకు ఎదిగినా వాళ్ళ ఉన్నత విద్య కోసం పడిన కష్టాలను, తల్లిదండ్రుల బాధలను మర్చిపోకూడదన్నారు. దేశంలో వివిధ మతాలు, వివిధ భాషలు ఉన్నాయని, విద్యార్థులు తమ మాతృ భాషలోనే రాణించాలన్నారు. ప్రపంచంలో అగ్రగామిగా భారత్ ఉండబోతుందని, ప్రపంచానికే నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతామన్నారు. అంతర్జాతీయస్థాయి స్కూలు అందుబాటులోకి రావడం రైతుల పిల్లలకు వరంలాంటిదని, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌ని అందుబాటులోకి తీసుకువచ్చిన డా.నాగోతు ప్రకాష్‌రావు కుటుంబ సభ్యులను అభినందించారు. పాఠశాలలో జరిగిన ప్రతిభా పాటవ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చక్రధర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రుక్సార్ ప్రసంగానికి నోబెల్ అవార్డు గ్రహీతల ప్రశంసలు

బర్కిలీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉత్తేజకర ప్రసంగం



బర్కిలీ ఇంటర్నేషనల్‌లో ఎంసీబీ స్టూడెంట్స్ సమావేశంలో ప్రసంగిస్తున్న మహ్మద్ రుక్సార్

పెనుగొండ: పల్లెలో పుట్టి, పెరిగి ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లి స్థిరపడ్డాక..వారి సంతానం కూడా అదే బాటలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులుండవు. పెనుగొండకు చెందిన మహ్మద్ నర్గీస్, ఆరీఫ్ మహ్మద్ దంపతుల పెద్ద కుమార్తె మహ్మద్ రుక్సార్ శనివారం రాత్రి బర్కిలీ ఇంటర్నేషనల్ స్కూలులో జరిగిన ఎంసీబీ స్టూడెంట్స్ 2024 ప్రారంభోత్సవ సమావేశంలో 2021లో నోబెల్ అవార్డు పొందిన డేవిడ్ జ్యూలియస్, 2013లో నోబెల్ అవార్డు పొందిన రాండీ స్కెక్మాన్‌ల సమక్షంలో ఉత్తేజకరంగా ప్రసంగించారు. దీంతో వీరిద్దరూ రుక్సార్‌ను అభినందించారు. మహ్మద్ రుక్సార్ యూసీ బర్కిలీ స్కూల్ ఆఫ్ ఆప్టోమెట్రిలో మూడేళ్లపాటు రీసెర్చ్ అసిస్టెంట్‌గా పని చేశారు. చైల్డ్‌హుడ్ మయోపియా స్టడీ చేస్తూ బేస్‌లైన్ పేపరును ప్రచురించడానికి సిద్ధమవుతున్నారు. ఫౌండేషన్ ఫర్ ఇంటర్నేషనల్ మెడికల్ రిలీఫ్ ఆఫ్ చిల్డ్రన్ అధ్యక్షురాలిగా, దక్షిణాసియా గుండె ఆరోగ్యంపై దృష్టి సారించిన జీవా క్లినిక్ సంస్థకు బోర్డు మెంబర్‌గా కొనసాగారు. విద్యనభ్యసిస్తూనే సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తితో యూసీబీ దివానీ, మహిళా బాలీవుడ్ డ్యాటన్స్ టీంలో సభ్యురాలిగా, రెండు సంవత్సరాలు కెప్టెన్‌గాను కొనసాగి జట్టు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటేలా చేసింది.. ప్రస్తుతం న్యూరో బయాలజీతో మాలిక్యులర్, సెల్ బయాలజీలో డిగ్రీని పొందనున్నారు. పీజీ, మెడికల్ అసిస్టెంట్ శిక్షణ అనంతరం వైద్య పాఠశాలలో చేరి వైద్య వృత్తిలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆశిస్తున్నట్టు మహ్మద్ రుక్సార్ తెలిపారు.

ఎంతో ఆనందాన్నిచ్చింది

ఇద్దరు నోబెల్ అవార్డు గ్రహీతల మధ్య ఎంసీబీ 2024 ప్రారంభోత్సవ ప్రసంగం ఇవ్వడం ఆనందాన్ని ఇచ్చిందని రుక్సార్ తల్లిదండ్రులు నర్గీస్, ఆరీఫ్ దంపతులు తెలిపారు. ఎందరో తెలుగు విద్యార్థులకు ఆసక్తిని కలిగించిందని, వైద్యరంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకొని, వైద్య సేవలు అందించాలని కోరుకుంటున్నామని చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వర్షం నీటిలో హంపీ స్మారకాల ప్రతిబింబం



వర్షం నీటిలో హంపీ స్మారకాల బింబం

హొసపేటె: దక్షిణ కాశీ హంపీలో కురిసిన వర్షానికి స్మారక ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా స్మారకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షపు నీటిలో స్మారక చిహ్నాలు ప్రతిబింబించడం చూపరులను ఆకట్టుకుంది. వర్షం నీటిలో స్మారక చిహ్నాల ప్రతిబింబాన్ని స్థానికులు మొబైల్‌లో బంధించారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అనాథలకు భోజనం పెడుతున్న దృశ్యం

హొసపేటె: అఖిల భారత భవాని దీక్ష చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జాతీయ అధ్యక్షులు శ్రీలంక గణేష్ గురు భవాని పుట్టిన రోజు సందర్భంగా సోమవారం నెహ్రూ కాలనీలోని శ్రీరామ ఆనంద నందన పిల్లల అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. ముందుగా బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈవీ క్యాంప్ మహా భవాని దీక్షా పీఠం సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు తంగెళ్ల నానాజీ, గురు భవాని కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జి మహేష్ గురుభవాని, కర్ణాటక రాష్ట్ర అధ్యక్షులు నల్లరాజ్ గురుభవాని, కర్ణాటక స్టేట్ సభ్యులు శ్రీను గురుభవాని, సీనియర్ భవాని దొర, ఎరిపిల్లి బాబ్జి, ఎరిపిల్లి రాజశేఖర్, మైలపల్లి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా పరిహారం ఇవ్వరూ



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులకు పరిహారం అందించాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. రైతులకు 2023–24వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందన్నారు. రైతులకు మూడు ఎకరాలకు రూ.3 వేల నుంచి రూ.9 వేల వరకు ఇచ్చారని, రైతులకు ఫసల్ బీమా పథకం కింద పరిహారం అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

అధిక ఫీజుల వసూలు తగదు



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో 2024–25వ విద్యా సంవత్సరంలో అధికంగా డొనేషన్లు, ఫీజులు వసూలు చేయడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ పేర్కొంది. సోమవారం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అమరేష్ మాట్లాడారు. మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదవాలంటే రూ.లక్షల్లో డొనేషన్లు, వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. అధిక ఫీజులు వసూలు చేయరాదంటూ అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి రితేశ్ కుమార్, కమిషనర్ కావేరిలకు వినతి పత్రం సమర్పించారు.

పేదల బియ్యంలో గోల్‌మాల్



మాట్లాడుతున్న శివకుమార్ యాదవ్

రాయచూరు రూరల్: అన్న భాగ్య పథకం కింద పేదలకు పంచే బియ్యంలో రూ.కోట్లలో గోల్‌మాల్ జరిగిందని జయ కర్ణాటక జిల్లాధ్యక్షుడు శివకుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 10 వేల క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా నల్ల బజారుకు తరలించిన అంశంపై జిల్లా ఆహార పౌర సరఫరాల శాఖాధికారులకు, లోకాయుక్తకు ఫిర్యాదు చేశామన్నారు. ఆహార పౌర సరఫరాల శాఖాధికారులు యంకన్న, ఆనంద్, బసవరాజ్, హన్మంతు, బసవంత్ సింగ్, అబ్బాస్ అలీ కలిసి నిధులు స్వాహా చేసినా వారిపై చర్యలు శూన్యమన్నారు. ఈ సందర్భంగా మారెప్ప, నరేష్‌లున్నారు.

చాపకింద నీరులా ఐపీఎల్ బెట్టింగ్

- పోలీసు వలలోకి చిన్న చేపలు
- అజ్ఞాతంలోకి తిమింగలాలు

కోలారు: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ దందా నగరంలో చాపకింద నీరులా సాగుతోంది. పోలీసులు ఇంతవరకు అరెస్టు చేసిన వారు చిన్న చిన్న చేపలు కాగా బెట్టింగ్ దందాలో ఉన్న ఇంకా పెద్ద పెద్ద తిమింగలాలు అజ్ఞాతంలో ఉండి వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఇంతవరకు నాలుగు బెట్టింగ్ కేసులను ఛేదించి కేవలం చిన్న మొత్తంలో డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా పలువురు పంటర్‌లు ముంబై, గోవాల్లో కూర్చుని అక్కడి నుంచే వ్యవహారాలు నడిపిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఐపీఎల్ క్రికెట్ టోర్నీ అంతమ దశకు చేరుకుంది. ఐపీఎల్‌పై దేశ విదేశాలలో భారీ ఎత్తున బెట్టింగ్ జరుగుతోంది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన సీఎస్‌కే, ఆర్‌సీబీ జట్ల మధ్య జరిగిన పోటీపై భారీ ఎత్తున బెట్టింగ్ జరిగినట్లు తెలుస్తోంది. కోలారు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కూడా బెట్టింగ్ సాగుతుండగా పలు కేసులను పోలీసులు ఛేదించారు.



బెట్టింగ్‌లోకి ఆస్తులు, బంగారం

జూదర్లు డబ్బులతో పాటు బంగారం, ఆస్తులను బెట్టింగ్‌లో పెట్టడానికి వెనుకంజ వేయడం లేదు. కోలారు జిల్లాలో జరుగుతున్న ఐపీఎల్ బెట్టింగ్ దందాను అరికట్టడానికి జిల్లా ఎస్పీ ఎం నారాయణ ప్రత్యేక బృందాన్ని రచించారు. వారం రోజుల క్రితం గల్‌పేట పోలీసులు బెట్టింగ్‌లో పాల్గొన్న నలుగురిని అరెస్టు చేశారు. శనివారం మరో బెట్టింగ్ అడ్డాపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. శ్రీనివాసపురంలో బెట్టింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. కోలారు నుంచి దుబై వరకు క్రికెట్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతుందని అంటున్నారు. గతంలో బెట్టింగ్ పంటర్‌లు కోలారులోనే ఉండి వ్యవహారం నడిపే వారు. గత రెండేళ్లుగా పోలీసు యంత్రాంగం తీసుకున్న కట్టుదిట్టమైన చర్యల కారణంగా వీరు దూర ప్రాంతాల్లో కూర్చుని బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అక్కడి నుంచే ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభం కాగానే బెట్టింగ్ యాప్ లింక్ పంపించడం, ఆన్‌లైన్ బెట్టింగ్ ఐడీలు పంచుకునే ప్రయత్నం చేస్తారు. ఆన్‌లైన్‌లోనే డబ్బు వ్యవహారం జరుగుతుంది.



బెట్టింగ్‌పై నిఘా పటిష్టం

బెట్టింగ్ అడ్డుకట్టకు ప్రత్యేక బృందాన్ని రచించాం. క్రికెట్ బెట్టింగ్ యాప్‌లపై, పోలీసులపై కూడా నిఘా పెట్టాం. క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలిస్తే, పోలీసులు పాల్గొంటున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. పోలీసులు బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న వారితో చేతులు కలిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎం నారాయణ, ఎస్పీ, కోలారు

అంజలి నివాసానికి కేంద్ర మంత్రి

- కుటుంబ సభ్యులకు పరామర్శ

హుబ్లీ: కళాశాల క్యాంపస్‌లో జరిగిన నేహ హిరేమఠ హత్య కేసును రాష్ట్ర సర్కారు తీవ్రంగా పరిగణించలేదని, దిగజారుడు వ్యాఖ్యల ఫలితంగా హుబ్లీలో మరో యువతి హత్య జరిగిందని, అందువల్ల ఈ రెండు కేసులను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన అంజలి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ రెండు కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలన్నారు. డ్రగ్స్ మాఫియా జరిగే స్థలాల్లో ఔట్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ మాఫియా సమాచారం ఇచ్చిన వారి పేర్లను రహస్యంగా ఉంచి మాఫియా కఠిన చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. అంజలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన సమయంలో తగిన విధంగా స్పందించలేదని పోలీస్ అధికారులను సస్పెండ్ చేయడం ద్వారా కంటితుడుపు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. కమిషనరేట్‌ను ఎస్పీ స్థాయికి దిగజార్చడం ఉద్దేశం ఏమిటని ఆయన నిలదీశారు. అంజలి కుటుంబ సభ్యులకు కనీసం రూ.25 లక్షల పరిహారం చెల్లించి ఇంటి వసతితో పాటు తగిన రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగతంగా అంజలి కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట ఎమ్మెల్యే అరవింద బెల్లద, ఎమ్మెల్సీ ప్రదీప్ శెట్టర్‌తో పాటు నేహా తండ్రి, ఆ ప్రాంత కార్పొరేటర్ నిరంజనయ్య హిరేమఠ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: నగరంలోని పాత హుబ్లీ సోపకాది మఠం వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రూ.42,500 విలువ చేసే 180 గ్రాముల గంజాయితో పాటు రూ.200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్, ధార్వాడ తాలూకా అమ్మినబావి నివాసి జావీద్ హొలధార్ అరెస్ట్ అయిన నిందితుడు. ఇతను గంజాయి విక్రయిస్తున్న సమాచారంపై కసబాపేట పోలీసులు సీఐ రాఘవేంద్ర హళ్లూరు నేతృత్వంలో సిబ్బంది కార్యాచరణ జరిపి నిందితుడిని అరెస్ట్ చేశారు. కసబాపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాగా మరో ఘటనలో పాత హుబ్లీ గౌసియా టౌన్ గార్డెన్ దగ్గర ఆదివారం సల్వార్లను పట్టుకొని హల్‌చల్ చేస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కటగర వీధి మహమ్మద్ సాధిక్ అలియాస్ బాబా సాధిక్ బేపారి, దాదాపీర్ చౌదరి, కొలికేర ప్లాట్ ఆసిఫ్ బేపారి, బుల్డోజర్ నగర్ మోహిన్‌ఖాన్ ధార్వాడ నిందితులు. వీరిని జుడీషియల్ కస్టడీకి అప్పగించినట్లు కసబాపేట పోలీసులు తెలిపారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ



ప్రసాదానికి పూజ చేస్తున్న జంగమ స్వాములు

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవసూగూరులోని సూగూరేశ్వర ఆలయంలో సోమవారం వేలాది మంది భక్తులకు పెరుగన్నం ప్రసాదంగా పంపిణీ చేశారు. ఉదయం సూగూరేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. దేవస్థాన భక్తులు మల్లప్ప, శశికలున్నారు.

పంట నష్టపరిహారం అందించరూ



వినతిపత్రాన్ని అందిస్తున్న రైతు సంఘం నేతలు

హొసపేటె: ఇటీవల కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు చేతికి వచ్చిన అరటి పంట దెబ్బ తినడంతో రైతులు తీవ్ర నష్ట పోయారని వెంటనే పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతులు తహసీల్దార్ శృతికి వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం నేత కాళిదాస్ మాట్లాడుతూ వర్షానికి తాలూకా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో అరటి పంటకు భారీగా నష్టం ఏర్పడిందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు పంట నష్ట పరిహారం కింద ఆర్థిక సహాయాన్ని అందచేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతు సంఘం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



లారీ ఢీకొన్న బైక్ ఇదే



మృతి చెందిన మేఘన



గాయపడిన కైలాష్

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా శివపుర సమీపంలో సోమవారం జాతీయ రహదారి–50పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. బైక్‌ను లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న యువతి మేఘన(18) మృతి చెందగా, యువకుడు కైలాష్‌కు తీవ్రగాయాలు కావడంతో తదుపరి చికిత్స నిమిత్తం బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ మల్లేశప్ప, సీఐ వినాయక్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. బైక్‌పై కైలాష్, మేఘన హొసపేటె నుంచి కూడ్లిగి వైపునకు వెళుతుండగా కూడ్లిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.

పంటలకు పరిహారం చెల్లించాలి



డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: అన్నదాతల పంటలకు పరిహారం చెల్లించాలని ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం జిల్లాధ్యక్షుడు గోవిందు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని గాంధీభవన్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు గోవిందు మాట్లాడుతూ జిల్లాలోని 5 తాలూకాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 223 తాలూకాలను కరువు తాలూకాలుగా ప్రకటించడం కేవలం ప్రకటనగా మిగిలిపోయిందన్నారు. తక్షణమే కరువు పరిహారం చెల్లించాలన్నారు. అన్ని బ్యాంకుల్లో రైతు రుణాలను రద్దు చేయాలన్నారు. 1920 గ్రామాల్లో తలెత్తిన నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. పశుపక్షాదులకు మేత బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 రోజుల పనులు కల్పించాలన్నారు. రోజుకు రూ.600 చొప్పున కూలి చెల్లించాలన్నారు. అప్పుడే ఈ కరువు పరిస్థితిని తట్టుకోవచ్చని, తక్షణమే ఈ డిమాండ్లను తీర్చాలని ప్రభుత్వానికి కోరారు. ఎన్నడు లేనంతగా కరువు పరిస్థితి నెలకొందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గుర్రాళ్లి రాజు తెలిపారు. అందుకే పాలకులు యుద్ధ ప్రాతిపదికన తగిన పరిహార పనులను చేపట్టి ప్రజలను ఆదుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీమంతులకే మేలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రముఖులు హనుమంతప్ప, బసణ్ణ, పంపాపతి, ఈరణ్ణ, లింగప్ప, బసవరాజ్, అనిల్, రైతులు రెహమాన్, ఒరగళమనె హనుమంతప్ప, కాళప్ప, భైరాపుర హనుమంతప్ప, రుద్రయ్య, కాళిదాస, హొన్నూరుస్వామి, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం

- రైతు వ్యతిరేక విధానాలపై ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నాయకులు గరం



ఆందోళన చేస్తున్న బీజేపీ రైతు మోర్చా నాయకులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిందని సంబరపడుతోందని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా రాష్ట్రాన్ని, జిల్లాను ముఖ్యంగా రైతులకు చేసింది ఏమీ లేదని జిల్లా రైతు మోర్చా బీజేపీ అధ్యక్షుడు గణపాల ఐనాథరెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం జిల్లా బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలు, ఏడాదిలో ప్రజలకు చేసిందేమి లేదని, రైతులను నిండా కాంగ్రెస్ ముంచుతోందని ఆందోళన చేపట్టారు. నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా రైతులకు ఎలాంటి మేలు చేయలేదు సరికదా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులను మోసం చేస్తోందన్నారు. సంవత్సరానికి రైతులకు రెండు దఫాలుగా అందాల్సిన రూ.4వేలు ఇవ్వడం లేదని, వ్యవసాయ పంట నష్టపరిహారం సక్రమంగా అందడం లేదన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు అందజేసిన పథకాలను కొనసాగించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కరువుతో ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవడం లేదన్నారు. రైతు మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురులింగనగౌడ, మాజీ మేయర్ ఇబ్రహీంబాబు, బీజేపీ ప్రముఖులు దరప్ప నాయక్, శివరుద్రగౌడ, సిద్దప్ప, సుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలు అరికట్టాలి



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: జిల్లాలో అధికమవుతున్న నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలని కర్ణాటక రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ మాట్లాడారు. జిల్లాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పత్తి, పొద్దుతిరుగుడు, సజ్జలు, కంది వంగడాల నకిలీ విత్తనాలను విక్రయించడానికి వచ్చేవారి వద్ద లైసెన్సులు ఉండవన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకుండా రైతులకు ప్రచారం చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. 2024–25వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ జేడీ దేవికాకు వినతిపత్రం సమర్పించారు.

కోలారు వార్తలు...

సాహితీవేత్తకు ఘనంగా నివాళి



ఆనంద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మాలూరు: సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత లక్కూరు సి.ఆనంద్ మరణించిన నేపథ్యంలో ఆయనకు లక్కూరు గ్రామంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సి.ఆనంద్ చిన్న వయసులోనే సాహిత్య రంగంలో అపార సాధన చేశారన్నారు. లక్కూరు గ్రామంలో జన్మించిన ఆనంద్ సాహిత్య రంగంలో తనదైన సాధన చేసి గ్రామానికే కీర్తి ప్రతిష్టలు తెచ్చారన్నారు. చిన్న వయస్సు నుంచే దళితులపై ఆకర్షితుడైన ఆనంద్ రచనలతో పాటు దళితులపై దౌర్జన్యాలపై కూడా అనేక రచనలు చేసి దళితులను జాగృతం చేసే ప్రయత్నం చేశారన్నారు. తెలుగు నుంచి కన్నడంలోకి అనేక అనువాద రచనలు చేశారన్నారు. సి.ఆనంద్ మరణం సాహిత్య లోకానికి తీరని లోటన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు



విజయలక్ష్మి

కోలారు: ఏపీఎంసీ మార్కెట్ యార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను సహించలేని పలువురు కూరగాయల దళారులు అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని, వారి ఆరోపణలు సత్యదూరమని ఏపీఎంసీ మార్కెట్ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. ఎసోమవారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూరగాయల మండీ యజమానులు కూడా వీరితో చేతులు జోడించి అకారణంగా విధులకు అడ్డు పడుతున్నారన్నారు. రైతులకు తెల్ల చీటీలు ఇవ్వకుండా అధికారిక రసీదు ఇవ్వడం, రైతులు తెచ్చే 100 కిలోలకు 5 నుంచి 10 కిలోలు తగ్గించి చూపించడం, చెల్లింపుల్లో తక్కువ చెల్లిస్తుండడం, కూరగాయల వేలాన్ని నిర్ణీత సమయంలో వ్యాపారులు నిర్వహించేలా చేయడం, కూరగాయలు చెడిపోయే అవకాశం ఉండడం వల్ల శనివారం సెలవు పెట్టకూడదని తెలపడం వంటి మార్పులు తేవడం దళారులు, వ్యాపారులకు నచ్చలేదన్నారు. రైతులకు చెక్ ద్వారానే డబ్బులు ఇవ్వాలని సూచించడం కూడా వ్యాపారులకు నచ్చనందుకే తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన విధులకు అడ్డుపడుతున్న కొంతమంది కూరగాయల మండీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

మఠాధిపతుల ఒత్తిడితోనే డీసీపీపై వేటు



మాట్లాడుతున్న కోటిగానహళ్లి రామయ్య

కోలారు: హుబ్బళ్లిలో అంజలి అంబిగేర హత్య కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మఠాధిపతుల ఒత్తిడికి తలొగ్గి దళిత పోలీసు అధికారి డీసీపీ ఎం రాజీవ్‌ను సస్పెండు చేసిందని, ఈ విధంగా ప్రభుత్వం దళితులకు అన్యాయం చేసిందని సాహితీవేత్త కోటిగానహళ్లి రామయ్య ఆరోపించారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తోందన్నారు. 24 గంటల్లోగా పోలీసు అధికారి ఎం.రాజీవ్ సస్పెండు ఆదేశాలను వెనక్కు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి దళితులపై ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. రాష్ట్రంలో హత్యలు జరగడం ఇదే మొదటి సారా? అని ప్రశ్నించారు. గతంలో జరిగిన హత్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇలాంటి ఘటనల్లో గతంలో వారి వారి కుల అధికారులను రక్షించారన్నారు. అంజలి హత్య కేసులో అధికారిని బలి పశువును చేశారన్నారు. మల్లికార్జున ఖర్గే, పరమేశ్వర్, హెచ్‌సీ మహదేవప్పలు దళిత జాతికి ద్రోహం చేస్తున్నారన్నారు. వీరు కుటుంబ రాజకీయ నాయకులన్నారు. దళితుల సమస్యలపై వీరు ఏనాడూ స్పందించలేదు, చేసిందేమీ లేదన్నారు.

గ్యారెంటీలే గెలుపునకు సోపానాలు



మాట్లాడుతున్న కేవీ రాంప్రసాద్

కోలారు: ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డీటీ శ్రీనివాస్ తరపున సోమవారం ముళబాగిలు పట్టణంలోని వివిధ విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. కేపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రాంప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గ్యారెంటీ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నివృత్త కేఏఎస్ అధికారి డీటీ శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కిసాన్ ఖేత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రగౌడ, కేపీసీసీ ఎస్సీ బ్లాక్ తాలూకా అధ్యక్షుడు వి.మారెప్ప, అశోక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలతో 'ప్రైవేట్'పై ప్రజల్లో జాగృతి



మాట్లాడుతున్న నారాయణగౌడ

కోలారు: ప్రైవేటు పాఠశాలల్లో డొనేషన్ల బెడదను అరికట్టడానికి, అనధికారిక పాఠశాలలు, కళాశాలలపై కరపత్రాలను పంచడం ద్వారా ప్రజలను జాగృతం చేస్తున్నట్లు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ తెలిపారు. సోమవారం ముళబాగిలు తాలూకా వడ్డహళ్లి ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. వారం రోజుల్లోగా అనధికార ప్రైవేటు పాఠశాలల జాబితాను తయారు చేసి డొనేషన్లు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు బ్రిటిష్‌వారి కాలం నుంచి ప్రైవేటు పాఠశాలల తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను ,చదివిస్తున్న తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సౌకర్యాలను కల్పిస్తే ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లాగా పెరిగేవి కావన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, ఫారూక్ పాషా, హెబ్బణి ఆనందరెడ్డి, బంగారి మంజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నకిలీ న్యూట్రిషన్‌ను అరికట్టండి



వినతిపత్రం సమర్పిస్తున్న జావిద్ ఖాన్

రాయచూరు రూరల్: జిల్లాలో నకిలీ హెర్బల్ న్యూట్రిషన్ విక్రయాలను అరికట్టాలని జనసేవా ఫౌండేషన్ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు జావిద్ ఖాన్ మాట్లాడారు. మాన్విలో నకిలీ హెర్బల్ న్యూట్రిషన్లను విక్రయిస్తున్న హెర్బల్ న్యూట్రిషన్ అంగడి యజమాని కళ్యాణ్, భార్య అంబికాల లైసెన్సులను రద్దు చేసి, నకిలీ హెర్బల్ న్యూట్రిషన్లను కొనుగోలు చేయకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ప్రభులింగ శివాచార్యుల వర్ధంతి



పూజలు చేస్తున్న స్వామీజీలు

రాయచూరు రూరల్ : జిల్లాలోని దేవదుర్గ తాలూకా గబ్బూరులో ప్రభులింగ శివాచార్యుల వర్ధంతి నిర్వహించారు. సోమవారం ప్రభులింగ బృహన్మఠంలో కిల్లె మఠాధిపతి శాంత మల్ల శివాచార్య 22వ పట్టాధ్యక్షుడు ప్రభులింగ శివాచార్యుల మూల విరాట్‌కు అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మంగళహారతిలు నెరవేర్చారు. గబ్బూరు మఠాధిపతి బూది బసవ శివాచార్యులు, సుల్తాన్‌పుర మఠాధిపతి శంభుసోమనాథ శివాచార్యులు, రేణుకాచార్య, శరణయ్యలున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు.

సంఘవిద్రోహ శక్తులపై కఠిన చర్యలు

హుబ్లీ: జంట నగరాల్లో గత కొన్ని నెలలుగా అవాంఛనీయ సంఘటనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరాల్లో పర్యటించి పరిశీలించారు. అంతేగాక నేరాలు, సంఘ విద్రోహ శక్తులపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చట్టం, న్యాయవ్యవస్థల ఏడీజీపీ ఆర్.హితేంద్ర తెలిపారు. హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం అధికారులతో కీలక సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే జరిగిన అవాంఛనీయ ఘటనలపై ప్రజల అభిప్రాయం, పోలీస్ శాఖ కార్యవైఖరిపై సమీక్షించి సమావేశం నిర్వహించి వివరాలను సేకరించానన్నారు. ఆ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఫిర్యాదు వచ్చినప్పుడు తగిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అంజలి అంబిగేర కేసులో ఆమె అవ్వ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలపై సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా అంజలి కేసులో నిందితుడైన గిరీష్ ఆరోగ్యం ఇంకా కోలుకోలేదని, రెండు రోజుల తర్వాత కిమ్స్ ఆస్పత్రి నుంచి విడుదల అవుతారని కిమ్స్ ఆస్పత్రి ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్.ఎ స్‌ఎఫ్ కమ్మరా తెలిపారు.